



ESTD: 1999

www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ | 14-04-2026 మంగళవారం | సంపుటి : 27 | సంచిక : 42 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on






# డీలిమిటేషన్‌తో డీలింక్

## మహిళల కోటా బిల్లుకు అభ్యంతరం లేదు

- లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనలో 50 శాతం పెంపు ఫార్ములా కుట్రపూరితమైనది
- దాని వల్ల ఉత్తరాది రాష్ట్రాల రాజకీయ బలం పెరిగి దక్షిణాది కేవలం పన్నుల చెల్లింపుకే పరిమితమవుతుంది
- మహిళల రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ తోలింకు పెట్టడం దురుద్దేశంతో కూడుకున్నది
- నియోజకవర్గాలు పెంచడానికి కేవలం జనాభానే కాకుండా రాష్ట్రాల జీఎస్ డిపి, ఇతర అభి వృద్ధి సూచీలను ప్రామాణికంగా తీసుకోవాలి
- పునర్విభజనపై ఏకపక్ష నిర్ణయాలు దేశ సమగ్రతకు సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల రక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదు : మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో 50 శాతం దామాషా ప్రతిపాదన దేశానికి ప్రమాదకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును ముసుగుగా వాడుకుని దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా కేంద్రం డీలిమిటేషన్ ప్రక్రియను చేపడుతోందని ఆరోపించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయ బలం పెరుగుతుందని, అభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 50 శాతం పెంపు ఫార్ములాను తాము వ్యతిరేకిస్తున్నామని, ఈ విధానం అమలులోకి వస్తే కేరళ వంటి చిన్న రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల సీట్ల అంతరం ఏకంగా 90కి పెరుగుతుందని గణాంకాలతో వివరించారు. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ క్యాపిటల్స్ గా మారుతుంటే, దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ క్యాపిటల్స్ గా సేవలందిస్తున్నాయని, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా? అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని నిలదీశారు.

**రెండింటికీ లింక్ :** మహిళా రిజర్వేషన్ల అంశంలో తమ పూర్తి మద్దతు ఉందని, అయితే దానికి డీలిమిటేషన్‌తో లింక్ పెట్టడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడున్న సీట్లలోనే మహిళలకు కోటా కేటాయించి గత ఎన్నికల నుంచే అమలు చేయాల్సి ఉండేదని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గాల పెంపునకు కేవలం జనాభానే కాకుండా రాష్ట్రాల జీఎస్‌డిపి , ఇతర అభివృద్ధి సూచీలను కూడా ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పునర్విభజన విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం దేశ సమగ్రతకు మరియు సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు తక్షణమే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలించిన తర్వాతే కేంద్రం ముందడుగు వేయాలని ఆయన సూచించారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఈ అంశంపై ఇతర రాష్ట్రాల నేతలతో కలిసి పోరాడతామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తన పార్టీ ప్రయోజనాలను పక్కన పెట్టి, దేశవ్యాప్తంగా ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే ఈ సున్నితమైన విధానాలపై నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీనివల్ల ఏర్పడే అసమానతలు దీర్ఘకాలంలో దేశ అంతర్గత భద్రతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు కూడా వేర్వేరు అంశాలని, అయితే రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వీటిని కావాలనే కలిపి గందరగోళం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.

### మేం వ్యతిరేకం కాదు

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పెంపు అనేవి దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశాలని, ఇవి కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంతర్గత వ్యవహారాలు కాదని, యావత్ దేశ ప్రజల అస్తిత్వానికి సంబంధించినవని చెప్పారు. కానీ, బీజేపీ మాత్రం ఈ అంశాలను

మిగతా 2లో

## జూన్‌లో టెట్

### టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు

### ఈ నెల15 నుంచి 30 వరకు

### ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ




**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు విద్యాశాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహణకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం, ఈ నెల15 నుంచి 30వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ ఏడాదిలో ఇది రెండో టెట్ నోటిఫికేషన్ కావడంతో, డీఎస్సీ (డిఎస్సీ) కోసం సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు ఇది ఒక అద్భుతమైన అవకాశంగా మారనుంది. మిగతా 2లో

## సర్ కేసులో సుప్రీం విచారణ వాయిదా



5

# ఇరాన్‌పై దిగ్బంధం కత్తి

**వుదయం డెస్క్, ఏప్రిల్ 13 :** పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా నావికా దిగ్బంధనం వల్ల సంభవించే పరిణామాలను ఒక తాజా ఆర్థిక అంచనా వెల్లడించింది. ఈ చర్యను అమలు చేస్తే ఇరాన్ రోజుకు సుమారు 435 మిలియన్ డాలర్ల ప్రత్యక్ష నష్టాలను చవిచూడవచ్చని అమెరికా ట్రెజరీ మాజీ అధికారి మిదాద్ మలేకీ అంచనా వేశారు. దీనిలో భాగంగా ప్రతిరోజూ సుమారు 276 మిలియన్ డాలర్ల ఎగుమతుల నష్టం, 159 మిలియన్ డాలర్ల దిగుమతుల అంతరాయం ఉంటుంది, దీని ఫలితంగా ప్రతి నెలా దాదాపు 13 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లుతుంది.

### వాణిజ్యంపై ఆధారపడటం, చమురు ప్రభావం

ఇరాన్ వాణిజ్యంలో 90 శాతానికి పైగా పర్షియన్ గల్ఫ్ ద్వారానే జరుగుతుందని మలేకీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయంలో దాదాపు 80 శాతం చమురు, గ్యాస్ నుంచే వస్తుంది. ఇది జీడీపీకి సుమారు 23.7 శాతం దోహదపడుతుంది. ఒక్క ఖర్గ్ ద్వీపమే ఏటా సుమారు 53 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తుంది, ఇది ఇరాన్ ఇంధన ఎగుమతులలో దాని కీలక పాత్రను నొక్కి చెబుతోంది. ఏ విధమైన అంతరాయం కలిగినా దాని తీవ్ర ప్రభావాన్ని ముడి చమురు రంగం భరించాల్సి ఉంటుంది. ఇరాన్ రోజుకు సుమారు 1.5 మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేస్తూ, దాదాపు 139 మిలియన్ డాలర్లను ఆర్జిస్తోంది. ఒకవేళ దిగ్బంధనం ఏర్పడితే, ఈ మొత్తం ఆదాయ మార్గం తక్షణమే నిలిచిపోవచ్చు. ఇరాన్ చమురు ఎగుమతులలో దాదాపు 92 శాతం ఖార్గ్ ద్వీపం గుండా వెళ్తాయి, దీనికి ప్రస్తుతం ఆచరణీయమైన ప్రత్యామ్నాయ మార్గం లేదు. దీనితో పాటుగా, పెట్రోకెమికల్స్, చమురుయేతర వాణిజ్యానికి ముప్పు కలుగుతుంది.



భద్రత అందరికీ వర్తిస్తుంది : ఇరాన్ 5

2024–25 ఆర్థిక సంవత్సరపు మొదటి తొమ్మిది నెలల్లో, ఇరాన్ 19.7 బిలియన్ డాలర్ల విలువైన పెట్రోకెమికల్స్‌ను ఎగుమతి చేసింది. ఇది రోజుకు సుమారు 54 మిలియన్ డాలర్లకు సమానం. చమురుయేతర వాణిజ్యం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. 2025లో, ఇరాన్ చమురుయేతర వాణిజ్య విలువ 51.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది; ఇందులో గల్ఫ్ మార్గం ద్వారా రోజుకు సుమారు 88 మిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు సాగాయి. ఇందులో దాదాపు 90 శాతం, అంటే రోజుకు సుమారు 79 మిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం నిలిచిపోయే ప్రమాదం ఉంది.

### కీలక ఓడరేవులపై ప్రత్యక్ష ప్రభావం

దిగ్బంధనం ఏర్పడితే కీలక లాజిస్టిక్స్ కేంద్రాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇరాన్ సరుకు రవాణాలో సుమారు 53 శాతాన్ని షాహిద్ రాజాయీ పోర్ట్ నిర్వహిస్తుండగా, నిత్యావసర వస్తువుల దిగుమతులలో 58 శాతం ఇమామ్ ఖొమేనీ పోర్ట్ ద్వారా జరుగుతున్నాయి. గతేడాది బుషెహర్ ఓడరేవులు సుమారు 57 మిలియన్ టన్నుల సరుకును నిర్వహించాయి. ఈ సదుపాయాలన్నీ గల్ఫ్ ప్రాంతంలోనే నెలకొని ఉన్నాయి, కాబట్టి సముద్ర రవాణాపై విధించే ఎటువంటి ఆంక్షలకైనా ఇవి ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయి. పరిమిత ప్రత్యామ్నాయాలు స్వల్ప ఉపశమనాన్ని అందిస్తున్నాయి.

## పాలక ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదిరేది ఎలా?

# డీలిమిటేషన్ ఢీ

వివాదాస్పదంగా మారుతున్న బిల్లులు ● మహిళా రిజర్వేషన్లకు ఒకే ● నియోజకవర్గాల పునర్విభజనకు నో అంటున్న ప్రతిపక్షం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (వుదయం):** లోక్‌సభ స్థానాలను 543 నుండి 816కు పెంచడానికి, అలాగే వాటిలో మూడో వంతు స్థానాలను, ఖచ్చితంగా చెప్పాలంటే 273 స్థానాలను మహిళలకు కేటాయించడానికి వీలుగా రాజ్యాంగాన్ని సవరించే రెండు ప్రతిపాదిత బిల్లులను ఆమోదించే నిమిత్తం, ఏప్రిల్ 16 నుండి 18 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం జరుగనున్నాయి. ఈ పునర్విభజన ప్రణాళిక, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షానికి మధ్య ఒక ప్రధాన వివాదాంశంగా మారింది. ఈ బిల్లులను ఆమోదింపజేయడానికి ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు అవసరం, ఎందుకంటే రాజ్యాంగ సవరణలకు మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, అది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు లేదు. అన్ని పార్టీలు కలిసి చేసుకున్న వాగ్దానాన్ని ఈ మార్పులు నెరవేరుస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంటున్నారు. అయితే, అసలు సమస్య మహిళా రిజర్వేషన్ కాదని, దాని పట్ల ఎవరికీ అభ్యంతరం లేదని అంటూనే, దానితో పాటు తీసుకువస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియే అసలు సమస్య అని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ తన వ్యాసంలో పేర్కొన్నారు. సోమవారం నాడు, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ఇరు పక్షాలు తమ వైఖరులను బహిరంగంగా ప్రకటించాయి. రెండు బిల్లుల్లో తొలిది రాజ్యాంగ సవరణకి పార్లమెంటులో మూడింట రెండువంతుల మెజారిటీ అవసరం అవుతుంది.



మిగతా 2లో

### మహిళల కోటాపై సిఎంకు అవగాహన లేదు

పార్లమెంట్‌లో చర్చ అందరు ఎంపీలు మాట్లాడొచ్చు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



### సమ్మెపై తొందరొద్దు

ఆర్టీసీ కార్మికులకు

రవాణా శాఖ మంత్రి పొన్నం సూచన

ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశాలపై కమిటీ వేశాం



2

### కేసీఆర్‌కు సీతక్క నోటీసులు



అంగన్ వాడి సిబ్బందికి మొబైళ్ల పంపిణీలో నిరాధార ఆరోపణలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్

### నీ చెల్లి ప్రశ్నలకు జవాబు చెప్పు



ఆ తర్వాతే కేటీఆర్ పాదయాత్ర, పార్టీ పేరు మార్పు విషయంలో ఆలోచన చేయాలి

కేటీఆర్ కు మంత్రి అడ్లూరి డిమాండ్

# ముడులు విప్పుతున్న భూభారతి




- భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి
- చరిత్రాత్మక చట్టానికి రేపటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5కోట్ల మందికి పైగా పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది లాగిన్
- 3.80 లక్షల మందికి పాస్‌బుక్‌లు జారీ రోవర్లతో సర్వే.. ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ పాలనలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు.





భూభారతి చట్టం అమలులోకి వచ్చి నేటితో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదనీ తెలంగాణలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ తో తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నాటి పరిస్థితిని పూర్తిగామార్చాలన్న సంకల్పంతో పారదర్శ కత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు.

మిగతా 2లో

### డిప్యూటీ సిఎం భట్టికి మధు పార్క్ రిడ్జి నివాసుల ప్రతిపాదనలు

● మూడింటిని మానవీయ కోణంతో పరిశీలించి న్యాయం చేస్తామన్న ఉప ముఖ్యమంత్రి



2

### పదేండ్ల విధ్వంసంపై ప్రజలకు వివరణ ఇవ్వాలి

కేటీఆర్ కు టీపీసీసీ చీఫ్ డిమాండ్

తెలంగాణలో బీఆర్ఎస్ పుంజుకోవడం అసాధ్యం



3

# ముడులు విప్పుతున్న భూభారతి

మొదటి పేజీ తరువాయి

భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని మంత్రి అన్నారు. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది అంబేద్కర్ జయంతి రోజు భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారిందన్నారు. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచిందని చెప్పారు ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించిందన్న మంత్రి ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారని వివరించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారన్నారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నట్లు చెప్పారు. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగిందన్నారు. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు




గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నామన్నారు. జిల్లాకు 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సర్వే చేపట్టబోతున్నామని చెప్పారు. సర్వే అనంతరం హద్దులను గుర్తించి భూధార్ నెంబర్ ఇస్తామన్న పొంగులేటి. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలంగాణలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వేనెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ 77 సంవత్సరాలలో 2కోట్ల 29 లక్షలకు చేరాయన్నారు. వీటన్నింటికీ భూధార్ నెంబర్ ఇవ్వడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నామని తెలిపారు. భూ సర్వేకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకున్నట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చి 5,520 మంది లైసెన్సడ్ సర్వేయర్లకు లైసెన్సులు జారీ చేశామన్నారు. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు సర్వేయర్లను నియమించామన్నారు.

రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించఅమన్నారు.గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వీలైనంత వరకు వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామనగన మంత్రి. త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నట్లు వెల్లడించారు. భూ భారతి పోర్టల్ ప్రారంభించిన గత ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 3.80 లక్షల పాస్ బుక్‌లు జారీచేశామని వివరించారు

## జూన్ లో టెట్

మొదటి పేజీ తరువాయి



అయితే తక్కువ సమయం ఉన్నందున అభ్యర్థులు అప్రమత్తమై దరఖాస్తు ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం, జూన్ నెలలో టెట్ పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. పరీక్షా కేంద్రాల ఎంపిక, హాల్ టికెట్ల జారీ, ఇతర సాంకేతిక అంశాలపై విద్యాశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. దీంతో అభ్యర్థులు సిలబస్‌ను సరిచూసుకుని, జూన్‌లో జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

**దరఖాస్తు గడువు - ఫీజు వివరాలు**

టెట్ 2026కి అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించారు. ఈ పరీక్షలకు ఒక్క పేపర్‌కు బీసీ/ఓసీ అభ్యర్థులకు రూ.750, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులకు రూ.700. రెండు పేపర్లకు బీసీ/ఓసీ అభ్యర్థులకు రూ. 1000, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులకు రూ. 950 రూపాయలకు చెల్లించాల్సి ఉంటుంది.

**పరీక్షల షెడ్యూల్- అర్హత మార్కులు**

టెట్ పరీక్షలను జూన్ 15 నుండి జూన్ 30, 2026 మధ్య కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు జూన్ 09 నుండి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 60శాతం, బీసీ అభ్యర్థులకు 50శాతం, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులకు 40శాతం అంతకంటే ఎక్కువ మార్కులు రావడం తప్పనిసరి. ఈ పరీక్షా ఫలితాలను జూలై 28 నుండి 31 మధ్య విడుదల చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు కోరుతున్నారు.

## డీలిమిటేషన్ ఢీ

మొదటి పేజీ తరువాయి

రెండవది డీలిమిటేషన్‌కు సంబంధించింది లేదా భౌతికంగా లోక్‌సభ స్థానాల మ్యాప్‌లను తిరిగి నిర్వచించడం. ముఖ్యంగా, ఈ ప్రక్రియ 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉంటుంది, ఈ నెలలో ప్రారంభమైన జనాభా లెక్కల డేటా అందుబాటులోకి రావడానికి కొంత సమయం పడుతుంది కనుక దాని ఆధారంగా కాదు.

2023లో ఏకగ్రీవ మద్దతుతో ఆమోదించిన మహిళా కోటాకు సంబంధించిన మునుపటి సవరణ, కోటా అమలును తదుపరి జనాభా లెక్కలకు ముడిపెట్టారు. అది ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్రారంభం కూడా కాలేదు. దాని ప్రకారం, 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి అసలైన రిజర్వేషన్ అమలులో ఉండదు.

ఇప్పుడు, 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు నియోజకవర్గ సరిహద్దులను తిరిగి గీయడానికి, తాజా జనాభా లెక్కల కోసం వేచి చూడకుండా 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చింది. ప్రతిపక్షం 2029లోనే కావాలని డిమాండ్ చేసింది, మేం ఇచ్చాం

సోమవారం మాట్లాడుతూ, అన్ని పార్టీలూ కోరుకుంటున్న దానిని ఈ ప్రత్యేక సమావేశం నెరవేరుస్తుందని ప్రధాని మోడీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో ఆమోదించినప్పుడు, అన్ని పార్టీలూ కూడా దానిని 2029 నాటికి అమలు చేయాలని కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**అసలు సమస్య'పై సోనియా గాంధీ వ్యాసం**

అయితే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మహిళా రిజర్వేషన్లకు, దానితో పాటు చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపారు. ఇక్కడ మహిళా రిజర్వేషన్లు సమస్యే కాదు. ఆ విషయం ఇప్పటికే ఒక కొలిక్కి వచ్చింది. అసలు సమస్య నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియే. అనధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం చూస్తే, ఇది అత్యంత ప్రమాదకరమైనది, స్వయంగా రాజ్యాంగంపైనే ఒక దాడి వంటిది, అని ఆమె 'ది హిందూ' పత్రిక కోసం రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు.చారిత్రకంగా ఆనవాయితీగా వస్తున్నట్లుగానే, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు ముందుగా తప్పనిసరిగా ఒక కొత్త జనాభా గణన జరగాలని ఆమె వాదించారు.

లోక్‌సభలో రాష్ట్రాల వాటాలకు సంబంధించిన అంశాన్ని ఆమె సూటిగా ప్రస్తావించారు. ఏ పునర్విభజన ప్రక్రియ అయినా, చిన్న రాష్ట్రాలను, తమిళనాడు, కేరళ వంటి చాలా దక్షిణాది రాష్ట్రాల మాదిరిగా సంపూర్ణంగా గానీ లేదా సాపేక్షంగా గానీ నష్టపరిచే విధంగా ఉండకూడదని ఆమె పేర్కొన్నారు. సీట్లను దామాషా ప్రకారం పెంచినా కూడా అలాంటి రాష్ట్రాలకు నష్టం వాటిల్లవచ్చని, ఎందుకంటే సంఖ్యాపరమైన వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపిస్తుందని ఆమె వాదించారు. ఏకరీతిగా 50% సీట్లను పెంచడం వల్ల పార్లమెంటులో రాష్ట్రాల దామాషా వాటాలకు ఎలాంటి భంగం కలగదని బీజేపీ వాదిస్తోంది.

**దక్షిణాది ఆందోళన: కోటా ఇవ్వండి, కానీ నియోజకవర్గాల పునర్విభజన ఎందుకు?**

రిజర్వేషన్, లోక్‌సభ సీట్ల పునర్విభజన అనే రెండు అంశాలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కలిపివేస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఆరోపించారు. కొత్తగా నియోజకవర్గాల పునర్విభజన గానీ, లోక్‌సభ సీట్ల సంఖ్యలో మార్పు గానీ చేయకుండా, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**సీట్ల సంఖ్య ఎలా పెరుగుతుంది?**

ప్రభుత్వ ప్రణాళికలోని నియోజకవర్గాల పునర్విభజన అంశం, పార్లమెంటులో సమాఖ్య సమతుల్యతపై గణనీయమైన ప్రభావాలను కలిగి ఉంది.ప్రతిపాదిత 50 శాతం ఏకరీతి పెంపుదల ప్రకారం, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల లోక్‌సభ సీట్ల సంఖ్య 80 నుండి 120కి; బీహార్‌లో 40 నుండి 60కి పెరుగుతాయి. బీజేపీ సాధారణంగా పట్టు సాధించడానికి ఇబ్బందిపడే దక్షిణాది రాష్ట్రాలలో, తమిళనాడు సీట్ల సంఖ్య 39 నుండి సుమారు 59కి, అలాగే కేరళలో 20 నుండి 30కి పెరుగుతుంది. ప్రతి రాష్ట్రానికి కేటాయించిన స్థానాలు ఒకే నిష్పత్తిలో పెరుగుతాయి కాబట్టి, పార్లమెంటులో ఏ రాష్ట్ర వాటాలోనూ ఎటువంటి మార్పు ఉండదని ప్రభుత్వ వైఖరి.

ఐదు దక్షిణాది రాష్ట్రాలైన, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రస్తుతమున్న 543 స్థానాల సభలో సమిష్టిగా 23.8% వాటాను కలిగి ఉన్నాయి. సభ విస్తరణ అనంతరం, 816 స్థానాల సభలో వీటి వాటా 23.9%కి చేరుకుంటుంది. ఇది నామమాత్రపు మార్పు మాత్రమే. ఒక ప్రాథమిక గణన ప్రకారం, ఉత్తరాదిలోని హిందీ మాట్లాడే రాష్ట్రాలకు, దక్షిణాది రాష్ట్రాలకు మధ్య సీట్ల సంఖ్యలో ఉన్న అంతరం మరింత పెరుగుతుంది. ఇందులో ఉత్తరాది రాష్ట్రాలు మొత్తంగా 88 సీట్లను, దక్షిణాది రాష్ట్రాలు 66 సీట్లను అదనంగా పొందుతాయి. దీనివల్ల, రాజ్యాంగ సవరణలను అడ్డుకోవడానికో లేదా రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ వంటి అంశాలకు సంబంధించిన మార్పులను ప్రతిఘటించడానికో చిన్న కూటములు ఏకం కావడం మరింత కష్టతరం అవుతుంది.ఓటింగ్ జరిగే రోజున సభ్యుల హాజరును బట్టి, లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడానికి ప్రభుత్వానికి ఎన్డీయే కూటమి వెలుపల నుండి అదనంగా 60 నుంచి 70 ఓట్ల మధ్య అవసరమవుతాయి. ఎన్డీయే లేదా ఇండీ కూటములలో దేనిలోనూ స్థిరంగా లేని ప్రాంతీయ పార్టీలు — బిజెడి, వైఎస్ ఆర్ కాంగ్రెస్, ఇతర పార్టీలు — మద్దతు కోసం ప్రభుత్వం ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్న కీలకమైన స్వింగ్ ఓట్లుగా ఉన్నాయి. కొత్త డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన రెండవ బిల్లు ఒక సాధారణ చట్టం, దీనికి కేవలం సాధారణ మెజారిటీ అవసరం, దానిని ఎన్డీఏ సాధించగలదు. మూడవది, ఇంకా ఉన్నత శ్రేణికి చెందిన బిల్లులకు, ప్రత్యేక మెజారిటీతో పాటు కనీసం సగం రాష్ట్ర శాసనసభల ఆమోదం కూడా అవసరం. ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన లేదా రాష్ట్రపతి ఎన్నిక వంటి సమాఖ్య నిర్మాణానికి నేరుగా సంబంధించిన నిబంధనలకు వర్తిస్తుంది. వీటిలో దేనికీ రాష్ట్ర శాసనసభ ఆమోదం అవసరం లేదు. కాబట్టి, ఈ చర్య వల్ల సమాఖ్య స్థాయిలో భారీ పరిణామాలు ఉన్నప్పటికీ — వారు ఈ బిల్లులను అడ్డుకోలేరు. వారు కేవలం రాజకీయ ఒత్తిడిని మాత్రమే ఉపయోగించగలరు.

## నీ చెల్లి ప్రశ్నలకు జవాబు చెప్పు

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో ఏం సాధించారని పార్టీ పేరు మార్చుకుని దేశమంతా తిరిగారని గతంలో శాసనమండలి వేదికగా కవిత బీఆర్ఎస్ కు వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పిన తర్వాతే కేటీఆర్ పాదయాత్ర, పార్టీ పేరు మార్పు విషయంలో ఆలోచన చేయాలని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. కేటీఆర్ కు పౌరుషం ఉంటే బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చర్చకు ముందుకు రావాలని సవాల్ చేశారు నిరుద్యోగుల ఉసురు తగిలి బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. సోమవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. దోచుకో.. దాచుకో అనేది బీఆర్ఎస్ సిద్ధాంతం అని విమర్శించారు. అసూయతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

## డిప్యూటీ సీఎం భట్టికి మధు పార్క్ రిడ్జి నిర్వాసితుల ప్రతిపాదనలు

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునర్జీవనం పథకంలో ఇండ్లు, వ్యాపారాలు కోల్పోతోన్న తమకు న్యాయం చేయాలని మధు పార్క్ ఏ బ్లాక్ నిర్వాసితులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు విజ్ఞప్తి చేశారు. అందుకు మూడు ప్రతిపాదనలను పరిశీలన కోసం సమర్పించారు. సోమవారం మధ్యాహ్నం మధు పార్క్ రిడ్జ్ ఏ బ్లాక్ నిర్వాసితులు హైదరాబాదులోని ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎంను కలిశారు. మూసి పునర్జీవనం అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్న నిర్వాసితులు అందులో తమను భాగస్వాములను చేయాలని కోరారు.

నిర్వాసితుల ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ మూడు ప్రతిపాదనలను మానవీయ కోణంలో ఆలోచించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మధు పార్క్ రిడ్జ్ ఏ బ్లాక్ నిర్వాసితులు ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి మూసి క్యాబినెట్ సబ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎంకు విజ్ఞాపన పత్రం సమర్పించిన వారిలో మధు పార్క్ రిడ్జ్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ డాక్టర్. కె శ్రీశైలం, సెక్రెటరీ డాక్టర్ కరీముల్లా, సలహాదారు సంజయ్ శుక్ల, లీగల్ అడ్వైజర్ ప్రతాపరెడ్డి, జేపీసీ బి.యన్.రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

## కేసీఆర్ కు సీతక్క నోటీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో అంగన్వాడి సిబ్బందికి పంపిణీ చేసిన మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సోమవారం లీగల్ నోటీసు పంపారు. సీతక్క తరపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా కేసీఆర్‌కు ఈ నోటీసును పంపించారు.అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీటీఎస్ఎల్) నిర్వహించిందని మంత్రి నోటీసులో తెలిపారు. టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి సీతక్క వివరించారు. మొత్తం టెండర్ విలువ రూ.44 కోట్లు మాత్రమే ఉన్నప్పటికీ, అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, ఆధారాలు లేని ఆరోపణలని సీతక్క పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 48 గంటల్లో సోషల్ మీడియాలోని ఆ పోస్టులను తొలగించి.. కేసీఆర్ క్షమాపణ చెప్పాలని నోటీసులో స్పష్టం చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని లీగల్ నోటీసులో మంత్రి సీతక్క హెచ్చరించారు.

## సమ్మెపై తొందరొద్దు

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఎఎంఎస్) :** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటోన్న సమస్యల్లో రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని రాష్ట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు సోమవారం కార్మిక శాఖ కమిషనర్ తో భేటికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మంత్రి కార్మికులకు సూచనలు చేశారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని ఉద్యోగులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. మరీవైపు సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు..ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెకు వెళ్లాలని యోచిస్తున్నారు. కాగా గత నెల 13న యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

## ఇరాన్‌పై దిగ్బంధం కత్తి

ఇరాన్ ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలు ఇప్పటికీ పరిమితంగానే ఉన్నాయి. రోజుకు 10 లక్షల బ్యారెళ్ల సామర్థ్యం ఉన్న జాస్క్ పోర్ట్, ప్రస్తుతం సుమారు 70,000 బ్యారెళ్లను మాత్రమే నిర్వహిస్తోంది. చాబహార్, కాస్పియన్ సముద్రం వెంట ఉన్న ఓడరేవులు కలిసి మొత్తం వాణిజ్య సామర్థ్యంలో కేవలం 10 శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నాయి. ఇరాన్ 2025లో యంత్రాలు, పారిశ్రామిక ముడిసరుకులు, వినియోగ వస్తువులతో సహా 58 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది, ఇది రోజుకు సుమారు 159 మిలియన్ డాలర్లు. ఆ దేశం ఇప్పటికే 100 శాతానికి పైగా ఆహార ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటోంది, బియ్యం ధరలు ఏడు రెట్ల వరకు పెరిగాయి. దిగ్బంధనం కింద ఈ పరిస్థితి గణనీయంగా మరింత దిగజారవచ్చు.

**నిల్వ పరిమితులు, ఉత్పత్తి ప్రమాదాలు**

ఇరాన్ నిల్వ సామర్థ్యం 50–55 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది, అందులో దాదాపు 60 శాతం ఇప్పటికే నిండిపోయింది. ఎగుమతులు నిలిచిపోతే, మిగిలిన సుమారు 20 మిలియన్ బ్యారెళ్ల సామర్థ్యం 13 రోజుల్లోనే అయిపోవచ్చు, ఇది చమురు బావులను మూసివేయవలసి వచ్చేలా దారితీయవచ్చు. పాతబడిన బావులను మూసివేయడం వల్ల వాటర్ కోనింగ్‌అనే ప్రక్రియ ప్రేరితమయ్యే ప్రమాదం ఉందని మలేకీ హెచ్చరించారు; ఈ ప్రక్రియ చమురును భూగర్భంలో శాశ్వతంగా చిక్కుకుపోయేలా చేయవచ్చు. దీని ఫలితంగా రోజుకు 3,00,000 నుండి 5,00,000 బ్యారెళ్ల మేర దీర్ఘకాలిక ఉత్పత్తి నష్టం సంభవించవచ్చు, ఇది వార్షికంగా 9–15 బిలియన్ డాలర్ల నష్టానికి సమానం.

**కరెన్సీ పతనం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు**

ఇరాన్ రియాల్ ఇప్పటికే తీవ్రంగా బలహీనపడింది, డాలర్‌కు 42,000 నుండి దాదాపు 1.5 మిలియన్లకు పడిపోయింది. బ్యాంకులు రోజువారీ నగదు ఉపసంహరణపై పరిమితులు విధించాయి, ద్రవ్యోల్బణం సుమారు 47.5 శాతంగా ఉంది. విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలు పూర్తిగా నిలిచిపోతే, ఆర్థిక వ్యవస్థ అతి ద్రవ్యోల్బణ పరిస్థితి వైపు పయనించవచ్చు.

## మహిళల కోటాపై సిఎంకు అవగాహన లేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతి నిధి) :** సీఎం రేవంత్ రెడ్డి మహిళా రిజర్వేషన్లపై అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ నెల15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చలో అందరు ఎంపీలు ఈ అంశంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్ నేతలను కోరారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చేసిన ఎక్స్ పోస్టుపై కిషన్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. అంబేద్కర్ చెప్పిన మహిళల రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. దేశంలో 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని.. వారికి హక్కులు కల్పించాలని రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని చెప్పారు. తాము దక్షిణాదిలోనే ఉన్నామని.. ఎవరికీ అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

**డీలిమిటేషన్ చేయాల్సిందే..** మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి సెన్సెస్ రావాలంటే రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక కార్పొరేషన్ పదవి ఇవ్వాలన్న ఢిల్లీకి కట్టలు మోయాలని విమర్శించారు. బీజేపీ విధానం అది కాదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## డీలిమిటేషన్ కు గ్రోత్ ఫార్ములా!

### ప్రధాని మోదీకి సీఎం రేవంత్ లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం సరికాదని పేర్కొంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. మహిళా కోటాకు దేశవ్యాప్తంగా మద్దతు ఉందన్న సీఎం.. దీనిని రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో తక్షణమే అమలు చేయాలని సోమవారం రాసిన లేఖలో ఆయన కోరారు. అయితే దీనిని సాకుగా చూపి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల పునర్విభజన చేయడం ద్వారా దక్షిణాది, చిన్న రాష్ట్రాలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి పథంలో నడుస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడంతో దేశ సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కేవలం జనాభా నిష్పత్తిని మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలించాలని ఆయన సూచించారు. దేశ ప్రయోజనాలు పార్టీ ప్రయోజనాల కంటే మిన్న అని, ఏకపక్ష నిర్ణయాలు కాకుండా జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాలని కోరారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరిగి, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గితే అది దీర్ఘకాలంలో దేశ సమగ్రతకు ముప్పుగా మారుతుందని రేవంత్ రెడ్డి తన లేఖలో విశ్లేషించారు. లోక్‌సభలో ప్రస్తుతమున్న ప్రాంతీయ సమతుల్యతను కాపాడుతూనే మార్పులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ముందడుగు వేయాలని ప్రధానిని కోరారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం మేర పెంచాలనే ప్రతిపాదనలపై స్పందిస్తూ, ఇది ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య సీట్ల అంతరాన్ని మరింత పెంచుతుందని రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. ఈ వివక్షతో దక్షిణాది రాష్ట్రాలు జాతీయ రాజకీయాల్లో అట్టడుగున పడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నివారించడానికి పారదర్శకమైన విధానాన్ని అనుసరించాలని ఆయన డిమాండ్ చేశారు.

**చర్చనీయాంశం సీఎం ప్రతిపాదన**

దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై గందరగోళం నెలకొన్న క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'జీఎస్డీపీ' (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) ఫార్ములా జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ప్రగతిశీల రాష్ట్రాలకు పొలిటికల్ డివిడెండ్ దక్కాలంటూ ఆయన ప్రతిపాదించిన '50--50 గ్రోత్ ఫార్ములా' కొత్త చర్చకు దారితీసింది. దేశ సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు వారు అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని బట్టి పార్లమెంటులో ప్రాతినిధ్యం కల్పించాలని రేవంత్ ప్రతిపాదించారు. కాగా ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా దాదాపు 5 శాతంగా ఉండగా, దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి దేశ ఆర్థిక రథాన్ని 53 శాతంతో ముందుకు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్ని ఎంపీ సీట్లు పెంచినా సరే.. '50--50 గ్రోత్ ఫార్ములా' ప్రకారం రాష్ట్రాలకు సీట్లు కేటాయించాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 815 కు పెంచితే, అదనంగా వచ్చే సీట్లు 272. ఈ ప్రతిపాదన ప్రకారం.. ఇందులో 50 శాతం అంటే 136 సీట్లను కేవలం దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఏడు రాష్ట్రాలకే (దక్షిణాది + పశ్చిమ రాష్ట్రాలు) కేటాయించాలి.ఈ 136 సీట్లను ఆయా రాష్ట్రాలకు ఎలా పంచాలి అనే చోటే 'జీఎస్డీపీ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఈ 7 రాష్ట్రాలు ఉమ్మడిగా దేశ జీడీపీలో 53.37 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ ప్రాతిపదికన ఈ 136 సీట్లను పంపిణీ చేస్తే, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు పార్లమెంటులో తిరుగులేని బలం చేకూరుతుంది.

## డీలిమిటేషన్‌తో డీలింక్

మొదటి పేజీ తరువాయి

తమ సొంత రాజకీయ ఎజెండాగా మార్చుకుంటూ, ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమంటూ బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని సీఎం తీవ్రంగా ఖండించారు. భారతదేశంలో మహిళలకు ఓటు హక్కు కల్పించడంతో పాటు, చట్టసభల్లో, సమాజంలో వారికి సమాన హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆయన గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కోసమే కేంద్రం దేశవ్యాప్తంగా ఒక రకమైన కృత్రిమ హడావిడిని సృష్టిస్తోందని, నిజంగా మహిళలపై గౌరవం ఉంటే 2024 సార్వత్రిక ఎన్నికల నుండే ఈ కోటాను ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. నిజానికి, 2024 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే, ఈపాటికి మరింత మంది మహిళా ప్రతినిధులు చట్టసభల్లో అడుగుపెట్టి ఉండేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే, 2011 జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టడం వెనుక ఒక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇది కేవలం జనాభా లెక్కల వ్యవహారం కాదని, ప్రాంతీయ వివక్షకు పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు.ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం చూపుతున్న వివక్షను ఎండగట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని చెబుతూనే, ప్రస్తుతం ఉన్న స్థానాల ప్రాతిపదికన ఈ కోటాను తక్షణమే (రాబోయే ఆరు నెలల్లోనే) అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ ప్రస్తుతం ఒక ప్రమాదకరమైన మలుపు తిరుగుతోందని, ఇది చిన్న రాష్ట్రాలకు, ముఖ్యంగా దక్షిణాదికి తీరని అన్యాయం చేసే కుట్ర అని ఆయన హెచ్చరించారు.

దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను అత్యంత సమర్థవంతంగా అమలు చేశాయి. దీనివల్ల ఇక్కడ జనాభా నియంత్రణలోకి వచ్చింది. కానీ, ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో అక్కడ జనాభా విపరీతంగా పెరిగింది. ఇప్పుడు కేవలం జనాభానే ప్రాతిపదికగా తీసుకుని ఎంపీ సీట్లను పెంచితే, బాధ్యతాయుతంగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గి, ఉత్తరాది ఆధిపత్యం పెరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల, 2026 జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాక, శాస్త్రీయంగా, అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా డీలిమిటేషన్ ఉండాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన రాష్ట్రాలను శిక్షించే విధంగా కేంద్ర నిర్ణయాలు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలు దేశానికి రాజకీయ రాజధానులైతే, దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక రాజధానులని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరగకూడదని ఆయన స్పష్టం చేశారు. దేశానికి అత్యధిక ఆదాయం, జీఎస్డీపీ అందిస్తున్న ఈ రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని పేర్కొంటూ, ప్రతిపాదిత 273 అదనపు సీట్లలో 50 శాతం జనాభా ఆధారంగా, మిగిలిన 50 శాతం ఆయా రాష్ట్రాల ఆర్థిక వృద్ధి రేటు ఆధారంగా కేటాయించాలని సూచించారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాలని ఆయన కోరారు. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు సుమారు 208 అదనపు సీట్లు పెరిగే అవకాశం ఉందని, అలా జరిగితే కేంద్రంలో మెజారిటీ కోసం దక్షిణాది రాష్ట్రాల అవసరం తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ సమగ్రతకు, ఉత్తర–దక్షిణ ప్రాంతాల మధ్య సమతుల్యతకు విఘాతం కలిగిస్తుందని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసిన సీఎం, డీలిమిటేషన్ విషయంలో మాత్రం తొందరపడకూడదని సూచించారు. 2028 వరకు సమయం ఉన్నందున, అన్ని వర్గాలతో చర్చించి, సమగ్రంగా ఆలోచించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 50 శాతం పెంపు ఫార్ములాను రేవంత్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విధానం అమలులోకి వస్తే కేరళ వంటి చిన్న రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల సీట్ల అంతరం ఏకంగా 90కి పెరుగుతుందని ఆయన గణాంకాలతో వివరించారు. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ క్యాపిటల్స్ గా మారుతుంటే, దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ క్యాపిటల్స్ గా సేవలందిస్తున్నాయని.. జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా? అని ఆయన కేంద్రాన్ని నిలదీశారు.మహిళా రిజర్వేషన్లపై తమకు పూర్తి మద్దతు ఉందని, అయితే దానికి డీలిమిటేషన్‌తో లింక్ పెట్టడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడున్న సీట్లలోనే మహిళలకు కోటా కేటాయించి గత ఎన్నికల నుంచే అమలు చేయాల్సి ఉండేదని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గాల పెంపునకు కేవలం జనాభానే కాకుండా రాష్ట్రాల జిఎస్‌డిపి , ఇతర అభివృద్ధి సూచీలను కూడా ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు తక్షణమే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలించిన తర్వాతే కేంద్రం ముందడుగు వేయాలని ఆయన సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు దక్షిణాది రాష్ట్రాలు వెన్నెముకగా నిలుస్తున్నాయని, పన్నుల రూపంలో అత్యధిక ఆదాయాన్ని ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్రాలను కేవలం జనాభా ప్రాతిపదికన ఎలా శిక్షిస్తారని సీఎం ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారానికి ఆయన ఒక 'హైబ్రిడ్ మోడల్' ను ప్రతిపాదించారు. కొత్తగా 272 లోక్‌సభ సీట్లను పెంచాలని భావిస్తే.. అందులో సగం (136 సీట్లు) జనాభా ప్రాతిపదికన (ప్రోరేటా), మిగతా సగం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఉత్పత్తి ఆధారంగా పెంచాలన్నారు.దీనివల్ల దేశ ప్రగతిలో అత్యధిక భాగస్వామ్యం అందిస్తున్న రాష్ట్రాలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం దక్కుతుందని సీఎం చెప్పారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఈ అంశంపై ఇతర రాష్ట్రాల నేతలతో కలిసి పోరాడతామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తన పార్టీ ప్రయోజనాలను పక్కన పెట్టి, దేశవ్యాప్తంగా ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే ఈ సున్నితమైన విధానాలపై నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యం

**సొంత నిధులతో 30 కుర్చీలు అందజేసిన సర్పంచ్ బండ లక్ష్మీ నర్సింహా**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 13 (వుదయం):** గ్రామాభివృద్ధి అంటే కేవలం రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు కల్పించడం మాత్రమే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించడమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నర్సింహా మరోసారి నిరూపించారు. గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, గ్రామంలో సమావేశాలు నిర్వహించే సమయంలో సరైన కూర్చునే సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్ వెంటనే స్పందించి తన వ్యక్తిగత సొంత నిధులతో 30 కుర్చీలను కొనుగోలు చేసి గ్రామ సంఘానికి అందజేశారు.

ప్రజల అవసరాలను గుర్తించి, స్వయంగా ముందడుగు వేసి సమస్యను పరిష్కరించడం సర్పంచ్ బండ లక్ష్మీ నర్సింహా సేవాభావానికి నిదర్శనమని పలువురు అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి వ్యక్తిగత సహకారాలు ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు చాకలి శిరీష, వడ్ల అరుంధ, కార్యదర్శులు భాగ్యమ్మ, లావణ్య, గ్రామ సంఘం అసిస్టెంట్లు ల్యాగల సురేఖ, పంచాయతీ కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, బిల్ కలెక్టర్ ల్యాగల మల్లేశం, ఎం.వి ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ అవుసుల నాగమణి, గ్రామంలోని వివిధ మహిళా సంఘాల సభ్యులు పాల్గొని సర్పంచ్‌ను అభినందించారు.

## మరకత లింగ విగ్రహ ప్రతిష్టాపన




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి నందనవనం కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి (మరకత లింగం) సహిత పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మరకత లింగం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన దేవాలయంలో మరకత లింగం, పంచముఖి హనుమాన్ స్వామి కృపా కటాక్షాలతో భక్తులందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, రవి కిరణ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, నందనవనం కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలన సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



**మేడ్చల్ / మల్కాజిగిరి, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి జెడ్పి సీఈవో కాంతమ్మ తో కలిసి అదనపు కలెక్టరు (181) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## ప్రమాదాలు తగ్గించేందుకే అరైవ్ అలైవ్

**జిన్నారం ఎస్సై హనుమంతు**



**జిన్నారం, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)** జిన్నారం మున్సిపల్ కార్యాలయంలోని ప్రాంగణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై హనుమంతు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ప్రజల్లో భద్రతపై చైతన్యం తేవడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ కార్యదర్శి మాణిక్యం, కౌన్సిలర్లు, నాయకులు పట్టణవాసులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో కో ఆప్షన్‌లపై ఉత్కంఠ



**పదవుల కోసం పోటాపోటీ**

- నాలుగు కో ఆప్షన్ పదవుల భర్తీకి తర్జన భర్జనలు
- నేడో రేపో నోటిఫికేషన్ వెలువడే అవకాశం

**షాద్ నగర్, ఏప్రిల్ 13 (వుదయం) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కోఆప్షన్ పదవుల భర్తీపై ఉత్కంఠ నెలకొన్నది. అధికార కాంగ్రెస్‌లో ఆశావాహులు చాలా మంది ఇప్పటికే ఆశలు వదులుకుంటున్నారు. మున్సిపాలిటీలో నాలుగు కోఆప్షన్‌పదవులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం కో ఆప్షన్ పదవుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది ఈ నేపథ్యంలో షాద్ నగర్ లో కోఆప్షన్ పదవుల ఎంపిక పట్ల అధికార పార్టీ కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. షాద్ నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉండగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కవసరం చేసుకున్న విషయం విధితమే. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ లు ఎంపికయ్యారు. ఆ తర్వాత కోఆప్షన్‌పదవుల ఎంపిక కోసం ఎదురుచూస్తున్నారు. ఈతతంగం పూర్తయితే ఇక మున్సిపాలిటీ పాలన పరంగా ముందుకు కొనసాగుతుంది.

నిబంధనలకు సంబంధించి గతంలో కొనసాగించిన విధానాన్నే అనుసరిస్తామని ప్రభుత్వం ఇది వరకే జీవో జారీ చేసింది. దీంతో 4 పదవుల్లో రెండు మహిళలకు కేటాయించనున్నారు. మరో రెండు పదవులు అనుభవజ్ఞుల కోటాలో, రెండు పదవులు మైనార్టీ కోటాలో అవకాశం ఉంటుంది. అనుభవజ్ఞుల కోటాకు సంబంధించి ఐదేళ్లు ప్రజాప్రతినిధిగా అనుభవం ఉండాలి. మూడు సంవత్సరాలు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయవాది)గా పని చేసిన అనుభవం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో పని చేసి రిటైర్డ్ అయి మున్సిపల్ పరిపాలనపై అనుభవం కలిగిన వారు అర్హులుగా ఉంటారు. రెండు మైనార్టీ కో ఆప్షన్ పదవుల్లో ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధ, పార్శి, సిక్కు వర్గాలకు అర్హత ఉంటుంది. ఇందులో అనుభవజ్ఞుల కోటాలో ఒకరు, మైనార్టీ కోటాలో ఒకరు, మహిళలకు కేటాయించనున్నారు. రెండు పదవులు మైనార్టీలకు, రెండు పదవులు జనరల్ కేటగిరీలో ఏర్పాటు చేయబోతున్నారు. ఇద్దరు మహిళలు ఇద్దరు పురుషులను హోప్షన్స్ సభ్యులుగా ఎంపిక చేసే క్రమంలో కసరత్తు కొనసాగుతోంది. అయితే క్రిస్టియన్, మైనార్టీ కోటాలో క్రిస్టియన్ కోటాలో క్రీడాకారుడు చిన్న పేరు వినిపిస్తుండగా, మైనార్టీ కోటాలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఎండి ఖదీర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదేవిధంగా జనరల్ కేటగిరీలో మాజీ సర్పంచ్ సోలిపూర్ శ్రీశైలం గౌడ్, అదేవిధంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వావిలాల సుజీవన్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇద్దరిలో అవకాశం అధిష్టానం ఎవరికి ఇస్తుంది అన్న సంక్షేమ కొనసాగుతోంది.

వీరి మధ్యలో సోలిపూర్ కు చెందిన కాంగ్రెస్ మరో యువ నాయకుడు యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ విజయ్ కుమార్ రెడ్డిలు కూడా కోఆప్షన్ పదవిని ప్రధానంగా ఆశిస్తున్నారు. ఇంకా మరికొంతమంది లోపకారిగా ప్రయత్నాలు జరుపుతున్నారు. అదేవిధంగా మహిళల కోటా విషయంలో ఇంకా ఎవరి పేరు తెరపైకి రాలేదు. గతంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. చెన్నయ్యకు కో ఆప్షన్ పదవి కట్టబెడతారన్న ప్రచారం జరిగింది. అయితే చెన్నయ్య ఈ అంశాన్ని సున్నితంగా తోసి పుచ్చినట్లు సమాచారం. ఆయన కో ఆప్షన్ పదవిపై అయిష్టత చూపుతున్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీ కార్యాలయం నుండి నోటిఫికేషన్ విడుదలైన ఏడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారు. నామినేషన్లు స్వీకరించి ఆ తర్వాత స్క్రూట్ ని అనంతరం తీర్మానం ఉంటుంది. కోఆప్షన్ సభ్యుల ఎంపికలో కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించే అవకాశం లేకపోలేదు. నామినేషన్లు ఎవరు వేసుకున్నప్పటికీ ఎంపిక ప్రక్రియలో కౌన్సిలర్ల మద్దతు చాలా ప్రధానంగా ఉంటుంది. వారు తిరస్కరిస్తే కోఆప్షన్ పదవి గోవిందా అవుతుంది. అదేవిధంగా అధిష్టానం కూడా ఎవరెవరి పేర్లు ప్రపోజల్స్ చేస్తుంది అన్న విషయం కూడా స్పష్టంగా ఇంకా తెలియ రాలేదు. జనరల్ కేటగిరీలో సోలిపూర్ శ్రీశైలం గౌడ్ వావిలాల సుజీవన్ కు మధ్య తీవ్ర పోటీ నెలకొని ఉందని అంటున్నారు. నాయకులు కొందరు చీలి ఇరువురి పక్షాన వేర్వేరుగా అంతర్గత మద్దతు తెలియజేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపిక ప్రక్రియలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, తదితర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అభిప్రాయాలు చాలా కీలకంగా ఉంటాయి. కోసం పదవుల ఎంపికపై నేడో రేపో నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి..

## కాశీ యాత్ర విజయవంతం

**టంగుటూరులో శివాలయంలో పాండు సార్ కుటుంబ సమేతంగా అభిషేక పూజలు**



**శంకర్ పల్లి, ఏప్రిల్ 13 (వుదయం)** శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పాండు సార్ (పాండు) తన సోదరులు ప్రభాకర్ సార్ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన పవిత్ర కాశీ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని స్వగ్రామానికి చేరుకున్నారు. మార్చి 29, 2026న ప్రారంభమై ఏప్రిల్ 10, 2026 వరకు కొనసాగిన ఈ యాత్రను కాశీ విశ్వనాథుని దివ్య ఆశీస్సులతో సాఫీగా ముగించుకున్న అనంతరం, ఆదివారం ఉదయం టంగుటూరులోని అతి పురాతన మారయ్య గుడి (శివాలయం)లో ప్రత్యేక అభిషేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో గ్రామస్తులు కూడా పాల్గొని పాండు సార్ కుటుంబాన్ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఆయన కుమార్తెలు సరస్వతి, సుహాసిని, శ్రీలత, కుమారులు రాఘవేందర్, శ్రీనివాస్ పాల్గొనగా, మనుమలు రామకృష్ణ, సాయి కృష్ణ, రుషి కృష్ణ, మనుమరాళ్లు ఊహ శ్రీ, హరిప్రియ, జనప్రియతో పాటు బామ్మర్దులు, చెల్లెళ్లు, ఇతర కుటుంబ సభ్యులు హాజరై ఈ వేడుకను మరింత ఘనంగా నిర్వహించారు.

## ప్రజలకు వివరణ ఇవ్వాలి

**కేటీఆర్ కు టీపీసీసీ చీఫ్ డిమాండ్**


**నిజామాబాద్, ఏప్రిల్ 13 వుదయం :** రాష్ట్రంలో కేటీఆర్ చేపట్టబోయే పాదయాత్రలో గత పదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 12న మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్.. గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీ, దౌర్జన్యాలను తన వ్యాఖ్యల ద్వారా పరోక్షంగా ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. సింగరేణి సంస్థలో ఒప్పందాలు, అక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగినవేనని అన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో అవినీతిని ఎంత ప్రయత్నించినా చెరిపివేయలేరని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేరని అన్నారు. పార్టీ పేరును బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్ గా మార్చినంత మాత్రాన ఆ పార్టీ మళ్లీ పుంజుకునే పరిస్థితి లేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ గడ్డపై ఆ పార్టీ మళ్లీ మొలకెత్తడం అసాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పొత్తు పెట్టుకుని కలిసి పోటీ చేసినా అధికారం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఎవరూ పోటీ ఇచ్చే స్థితిలో లేరని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

**జిన్నారం, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా 18 వ వార్డు కౌన్సిలర్ దీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో విగ్రహ ఆవరణలో పెయింటింగ్ పనులను నాయకులు ప్రవీణ్ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగాయి. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు పట్టణ ప్రజలను కోరారు. కార్యక్రమంలో పెయింటర్లు స్థానికులు పాల్గొన్నారు.



## అయ్యమ్మ చెరువుకు శాశ్వత పరిష్కారం





- పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కాలుష్య సమస్యపై యాజమాన్యాలు అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

**జిన్నారం ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా కాలుష్య జలాలు చెరువులు, గుంటల్లోకి చేరి ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఐయమ్మ చెరువును అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. జిఎంఆర్ మాట్లాడుతూ కాలుష్యకారక పరిశ్రమల తీరు వల్ల మనుషులు పశుపక్షాదులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం పట్టి పట్టనట్లుగా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆక్షేపించారు. రసాయన జలాలు సహజ సంపదతో పాటు ప్రకృతిని నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో సందర్భాల్లో కాలుష్యానికి సంబంధించి హెచ్చరించిన పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. కాలుష్యంతో స్థానికంగా నివసించే మహిళలకు వివిధ రకాల క్యాన్సర్లు సోకి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని పశుపక్షాదులు మృత్యువాత పడుతున్నాయని, గ్రామాలను వదిలి వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. కాలుష్యంపై ప్రజా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కిష్టయ్యపల్లి చెట్ల పోతారం గండి చెరువు కృష్ణారెడ్డి పేట చెరువు మీదుగా నక్క వాగు వరకు పైప్ లైన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిసిబి ఈ కుమార్ పాట నీటిపారశాల శాఖ ఈ భీమ్ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా గణేష్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ కమీషనర్ వెంకటరామయ్య సిఐ రవీందర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాసాని



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి ) :** ఆంధ్రజ్యోతి దినపత్రిక సీనియర్ రిపోర్ట్ గుంటూరు శేఖర్ సుగుణ దంపతుల పెద్ద కుమారుడు వివాహ వేడుకకు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులు సాయి సంధ్య, శశి కుమార్ దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో పాస్టర్లు, సీనియర్ రిపోర్ట్ సురేందర్, సుగ్రీవ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగాపురంలో ఎన్‌సీడీ ఆరోగ్య శిబిరం

**105 మందికి వైద్య పరీక్షలు**





**శంకర్‌పల్లి, ఏప్రిల్ 13 (వుదయం) :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు సింగాపురంలో సోమవారం వార్డు సభను నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సింగాపురం వార్డులో రెండో విడత ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా, ముఖ్యంగా షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి చికిత్స అందించేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడిందని అధికారులు తెలిపారు.

ఈ వైద్య శిబిరానికి మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగ రెడ్డి, శంకర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రేవతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తరచూ పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు. ఈ శిబిరంలో మొత్తం 105 మందికి వైద్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ ఎర్ర ఆనందరావు, 9వ వార్డు కౌన్సిలర్ గణేష్, 10వ వార్డు కౌన్సిలర్ వసంత పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రశాంతి, ఇతర వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


## బాధిత కుటుంబానికి పరామర్శ

**మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 13 (వుదయం) :** శంకర్‌పల్లి మండలం ఎలువర్తి గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ పాండురంగారెడ్డి ఆదివారం మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన పాండురంగారెడ్డి మరణం ప్రజలకు తీరని లోటుగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేసి గ్రామంలో మంచి గుర్తింపు సంపాదించారని పలువురు తెలిపారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వెంటనే పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎలువర్తి గ్రామానికి చేరుకుని పాండురంగారెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో సేవా దృక్పథంతో పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన జ్ఞాపకాలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జి. గోవర్ధన్ రెడ్డి, మహారాజ్‌పేట్ గ్రామ మాజీ సర్పంచ్ దోసాడ నరసింహారెడ్డి, నాయకులు రామచంద్ర రెడ్డి, కందాడ నరసింహారెడ్డి, అంతి రెడ్డి, కుమార్ యాదవ్ తదితరులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు.

## సామాజిక భవనం నిర్మించాలి



**గుమ్మడిదల, ఏప్రిల్ 13(వుదయం) :** మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో మాల సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ స్థానికులు మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక భవనం అవసరం ఉందని వారు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ యూత్ అసోసియేషన్, మాల సంఘం అధ్యక్షుడు పి. వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కులస్థులు కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. మాల వర్గానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తగిన స్థలం కేటాయించి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ సమస్యను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, రమేష్, చక్రపాణి, కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి తదితరులు, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు, మాల సంఘం పెద్దలు పాల్గొన్నారు.




"తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో రాజకీయ లబ్ధి పొందడానికి, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడానికి నారీ శక్తి వందన్ అధినియమ్ సవరణను తొందరపాటుతో చట్టం చేస్తున్నారు. ఈ అసాధారణ తొందరపాటుకు ఒకే ఒక కారణం ఉండగలదు. రాజకీయ లబ్ధి పొందడమే దీని ఉద్దేశ్యం, కానీ ప్రధానమంత్రి నిజం దాచిపెడుతున్నారు.శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్‌కు ప్రతిపక్షం పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ, 2027 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అనధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా చేపట్టే ఇటువంటి ప్రక్రియ అత్యంత ప్రమాదకరమైనది, అప్రజాస్వామికమైనది."

* – కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ

## వే'మన'పద్యం

ధనము కూడబెట్టి దానంబు చేయక
తానుదినక లెస్స, దాచుకొనగ
తేనెటీగగూర్చి తెరువరి కియ్యదా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# ట్రంప్ కి ఇంకా బుద్ధి రాదా?

ఇరాన్ యుద్ధం కొత్తమలుపు తిరుగుతోంది. హోర్ముజ్ ను తామే తమ నౌకలతో దిగ్బంధనం చేయిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో యుద్ధంలో రెండో అధ్యాయానికి తెర లేచినట్టు భావించవచ్చు. దీని మంచి చెడ్డలను తెలుసుకు నేముందు 14 రోజుల కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత భారీ స్థాయిలో ఇరవై ఒక్క గంటలపాటు జరిగిన ఇస్లామాబాద్ చర్చలు ఎందుకు విఫలమయ్యాయో పరిశీలించవలసి ఉంది.ఒకవైపు చర్చలు ప్రారంభవుతున్న సమయంలోనే తమ దారికి రాకపోతే ఇరాన్ ను భూమి మీద లేకుండా చేస్తానని ట్రంప్ హెచ్చరించడం సంభాషణలు అసమ శక్తుల మధ్య సాగుతున్నాయనే అభిప్రాయాన్ని కలిగించింది . పిల్లికి ఎలుకలకు, పులికి మేకకు మధ్య జరిగేవి చర్చలు కాబోవని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. అయినప్పటికీ 39 రోజుల యుద్ధం తర్వాత సైనిక చర్యతో ఇరాన్ ను లొంగి వచ్చేలా చేయడం తాము అనుకున్నంత సులభం కాదని గ్రహించి ట్రంప్ రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటించారు అటువంటప్పుడు ఇరాన్ ను స్వతంత్ర దేశంగా పరిగణించి దాని డిమాండ్ల లోని మంచి చెడ్డలను సహృదయాంతో పరిశీలించాలి. అందుకు బదులుగా పశ్చిమాసియాలో తన అధిపత్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా అమెరికా పావులు కదిపింది. ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. ఇరాన్ చేత అణ్వస్త్ర తయారీ కార్యక్రమాన్ని మాన్పించాలన్నది అమెరికా దాని మద్దతుదార్ల చిర కాల కోరిక.ఇజ్రాయెల్ వద్ద అణు బాంబులుండగా ఇరాన్ ఆ కృషిని చేపట్టడాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? పోనీ గతంలో ఒబామా అధ్యక్షుడుగా ఉండగా చైనా, ఫ్రాన్స్,రష్యా, బ్రిటన్, జర్మనీ, యూరోప్ ల మద్దతుతో ఇరాన్ యురేనియం శుద్ధిని పరిమితం చేయడానికి,దానిపై ఆంక్షలను ఎత్తి వేయడానికి అంగీకారం కుదిరింది.దీని ప్రకారం యురేనియం శుద్ధిని 3.67 శాతానికే పరిమితం చేసుకోవడానికి టెహరాన్ అంగీకరించింది.ఉన్నంతలో అంతకంటే మేలైన ఏర్పాటు లేదు. ఆ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేసి ట్రంప్ ఇరాన్ ను పాదాక్రాంతం చేసుకోవాలనే దుస్సాహసానికి పాల్పడ్డాడు. ఇరాన్ డ్రోన్ల తాకిడికి తట్టుకోలేక పోయాడు.అమెరికా ఆయుధ నిల్వలను తోడేసి విపరీత సైనిక నష్టాన్ని కొని తెచ్చుకున్నాడు.అమెరికా, ఇజ్రాయెల్ చెరో వైపు నుంచి చేసిన దాడులకు తీవ్రంగా నష్టపోతూనే నిలబడి ఎదిరించడమే కాకుండా వాటిని దెబ్బ తీసిన ఇరాన్ ధైర్యం సామర్థ్యం చెప్పుకోదగినవి . ఈ పరిస్థితుల్లో తాను ఒంటరి అయిపోయాననే సంగతిని గుర్తించి అమెరికా బాధ్యతతో వ్యవహరించ వలసి వుంది. ఇంకొకసారి ఏకపక్ష యుదానికి తొందరపడబోనని, ఇరాన్ జోలికి వెళ్ళబోనని హామీ ఇవ్వవలసి ఉంది. హోర్ముజ్ జలసంధి నౌకా దిగ్బంధనానికి మిత్ర దేశాల మదతు సైతం లభించే సూచనలు లేవు. కాబట్టి భేషజాలకు పోకుండా ఇరాన్ తో చర్చలను పునరుద్ధరించడమే ట్రంప్ కర్తవ్యం.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# సర్‌తో బెంగాల్‌లో బిజెపి ఆశలు వమ్ము!

అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ద్వారా లక్షలాది మంది ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగిస్తూ రాజకీయంగా బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. తాము విదేశీయులను, రోహ్యంగాలను, నకిలీ ఓటర్లను తొలగిస్తుంటే అనవసరంగా అవరోధాలు కల్పిస్తున్నారని అంటూ బిజెపి నాయకులు మండిపడుతున్నారు. అయితే ఈ విషయమై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలకు ఎన్నికల కమిషన్ సమాధానాలు చెప్పకుండా తన పని తాను చేసుకుంటూ పోతోంది. దానితో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఏదోవిధంగా ఈ సారి పశ్చిమ బెంగాల్ లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పట్టుదలతో ప్రయత్నిస్తున్న బిజెపి ఈ విషయంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే, క్షేత్రస్థాయిలో మద్దతును విస్తరింప చేసుకోకుండా, ప్రజా మద్దతు కూడదీసుకుని నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోకుండా ఎన్నికల కమిషన్, గవర్నర్ ల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలనే ప్రయత్నాలు వికటించే ప్రమాదం ఉందా? అనే అనుమానాలకు దారితీస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల మంది ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తొలగింపునకి గురయ్యారు. వారిలో 63% మంది హిందువులు, 34% మంది ముస్లిములు ఉన్నారు. మతువా జనాభా అధికంగా కలిగిన సరిహద్దు నియోజకవర్గాల్లో హిందువుల పేర్ల తొలగింపు రేటు అధికంగా ఉన్నాయి. ఓటర్ల ప్రత్యేక సమగ్ర జాబితా (ఎస్ఐఆర్) ప్రక్రియకు ముందు, తర్వాత బూత్ స్థాయి గణాంకాలను పోల్చి చూస్తే, తొలగింపునకు గురైన ఓటర్లలో 57.47 లక్షల మంది (63%) హిందువులు కాగా, 31.1 లక్షల మంది (34%) ముస్లిములు ఉన్నట్లు తేలింది. సంఖ్యాపరంగా చూస్తే, జనాభాలో వారి శాతంతో పోల్చుకుంటే ముస్లింల ఓట్లు దాదాపు 50 శాతం అధికంగా తొలగించినట్లు కనిపిస్తున్నా, సంఖ్యాపరంగా చూసుకుంటే ఎక్కువగా హిందువులు ఓట్లు కోల్పోయారు. తొలగింపులకు సంబంధించిన తాజా గణాంకాలను పరిశీలిస్తే, సరిహద్దు ప్రాంతాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో హిందువుల పేర్ల తొలగింపు రేటు అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ నియోజకవర్గాల్లోని ఓటర్లలో అత్యధికులు 'మతువా' వర్గానికి చెందినవారే. వీరంతా 2019 నుండి బిజెపికి గట్టి మద్దతుదారులుగా ఉండటం గమనార్హం.

వీరి మద్దతును కైవసం చేసుకోవడంలో పదేళ్లుగా తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి. అఖిల భారత మతువా మహాసంఘం ప్రకారం, బెంగాల్‌లోని దాదాపు 100 నియోజకవర్గాలలో సుమారు 1.8 కోట్ల మంది మతువా ఓటర్లు ఉన్నారు. 21 నియోజకవర్గాలలో వీరినే నిర్ణయాత్మక శక్తిగా పరిగణిస్తున్నారు. మతువాలు ఒక ప్రముఖ షెడ్యూల్డ్ కుల వర్గం. వీరిలో ప్రధానంగా నామసూద్రులు ఉన్నారు. వీరు మతపరమైన హింస కారణంగా బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్తాన్) నుండి వలస వచ్చారు. 17.4 శాతంతో, వీరు బెంగాల్‌లో రాజబన్షీలు (18.4 శాతం), బాగ్దీల (14.9 శాతం) తర్వాత రెండవ అతిపెద్ద షెడ్యూల్డ్ కుల




జనాభాను ఏర్పరుస్తున్నారు. రాష్ట్రంలోని 294 అసెంబ్లీ స్థానాలలో 45 స్థానాలపై వీరికి పట్టు ఉండడంతో ప్రధాన ప్రతిపక్షమైన భారతీయ జనతా పార్టీకి, అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు వీరు ఒక కీలకమైన ఓటర్ల బేస్‌గా ఉన్నారు.

మమతా బెనర్జీ నాయకత్వంలో తృణమూల్ పార్టీ మతువాలను ఆకట్టుకోవడానికి విశేష ప్రయత్నం చాలాకాలంగా చేస్తూ వచ్చింది. హరిచంద్-గురుచంద్ విశ్వవిద్యాలయం స్థాపన, వర్గ నాయకులకు ఉన్నత పదవులు కల్పించడం వంటి ప్రతీకాత్మక చర్యలు చేపట్టింది. అయితే, తృణమూల్ బెంగాల్ ప్రాంతీయ పార్టీ కావడం, ఢిల్లీలో అధికారంలో లేకపోవడం వల్ల, పౌరసత్వం అనే ప్రధాన సమస్యను పరిష్కరించడంలో అది విఫలమవడం బీజేపీకి ఒక అవకాశాన్ని కల్పించింది. కేంద్రంలో అధికారంలో ఉండటంతో, బీజేపీ తన రాజకీయ వ్యూహంతో మతువా గుర్తింపును చురుకుగా పునర్నిర్మించింది. వారందరికీ పౌరసత్వం కల్పించే హామీతో వారి మద్దతును కూడగట్టుకోగలిగింది. 2019లో బీజేపీ విజృంభణలో మతువాలు కీలక పాత్ర పోషించారు. అప్పటికే, పౌరసత్వ సవరణ చట్టం చేస్తామన్న హామీ, బంగ్లాదేశ్ నుండి వచ్చిన ఈ వర్గానికి చెందిన శరణార్థులలో ఆశలు రేకెత్తించింది. తూర్పు బెంగాల్‌లో అగ్రవర్ణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా మతువాలు ఒక శక్తివంతమైన సామాజిక శక్తిగా మారారు. బీజేపీపై ఉన్న ఆ ఆశ చాలా వరకు 2021 ఎన్నికల వరకు కొనసాగింది. మతువాల ప్రాబల్యం ఉన్న నాదియా, ఉత్తర, దక్షిణ 24 పరగణాలు, ఉత్తర బెంగాల్‌లోని ముఖ్యమైన ప్రాంతాలలోని 20 నియోజకవర్గాలలో, బీజేపీ సాధించిన ఓట్ల శాతం దాదాపుగా చెక్కుచెదరకుండా ఉంది. అయితే, పౌరసత్వ హామీ ఇప్పటివరకు అమలు కాకపోవడంతో వారిలో అసంతృప్తి ప్రారంభమైంది. ఆ అసంతృప్తి కారణంగా 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సీట్ల సంఖ్య కొంతమేరకు తగ్గింది. ఇంతలో ఎస్ఐఆర్ కసరత్తుతో వారి ఓటు హక్కులకు ముప్పు ఏర్పడడంతో బిజెపిపై ఆగ్రవేశాలు ప్రారంభమయ్యాయి. 2025 చివరిలో సరిహద్దు జిల్లాల్లో బీజేపీ నిర్వహించిన 700 సీఏఏ శిబిరాలకు, కోట్లాది జనాభా ఉన్న సమాజంలో సుమారు 60,000 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. సీఏఏ నిబంధనల ప్రకారం, శరణార్థులు ఏమీ లేకుండా పారిపోయి వచ్చిన దేశం నుండి అసలైన బంగ్లాదేశ్ జాతీయతకు సంబంధించిన పత్రాలైన పాస్‌పోర్ట్‌లు, జనన ధృవీకరణ పత్రాలు, భూమి రికార్డులు వంటివి సమర్పించాల్సి ఉంటుంది.అయితే చాలామంది అటువంటి పాత్రలను సమర్పించలేక పోతున్నారు. దానితో బిజెపి హామీపై వారిలో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పుడు పౌరసత్వం లేకపోయినా కనీసం ఉన్న ఓటు హక్కును సహితం కోల్పోవలసి రావడం వారిలో అసహనాన్ని పెంచుతుంది. "మాకు పౌరసత్వం ఇస్తామని చెప్పి ఇప్పుడు మమ్ములను `చొరబాటుదారులు' అంటూ బిజెపి విద్రోహానికి పాల్పడుతోంది" అంటూ ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కతాకు సుమారు 65 కిలోమీటర్ల దూరంలో, పశ్చిమ బెంగాల్‌లోని మతువా సమాజానికి "హృదయభూమి"గా ఉన్న ఠాకూర్‌నగర్‌లోని ఠాకూర్‌బారి ఆలయ ప్రవేశద్వారం వద్ద 'ప్రవాసం' అనే పదాలు పెద్ద ఆంగ్ల అక్షరాలతో రాసి ఉన్నాయి.

"ప్రవాసం అనేది మతువాలందరికీ అర్థమయ్యే విషయమే. ఏదేమైనా, మేమందరం పూర్వపు తూర్పు పాకిస్తాన్ నుండి వచ్చిన శరణార్థులమే. అది మా గుర్తింపులో ఒక భాగం. శరణార్థులను చొరబాటుదారులుగా మారుస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ మధ్య, ఈ రోజు అది మునుపెన్నడూ లేనంతగా అలాగే నిలిచి ఉంది," అని తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ, మతువా సమాజపు మతపెద్ద అయిన మమతాబాల ఠాకూర్ ఆ ఎర్ర అక్షరాలను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులందరూ ఓటర్ల జాబితాలో ఉండేలా చూస్తూ, "చొరబాటుదారులు" లేదా అక్రమ ఓటర్లను ఏరివేసేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలో భాగంగా, ఠాకూర్‌నగర్‌లో, పశ్చిమ బెంగాల్‌లోని మతువా ప్రాబల్యం ఉన్న ప్రాంతాలంతటా చాలా మంది మతువా హిందువుల పేర్లు ఇప్పుడు తొలగించారు. యాదృచ్ఛికంగా, వీరు ఇటీవలి సంవత్సరాలలో బిజెపికి ఓటర్లుగా మారారు. వారు రేషన్ కార్డులు, పాన్ కార్డులు, ఓటర్ ఐడీల వంటి స్థానిక పత్రాలను కూడా సంపాదించి, ఒక రకంగా పౌరులుగా మారారు. అయినప్పటికీ, భారత పౌరుడిగా గుర్తింపు పొందడానికి చట్టపరంగా అవసరమైన పౌరసత్వ పత్రాలు అందరి వద్ద లేవు. ఎవరు పౌరులు, ఎవరు పౌరులు కారు అని నిర్దేశించే భారతదేశ పౌరసత్వ చట్టాలలో సంవత్సరాలుగా వచ్చిన మార్పులే దీనికి కారణమని చెప్పవచ్చు. మతువా ప్రాంతంలో నమోదుకాని ఓటర్ల రేటు 7.8 శాతంగా నమోదైంది. ఇది రాష్ట్ర సగటు అయిన 4.05 శాతానికి దాదాపు రెట్టింపు. జనాభాలో ముస్లింల శాతం 20 కంటే తక్కువగా ఉన్న 160 అల్పసంఖ్యాక నియోజకవర్గాలలో, సగటు తొలగింపు రేటు 8.46 శాతంగా నమోదైంది. ఇది ఏ ఇతర జనాభా వర్గం కన్నా అత్యధికం. జాబితాలో నమోదు కాని ఓటర్ల వాటా అత్యల్పంగా ఉన్న మొదటి 20 నియోజకవర్గాలలో సగటు ముస్లిం జనాభా సుమారు 40 శాతంగా ఉంది. ఇది రాష్ట్ర సగటు అయిన 27 శాతం కన్నా చాలా ఎక్కువ. మరో మాటలో చెప్పాలంటే, మతువా-నామసూద్రుల కంటే ముస్లింలు ఎన్నికల ఓటర్ల జాబితాలో మెరుగ్గా నమోదయ్యారు.

ఈ పరిణామాలు బిజెపి మద్దతుదారులను కలవరపెడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరగనుండగా టీఎంసీ, బీజేపీ, లెఫ్ట్, కాంగ్రెస్ వారి వారి సొంత ప్రయోజనాలకు అనుగుణంగా ఓట్ల తొలగింపు అంశాన్ని చర్చనీయాంశంగా మారుస్తున్నాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ఎన్నికల కమిషన్‌పై యుద్ధం ప్రకటించచిన సమయంలో సర్‌ని బీజేపీ సమర్థిస్తూ ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారులను తొలగించడమే దీని లక్ష్యమని మద్దతు ఇస్తూ ఉండటం ఆ పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈసీఐ డేటా విశ్లేషణ ప్రకారం, బెంగాల్‌లోని 294 అసెంబ్లీ నియోజకవర్గాలలో 234 నియోజకవర్గాలలో, ఎస్ఐఆర్ -ప్రభావిత ఓటర్ల సంఖ్య ఆ నియోజకవర్గాలకు అంచనా వేసిన 2024 లోక్‌సభ గెలుపు మార్జిన్‌ను మించిపోయింది. ఈ తొలగింపులు పోటీ సమీకరణాలను ఎంత లోతుగా దెబ్బతీశాయో ఇది సూచిస్తుంది.

"కాంగ్రెస్ మా వర్గాన్ని దండకారణ్యానికి బహిష్కరించింది. వామపక్షాలు మారిచ్‌ఝాపిలో ఊచకోత కోశాయి. టీఎంసీ పట్టాలు, ర్యాలీలు ఇస్తామని వాగ్దానం చేసింది. బీజేపీ సీఏఏను వాగ్దానం చేసింది. ఇప్పుడు, గతంలో ఇచ్చిన వాగ్దానాల కన్నా ఈ తాజా వాగ్దానానికి ఎక్కువ నిర్మాణాత్మక పటిష్టత ఉందో లేదో ఎస్ఐఆర్ పరీక్షిస్తుంది. రెండవ దశలోని 25 నుండి 30 స్థానాలకు సమాధానం ఢిల్లీ నుండి రాదు. చంద్‌పారాలో ఓటరుగా నమోదు కాని ఒక ఓటరు ఇంటి వద్దకు ఫారం 6 తో బీజేపీ కార్యకర్త వస్తారా, లేక ఎవరూ రారా అనే దానిపైనే ఆ సమాధానం ఆధారపడి ఉంటుంది" అంటూ ప్రస్తుతం బిజెపి శ్రేణులలో నెలకొన్న సందిగ్ధతను వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన ఓటర్లపై అభ్యర్థనలను పరిశీలించేందుకు 19 ట్రిబ్యునల్స్ ను న్యాయమూర్తులతో ఏర్పాటు చేశారు. అయితే, అవన్నీ కొలకత్తాలోనే ఉన్నాయి. అక్కడివరకు వెళ్లి ఓ సాధారణ ఓటర్లు తన అభ్యర్థనను విన్నవించుకోవడం సాధ్యం కాదు. వారిని అక్కడి వరకు తీసుకెళ్లి, వారి వాదన వినిపించడంతో టిఎంసి, బిజెపి నేతలలో ఎవ్వరు ముందుంటారో అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారుతుంది.



చలసాని నరేంద్ర
9849569050

# నివాళి నుంచి నిజాయితీ వైపు!

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వచ్చిందంటే చాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా నీలిరంగు రెపరెపలాడుతుంది. మైకుల మోత, పూలమాలల అలంకరణలతో విగ్రహాల వద్ద కోలాహలం కనిపిస్తుంది. కానీ, ఈ బాహ్య ప్రదర్శనలన్నీ బాబాసాహెబ్ ఆశించిన 'భారతాన్ని' నిర్మిస్తున్నాయా.? లేక ఆయనను ఒక దేవుడిగా మార్చి, ఆయన విప్లవాత్మక భావజాలాన్ని అటకెక్కిస్తున్నాయా.? అనేది ఇవాళ ప్రతి అంబేద్కరిస్టు, ప్రతి సామాజిక కార్యకర్త వేసుకోవాల్సిన ఆత్మవిమర్శనాత్మక ప్రశ్న. అంబేద్కర్ పేరుతో ఇవాళ వేల సంఖ్యలో సంఘాలు పుట్టుకొచ్చాయి. ప్రతి వీధిలో ఒక కమిటీ ఉంది. అయితే, ఈ సంఘాలు చేస్తున్నదేమిటి? కేవలం జయంతి, వర్ధంతులకు పరిమితం కావడం, విగ్రహాల ఎత్తుపై పోటీ పడటం, లేదా రాజకీయ పార్టీల వద్ద 'సీట్ల' కోసం, 'పదవుల' కోసం బేరసారాలు చేయడం దగ్గరే ప్రస్థానం ఆగిపోతోంది. అంబేద్కర్ అంటే కేవలం ఒక కులానికి చెందిన నాయకుడో, లేదా రాజ్యాంగం రాసి ఇచ్చిన ఒక చట్టబద్ధ అధికారి మాత్రమే కాదు. ఆయన ఒక నిరంతర చైతన్యం. ఆయనను ఒక వర్గానికి పరిమితం చేయడం అంటే ఆయనను మరోసారి అంటరానివాడిని చేయడమే. సమాజాన్ని ఉద్ధరిస్తున్నామని చెప్పుకునే నేతలు, తమ కోసం అంబేద్కర్ పేరును ఒక కవచంలా వాడుకుంటున్నారే తప్ప, ఆయన కలగన్న సామాజిక ప్రజాస్వామ్యాన్ని (Social Democracy) కింది స్థాయికి తీసుకెళ్లడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. విగ్రహం చుట్టూ తిరగడం కాదు, విగ్రహం చూపిన దిశ వైపు నడవడం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక తెలుగు నేలపై అంబేద్కరిజం, మార్క్సిజం మధ్య దశాబ్దాల కాలంగా ఒక అనవసర సైద్ధాంతిక గోడ ఉంది. మార్క్సిస్టులు 'వర్గాన్ని' మాత్రమే చూస్తే, అంబేద్కరిస్టులు 'కులాన్ని' మాత్రమే ప్రాతిపదికగా తీసుకున్నారు. కానీ, భారతీయ సామాజిక స్థితిగతుల్లో కులం అనేది కేవలం సామాజిక అంతరం మాత్రమే కాదు, అది ఒక పక్కా ఆర్థిక వ్యవస్థ. అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్య సోషలిజంకు, మార్క్స్ చెప్పిన శ్రామిక వర్గ విముక్తికి మధ్య ఉన్న సామీప్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది. కుల నిర్మూలన జరగకుండా ఇక్కడ వర్గ పోరాటం విజయం సాధించదు, అలాగే ఆర్థిక సమానత్వం లేకుండా సామాజిక గౌరవం నిలబడదు. శ్రమ విభజన కాదు,



శ్రామికుల విభజన జరుగుతున్న ఈ దేశంలో.. ఈ రెండు సిద్ధాంతాలూ పరస్పర సహకారం లేకుండా ముందుకు సాగలేవు. ఈ సత్యాన్ని అంబేద్కరిస్టులం, మార్క్సిస్టు శిబిరాలు 'ఇగో' లను పక్కనపెట్టి గుర్తించాలి. అంబేద్కరిజం - మార్క్సిజానికి తోడుగా మనోవిశ్లేషణ సిద్ధాంతాన్ని జోడించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు సిద్ధాంతాల మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చడానికి దివంగత మానవ హక్కుల నేత కె. బాలగోపాల్ ఆలోచనా విధానం ఇవాళ అత్యంత కీలకం, అవసరమని కూడా గుర్తించాలి. పరిగణలోకి తీసుకోవాలి. మార్క్సిజంతో ప్రస్థానం ప్రారంభించి, ఆ తర్వాత దళిత, బహుజన ఉద్యమాల ప్రాధాన్యతను గుర్తించిన బాలగోపాల్ ఒక గొప్ప సమన్వయకర్త. "కులం ఒక వాస్తవం, వర్గం ఒక సత్యం" అని ఆయన గుర్తించారు. కేవలం ఆర్థిక మార్పు వస్తే కులం పోతుందని భావించడం మార్క్సిస్టుల పొరపాటని, అలాగే కేవలం కుల అస్తిత్వంతోనే పూర్తి విముక్తి వస్తుందని అనుకోవడం అంబేద్కరిస్టుల పరిమితి అని ఆయన ఎత్తిచూపారు. హక్కుల పోరాటంలో మానవీయ కోణాన్ని జోడించి, రాజ్యాంగ పరిధిలో ఉంటూనే విప్లవాత్మక మార్పు ఎలా సాధ్యమో బాలగోపాల్ ఆలోచన, ఆచరణ తెలుపుతుంది. నేటి తరానికి ఆ సమన్వయ దృక్పథం అవసరం. అంబేద్కర్ సంఘాలు, మేధావులు కేవలం భావోద్వేగపూరిత ఉపన్యాసాలకే పరిమితం కాకూడదు. విగ్రహాల అలంకరణ కంటే ఆచరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. సంఘాల్లో వ్యక్తుల ఆరాధన మానేసి, సామాజిక సమస్యలపై మేధోమథనం చేయాలి. అధికారం ఏ పార్టీ చేతిలో ఉన్నా, అణగారిన వర్గాల హక్కులకు భంగం కలిగినప్పుడు రాజీ లేని పోరాటం చేయాలి. బాలగోపాల్ ఆశించినట్లుగా.. కులం, వర్గం, లింగ వివక్షలకు వ్యతిరేకంగా పనిచేసే అన్ని ప్రజాస్వామ్య శక్తులను ఒకే తాటిపైకి తీసుకురావాలి. అంబేద్కర్ అంటే కోటు వేసుకున్న విగ్రహం కాదు. అన్యాయాన్ని చూసి తిరగబడే ఒక ఆలోచన. ఆయనను ఫోటోల నుంచి గుండెల్లోకి, ఊరేగింపుల నుంచి ఆచరణలోకి మార్చుకున్నప్పుడే మనం ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది. లేకపోతే, ఏటా చేసే జయంతులు కేవలం ఒక వార్షిక ఉత్సవంగా మిగిలిపోతాయి తప్ప, వ్యవస్థలో మార్పు రాదు. వ్యవస్థ మారాలి.. మనిషి మారాలి.



రాజేందర్
దామెర (దారా)

# బౌద్ధ భిక్షువు, మార్క్సిస్టు సోషలిస్టు, నిత్య సంచారి

రాహుల్ సాంకృత్యాయన్ (1893 ఏప్రిల్ 9 – 1963 ఏప్రిల్ 14) అసమాన ప్రతిభాశాలి, ఆయన మేధస్సును కొలవడానికి ఏ కొలబద్ద సరి పోదంటే అతిశయోక్తి కాదేమో. కాలాలకు అతీతంగా యావత్ ప్రపంచ చరిత్రలోనే స్వయం కృషితో మహా పండితుడైన వ్యక్తి మరొకరు లేరని మేధావులు భావించడాన్ని బట్టి ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. ముప్పైకి పైగా భాషలు, వాటి యాసలు నేర్చుకుని అధికారికంగా చదువుకోకపోయినా విశ్వ విద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదగడాన్ని బట్టి ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర లోక సంచారిగా పేరొంది, 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు. లోతైన తాత్త్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమంలో కూడా కృషి చేశారు. జాతీయోద్యమానికి అనుకూలంగా, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు. 1940వ దశకం ప్రారంభంలో ఆయన పూర్తిగా భౌతికవాద భావాలను స్వీకరించి, కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరి, జీవితాంతం కమ్యూనిస్టుగా ఉన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఆయన అనేక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, వాటిని అనువాదం చేసి, ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. యునైటెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే బ్రాహ్మణ కుటుంబంలో కేదార్‌నాథ్ పాండే జన్మించారు. బౌద్ధాన్ని స్వీకరించాక, తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చు కున్నారు. ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివారు. తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్. 8వ తరగతి తోనే అతని చదువు ఆగిపోయింది. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆయన నిత్యసంచారిగా వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు. మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్, హిందీ, కన్నడం, మైథిలి, నేపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహళీస్,



తమిళం, ఉర్దూ లాంటి భాషలు అవలీలగా ఆయన నేర్చుకుని పట్టు సాధించారు.

పదమూడో శతాబ్దంలో నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేసినప్పుడు బౌద్ధ భిక్షువులు పవిత్రమైన గ్రంథాలతో పారిపోయారనీ, ఆ విలువైన సంస్కృత పుస్తకాల్ని టిబెట్‌లోని ఆరామాల్లో భద్రపరిచి వుంచారనీ ప్రచారంలో ఉంది. అయితే, ఆరు వందల ఏళ్లుగా వాటిల్లో ఏముందో చూసినవారు లేరు. సాంకృత్యాయన్ వాటికోసం అన్వేషిస్తూ, దారి కూడా సరిగాలేని కొండల్లో నడుస్తూ, కాశ్మీర్, లడఖ్, కార్గిల్ మీదుగా టిబెట్ వెళ్లారు. అక్కడ పుస్తకాలైతే లభించాయిగానీ అవి సంస్కృతంలో లేవు. అన్నీ భోటి భాషలో ఉన్నాయి. రాహుల్ కంచర గాడిదల మీద వాటిని తరలించుకొచ్చారు. ఆ గ్రంథాలన్నీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయిప్పుడు. మరో మూడుసార్లు టిబెట్ వెళ్లి, టిబెటన్ నేర్చుకుని, దాని వ్యాకరణ పుస్తకాలు రాశారు. టిబెటన్-హిందీ నిఘంటువు కూర్చారు. నాటి సోవియట్ యూనియన్‌లోని అనేక రిపబ్లిక్కులలో ఆయన విస్తృతంగా పర్యటించి, సంస్కృతం, పాళీ భాషలో లిఖించబడిన అనేక శాసనాలను, రాతి ఫలకాలనూ కనుగొన్నారు. భారతదేశంలోనూ, నేపాల్, హిమాలయ సానువులలోనూ, టిబెట్ లోనే కాకుండా ఆయన మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ ఆదిగా అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తన యాత్రలో భాగంగా అరుదైన "కాన్జూర్, టాన్జూర్, గ్రంథాలను కొన్నాడు 130 వర్ణ చిత్రాలు 1600 కు పైగా వ్రాత ప్రతులు సేకరించారు. యాత్రికుడు యుఁవాన్ త్స్యాంగ్ తర్వాత ఇంత భారీగా సేకరించిన వారెవరు లేరని చరిత్ర కారుల అంచనా. 70 సంవత్సరాల వయస్సులో మరణించే సమయానికి, ఆయన దాదాపు 140 పుస్తకాలు రాశారు. జీవితంలో మొత్తం జ్ఞాపకశక్తిని కోల్పోయారు. వందలాది పుస్తకాలు కూడా కంఠోపాఠంగా కలిగిన మహా జ్ఞాని, విజ్ఞాన ఖని చివరి రోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపు లోకి జారిపోయారు.1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ, ఆయన అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధమత పద్ధతిలో నిర్మించబడింది. 1958లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1963లో పద్మభూషణ్ బిరుదులు ఆయనకు లభించాయి.



సంగనబట్ల
9440595494



# జాతీయం-అంతర్జాతీయం



## మమతను గద్దె దింపాలని ప్రజలు నిర్ణయించుకున్నారు

**కోల్‌కత, ఏప్రిల్ 13 (వుదయం) :**



మమత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది భాజపానేనని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బాంబులు, తూటాలకు ఓట్లతో జవాబు ఇస్తారని ఆయన అన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా టీఎంసీ గూండాలు తమ ఇళ్లలోనే ఉండాలని.. లేదంటే ఫలితం వెలువడిన అనంతరం వారిని కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

దేశంలో నక్సలిజాన్ని మోడీ ప్రభుత్వం పూర్తిగా అణచివేసిందని.. ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని అమిత్‌షా అన్నారు. బెంగాల్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి చొరబాటుదారులను బయటకు పంపిస్తామన్నారు. గతంలో మమతా బెనర్జీ మద్దతిచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉగ్రవాదంపై ఎన్నడూ చర్యలు తీసుకోలేదని.. దానికి బదులుగా ఉగ్రవాదులకు బిర్యానీతో విందు ఇచ్చిందని ఆరోపించారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పహల్గాం దాడులకు ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బకొట్టిందన్నారు.

రాత్రి సమయాల్లో మహిళలు బయట తిరగాల్సిన అవసరం ఏముందని ఒకప్పుడు మమత ప్రశ్నించారని అమిత్ షా పేర్కొన్నారు. అటువంటి మాటలు ఆమె పదవికే సిగ్గుచేటని అన్నారు. అర్ధరాత్రి కూడా మహిళలు ధైర్యంగా తిరిగే వాతావరణాన్ని తాము బెంగాల్‌లో సృష్టిస్తామన్నారు. ఆర్జీకర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## ట్రంప్‌తో వాదించే ఉద్దేశం లేదు



**వుదయం డెస్క్, ఏప్రిల్ 13 :**

అమెరికాఇరాన్ యుద్ధంపై తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు చేసిన నేపథ్యంలో, ఆయనతో వాదించే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని పోప్ లియో 14 సోమవారం పేర్కొన్నారు.

ఆఫ్రికాలో పోప్ జరుపుతున్న తొలి పర్యటన నిమిత్తం అల్జీరియాకు వెళ్తున్న మార్గంలో, పోప్ విలేకరులతో మాట్లాడుతూ, నేను రాజకీయ నాయకుడిని కాదు, అని అన్నారు. ట్రంప్‌తో చర్చించే ఉద్దేశం నాకు లేదు. నా సందేశం ఒక్కటే: శాంతిని పెంపొందించడం, అని ఆయన అన్నారు. ఆఫ్రికాలో 11 రోజుల పర్యటనలో ఉన్న పోప్ సోమవారం అల్జీరియాలో అడుగుపెట్టారు. ముస్లింల ఆధిపత్యం కలిగిన ఆ దేశానికి ఒక పోప్ వెళ్లడం ఇదే తొలిసారి.

అక్కడి సమయం సుమారు 09:00 గంటలకు రాజధాని అల్జీర్స్‌కు ఆయన చేరుకున్నారు. ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం కోసం అల్జీరియా సాగించిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన బాధితులకు ఆయన నివాళులర్పించనున్నట్లు భావిస్తున్నారు. ఆయన రోమ్ నుండి బయలుదేరడానికి కేవలం కొన్ని గంటల ముందు ట్రంప్ నుంచి తీవ్రమైన బహిరంగ విమర్శలకు గురయ్యారు. ఇరాన్ యుద్ధంలో హింసను అంతం చేయాలంటూ పోప్ చేసిన విజ్ఞప్తులపై ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

నేను పోప్ లియోకు పెద్ద అభిమానిని కాదు, అని ట్రంప్ విలేకరులతో అన్నారు. అణు ఆయుధాన్ని కోరుకుంటున్న దేశంతో (ఇరాన్) పోప్ చెలగాటమాడుతున్నారు అని ఆయన ఆరోపించారు.

లియో అమెరికన్ కావడం, వాషింగ్టన్‌కు ఒక సంభావ్య వారధి కావడం వల్లే కార్డినల్స్ అతడిని 2025 మేలో పోప్‌గా ఎన్నుకున్నారని ట్రంప్ ఆ తర్వాత సూచించారు. అనంతరం, తనను తాను ఏసుక్రీస్తుగా చిత్రీకరిస్తున్నట్లుగా కనిపించే ఒక ఏఐసృష్టించిన చిత్రాన్ని ఆయన పోస్ట్ చేశారు. లియో, ఇరాన్‌లోని పౌరులపై ట్రంప్ చేసిన బెదిరింపులను ఆమోదయోగ్యం కానివిగా విమర్శించారు. అయితే ఆయన అధ్యక్షుడి పేరును ప్రస్తావించలేదు. అలాగే, వలసదారుల పట్ల ట్రంప్ ప్రభుత్వ అమానుష ప్రవర్తనను ఆయన గతంలో కూడా విమర్శించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్‌కు అనుకూలురాలిగా అనిపించే, మితవాద నాయకురాలు జార్జియా మెలోనీ సోమవారం పోప్ ఆఫ్రికా యాత్రం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు ప్రకటించారు.

## భారత్‌పై సుంకాలు లేవు: ఇరాన్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 13 :**




ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించేందుకు అమెరికా చర్యలు తీసుకుంటుందన్న ఆందోళనల నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న భారతీయ ట్యాంకర్లపై ఎలాంటి సుంకాలు విధించడం లేదని ఇరాన్ వెల్లడించింది. ఈ మేరకు సోమవారం భారత్‌కు హామీ కూడా ఇచ్చింది. ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు, ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయని, సముద్రయానంలో సహకారం కొనసాగుతుందని న్యూఢిల్లీలోని తెహ్రాన్ రాయబారి తెలిపారు. దిగ్బంధనంపై అమెరికా బెదిరింపుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో అనిశ్చితి పెరుగుతున్న తరుణంలో ఈ హామీ లభించింది. అటువంటి చర్యను అమలు చేయడం కష్టమని, ఇప్పటికే బలహీనంగా ఉన్న భౌగోళిక రాజకీయ పరిస్థితిని ఇది మరింత తీవ్రతరం చేయగలదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

భారతదేశంలో ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలీ సోమవారం నాడు మాట్లాడుతూ, కొనసాగుతున్న సంక్షోభ సమయంలో సముద్ర మార్గ రాకపోకలను సులభతరం చేయడానికి, మద్దతును అందించడానికి తెహ్రాన్ న్యూఢిల్లీతో కలిసి పనిచేస్తోందని అన్నారు. ఈ ప్రాంతంలో భారత్, ఇరాన్‌లకు ఉమ్మడి ప్రయోజనం, ఉమ్మడి గమ్యం ఉన్నాయని ఆయన నొక్కి చెప్పారు.

భారత ప్రజలందరికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. క్లిష్ట సమయాల్లో వారు నిజంగా నమ్మదగిన, కరుణ గల భాగస్వాములని నిరూపించుకున్నారని నేను విశ్వసిస్తున్నాను. ఈ కష్టకాలంలో అవసరమైన ఏర్పాట్లన్నింటినీ సులభతరం చేసినందుకు భారత ప్రభుత్వానికి నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను, అని ఆయన ఒక విలేకరుల సమావేశంలో అన్నారు. న్యూఢిల్లీతో ఇరాన్‌కు సత్సంబంధాలు ఉన్నాయని, భారత నౌకల కోసం మంచి ఏర్పాట్లు ఉండాలని ఫతాలి నొక్కి చెప్పారు.

ట్రంప్ దిగ్బంధన ప్రకటన తర్వాత తెహ్రాన్ అనుసరిస్తున్న వైఖరిని ఆ రాయబారి స్పష్టం చేస్తూ, మేము శాంతికి సిద్ధమే, అలాగే యుద్ధానికి కూడా సిద్ధమే; కానీ మేం శాంతినే కోరుకుంటాం, అని పేర్కొన్నారు.

హోర్ముజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణానికి వీలు కల్పించేందుకు కృషి జరుగుతోందని ఆయన హామీ ఇచ్చారు. అంతర్జాతీయ చట్టాలను, నౌకాయాన స్వేచ్ఛను ఇరాన్ విశ్వసిస్తుంది, వాటికి కట్టుబడి ఉంటుంది. సమీప భవిష్యత్తులో, మేం ఇందుకు సంబంధించిన ఒక యంత్రాంగాన్ని రూపొందించి, ఆ విషయాన్ని అన్ని దేశాలకు తెలియజేస్తామని ప్రకటించాం," అని ఆయన వివరించారు.

## ప్రజా సంక్షేమం కోసం వంటిచేత్తో పోరాడుతున్నా

**కోల్‌కత, ఏప్రిల్ 13 (వుదయం) :**



ప్రజా సంక్షేమం కోసం తాను వంటి చేత్తో పోరాటం చేస్తున్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం పేర్కొన్నారు. బీర్భూంలోని సూరిలో ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ, తనను ఎదుర్కోవడానికి, ఎన్డీయే పాలిత 19 రాష్ట్రాలు, కేంద్రం ఏకం కావాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ శక్తులను ఉపయోగించి పశ్చిమ బెంగాల్ ఎన్నికలను బిజెపి గెలువలేదని ఆమె అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని యువ మనసులను ప్రభావితం చేయడానికి నిర్వహిస్తున్నారన్నారు. రెండు దశలలో, ఏప్రిల్ 23, 29న నిర్వహించనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ 226 స్థానాలను గెలుచుకుంటుందని మమత ధీమా వ్యక్తం చేశారు.

బిజెపి డబ్బు పంచుతోంది. తమను పట్టుకోకుండా ఉండేందుకు వారు పాలన, పోలీసు అధికారులను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేశారు. డబ్బు, మాదకద్రవ్యాలు, ఆయుధాలు, ఓటర్లను కూడా పశ్చిమ బెంగాల్‌లోకి అక్రమంగా తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లు వేయడానికి బీహార్ నుంచి ఓటర్లను రైళ్లలో, బస్సుల్లో తీసుకువస్తున్నారని ఆరోపించారు.

తానే అన్ని స్థానాల్లో అభ్యర్థినంటూ ప్రధాని మోడీ వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆయనకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలని ఉందా అని తృణమూల్ అధినేత్రి ప్రశ్నించారు.

294 అసెంబ్లీ స్థానాలన్నింటిలోనూ తానే అభ్యర్థినని మోడీ చేసిన వ్యాఖ్య, 2021 నుంచీ ఎన్నికల ప్రచారాల సమయంలో తాను తరచుగా పునరుద్ఘాటిస్తూ వచ్చిన తన సొంత వాదననే ప్రతిబింబిస్తోందని మమత అన్నారు.

ఆదివారం సిలిగుడిలో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ, పశ్చిమ బెంగాల్‌లోని అన్ని నియోజకవర్గాలకు తానే బీజేపీ అభ్యర్థినని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తానే అభ్యర్థినని చెబుతున్నట్లయితే, ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని ప్రకటించాలి. అప్పుడు ఆయన అన్ని నియోజకవర్గాల తరపున ఓట్లు అడగవచ్చు, అని ఆమె అన్నారు.

"ముందుగా, మీరు దేశానికి ప్రధానమంత్రి కావాలనుకుంటున్నారా లేక పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా అనేది నిర్ణయించుకోండి. మీరు ఇక్కడ బయటి వారు. ముందు ఢిల్లీని చక్కబెట్టండి, ఆ తర్వాతే పశ్చిమ బెంగాల్ గురించి ఆలోచించండి, అని ఆమె సలహా ఇచ్చారు.

ఉద్యోగ కల్పన హామీలపై మోడీపై బెనర్జీ విమర్శలు గుప్పించారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఆయన మునుపటి హామీ ఏమైంది? మేం ఖాళీలను భర్తీ చేయడానికి ప్రయత్నించినప్పుడు, నియామకాలను అడ్డుకోవడానికి కోర్టులలో కేసులు దాఖలవుతున్నాయి. ఇప్పుడు ఉద్యోగాల గురించి మాట్లాడుతున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దు, అని ఆమె విమర్శించారు.

పశ్చిమ బెంగాల్‌లో బుల్డోజర్లు కదులుతాయని ఆదివారం వ్యాఖ్యానించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తన ప్రభుత్వం అటువంటి విధానాన్ని విశ్వసించదని, ప్రేమ ఆధారిత విధానాన్నే నమ్ముతుందని బెనర్జీ దీటుగా బదులిచ్చారు.

బీజేపీ నుండి డబ్బు స్వీకరించడం భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులకు దారితీయవచ్చని ఆరోపిస్తూ, బెనర్జీ ప్రజలను హెచ్చరించారు. బీజేపీ నుండి డబ్బు తీసుకోకండి. ఆ పొరపాటు అస్సలు చేయకండి. మిమ్మల్ని అప్రమత్తం చేయడం నా విధి. వారు మీ ఖాతాల్లో నల్లధనాన్ని జమ చేస్తారు, ఆ తర్వాత ఈడీ, సీబీఐ ద్వారా మీపై కేసులు నమోదు చేయబడతాయి, అని ఆమె ఆరోపించారు. మీరు తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కోరుకుంటే, ఆ 294 స్థానాలన్నింటిలోనూ అభ్యర్థిగా నన్నే పరిగణించండి, అని ఆమె అన్నారు.

ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణస (సర్) ప్రక్రియ అనంతరం, 'మిషనరీస్ ఆఫ్ ఛారిటీ'కి చెందిన 300 మంది సన్యాసినుల పేర్లు, అలాగే భారత్ సేవాశ్రమ్ సమితి, 'రామకృష్ణ మిషన్స, బేలూరు మఠంకు చెందిన పలువురు సాధువుల పేర్లు తొలగించారని కూడా ఆమె ఆరోపించారు.

బెనర్జీ బీజేపీ చేపట్టిన ఛార్జిషీట్ ప్రచారాన్ని తీవ్రంగా విమర్శించారు. అవినీతి ఆరోపణలు చేస్తూ ఆ పార్టీ నాయకులపై మండిపడ్డారు. అదే సమయంలో, తృణమూల్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకోవద్దని ఆమె బీజేపీని హెచ్చరించారు.

మరోవైపు, బీర్‌భూమ్‌లోని మయూరేశ్వర్ వద్ద జరిగిన ఒక ఎన్నికల సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ ప్రజలు బీజేపీకి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాన్ని అందిస్తారని పేర్కొన్నారు.

## సర్ కేసులో విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (వుదయం) :**



పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)కు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది, అయితే అదనపు ఓటర్లను చేర్చడంపై ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదు. సవరణ ప్రక్రియలో పురోగతిని, సంబంధిత అధికారుల భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూనే, ఈ అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ విచారణలో, న్యాయాధికారులను నిర్బంధించిన మాల్దాలోని మరో ఘటనను కూడా క్లుప్తంగా ప్రస్తావించారు. ఇది ఎన్నికల సమయంలో శాంతిభద్రతలపై ఉన్న ఆందోళనలను, జవాబుదారీతనం ఆవశ్యకతను నొక్కి చెప్పింది.

**కీలక అంశాలను ప్రస్తావించిన న్యాయస్థానం**

విచారణ సందర్భంగా, ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితాకు మరిన్ని పేర్లను జోడించాల్సిన అవసరం ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తామని భారత సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. అయితే, ఈ అంశంపై ఎటువంటి తక్షణ ఆదేశాలు జారీ చేయలేదు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి తమకు తాజా నివేదిక అందిందని, సవరణతో లంకె కలిగిన అప్పెలేట్ ట్రిబ్యూనల్ పని ప్రారంభించిందని ధర్మాసనం పేర్కొంది. ఎన్నికలు పూర్తయ్యే వరకు న్యాయాధికారులకు ఇచ్చిన భద్రతను కొనసాగించాలని ఆదేశించింది.

**మాల్దా కేసుపై ప్రత్యేక దృష్టి**

మాల్దాలో న్యాయమూర్తులను ఘెరావ్ చేశారనే ఆరోపణలకు సంబంధించిన మరో ఘటనను కూడా కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ కేసులో తాము ఒక స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టుకు తెలియజేసింది. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తులో తమ మధ్య సహకారం ఉందని రాష్ట్ర పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ రెండూ ధర్మాసనానికి తెలిపాయి. ఈ వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

**జవాబుదారీతనాన్ని కోరిన సిజెఐ**

న్యాయస్థానం కేవలం విధానపరమైన అంశాలకే పరిమితం కాకుండా, హేతుబద్ధమైన ఫలితాన్ని సాధించాలని సంకల్పించిందని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. మాల్దా కేసులో నిందితుల రాజకీయ నేపథ్యాన్ని, విచారణ ప్రక్రియలో భాగంగా పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయం కేవలం సాంకేతిక అంశాలకే పరిమితం కాదని, జవాబుదారీతనం ఉండేలా చూడటానికి దీనిని కొనసాగిస్తామని కోర్టు నొక్కి చెప్పింది. ప్రధాన సర్ అంశంపై విచారణ ఆ రోజుకు ముగిసింది, తదుపరి విచారణలలో దీనిపై మరింత పరిశీలన జరగనుంది.

### మాల్దా ఘెరావ్ ఘటనలో అరెస్టులు

**కోల్‌కతా, ఏప్రిల్ 13 (వుదయం) :**

మాల్దాలో ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపును నిరసిస్తూ స్థానికులు న్యాయాధికారులను ముట్టడించిన ఘటనకు సంబంధించి, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ ఐఎ) త్వరలో జరుగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థితో సహా ఏడుగురిని అదుపులోకి తీసుకుంది. అలాగే ఒక పంచాయతీ సభ్యుడిని అరెస్టు చేసింది. ఒక అధికారి తెలిపిన వివరాల ప్రకారం, ఘెరావ్ ఘటనపై దర్యాప్తు జరపాలని ఎన్నికల సంఘం ఆదేశించి, బాధ్యత అప్పగించిన ఎన్ ఐఎ బృందం, అలీనగర్ పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కాంగ్రెస్ మోథాబారి అభ్యర్థి సాయెమ్ చౌదరిని, ఆయన అనుచరులు కొందరితో సహా అదుపులోకి తీసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, రాష్ట్ర పోలీసులు ఇంతకుముందు అదుపులోకి తీసుకున్నఎఐఎంఐఎం సభ్యుడు మోఫక్కరుల్ ఇస్లాంను విచారించినప్పుడు లభించిన ఆధారాల ఆధారంగా, ఐఎస్ ఎఫ్ గ్రామ పంచాయతీ సభ్యుడు గోలం రబ్బానీని అరెస్టు చేశారు, అని ఆ అధికారి తెలిపారు. రబ్బానీని కోల్‌కతాకు తీసుకువచ్చి, కోర్టు ముందు హాజరుపరిచే అవకాశం ఉందని ఎన్ ఐఎ వర్గాలు తెలిపాయి. అతన్ని విచారించడం ద్వారా ఈ ఘటనకు సంబంధించిన కీలక సమాచారం లభిస్తుందని మా అధికారులు భావిస్తున్నారు, అని ఆయన అన్నారు.

## నేడు ఉత్తరాఖండ్‌లో ప్రధాని పర్యటన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (వుదయం) :**

ప్రధాని మోడీ మంగళవారం ఉత్తరాఖండ్‌లోను, ఉత్తరప్రదేశ్‌లోను పర్యటించనున్నారు. ఢిల్లీ డెహ్రాడూన్ ఆర్థిక కారిడార్‌లో ఉన్నత భాగమైన వైల్డ్‌లైఫ్ కారిడార్ గురించి ప్రధానమంత్రి సమీక్షిస్తారు. ఉదయం దాదాపు 11:40 గంటలకు ప్రధాని డెహ్రాడూన్ సమీపంలో జై మా దాత్ కాళీ ఆలయాన్ని దర్శించుకొని, పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత, ఢిల్లీడెహ్రాడూన్ ఆర్థిక కారిడార్‌ను ప్రారంభిస్తారు. ఢిల్లీడెహ్రాడూన్ ఆర్థిక కారిడార్ పొడవు 213 కిలోమీటర్లు. దీనిలో ఆరు దోవలు ఉన్నాయి. దీని నిర్మాణానికి రూ.12,000 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు చేశారు. ఇది ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల గుండా సాగుతుంది. దీనితో ఢిల్లీకీ, డెహ్రాడూన్‌కూ మధ్య ప్రయాణానికి ప్రస్తుతం పడుతున్న ఆరు గంటలకు పైచిలుకు కాలం కాస్తా సుమారు రెండున్నర గంటలకు తగ్గుతుంది. ఆ ప్రాంతంలో సమృద్ధంగా ఉన్న జీవవైవిధ్యాన్ని, వన్యప్రాణుల ఉనికిని, పర్యావరణపరమైన సమతౌల్యాన్ని పరిరక్షించే దృష్టితో మనుషులు, పశువులు సాధ్యమైనంత వరకూ పరస్పరం ఎదురుపడకుండా చూడటానికి అనేక వెసులుబాట్లతో ఈ రాకపోకల మార్గం రూపురేఖలను తీర్చిదిద్దారు. వన్యప్రాణులు స్వతంత్రంగా తిరిగేటట్లు చూడడానికి, అటవీ మృగాల పరిరక్షణకు అనేక ముందు జాగ్రత్త చర్యలను ఈ ప్రాజెక్టులో భాగంగా చేశారు. వీటిలో.. 12 కి.మీ. పొడవైన వైల్డ్‌లైఫ్ ఎలివేటెడ్ కారిడార్ ఒకటి. ఇది ఆసియా ఖండంలో అతి పొడవైన ఎలివేటెడ్ కారిడార్లలో ఒకటి.

## జైలు నుంచి ఇమ్రాన్ ఖాన్ సందేశం

**తన ఆరోగ్యం విషమ దశలో ఉందని పేర్కొంటూ, అడియాలా జైలు నుండి ఖాన్ విడుదల చేసిన ఈ తాజా సందేశం, ఆయన పరిస్థితి, చికిత్సకు సంబంధించి ఆందోళనలను రేకెత్తిస్తోంది.**



**వుదయం డెస్క్, ఏప్రిల్ 13 :**

తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఇస్లామాబాద్‌లో నిరసనలు నిర్వహించవద్దని పార్టీ నాయకులను పాకిస్తాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పిటిఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ ఆదేశించారు. ఇది రాజధానిలో రాజకీయ సమీకరణకు విరామం ఇస్తున్నట్లు సూచిస్తోంది. ఖాన్ ఆరోగ్యం, కొనసాగుతున్న నిర్బంధంపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో, ఆడియాలా జైలు నుంచి ఆయన న్యాయ సలహాదారు ద్వారా ఈ ఆదేశం జారీ అయింది.. జైలులో ఉన్న తమ నాయకుడి నుండి తదుపరి ఆదేశాల కోసం ఎదురుచూస్తూ, ఇస్లామాబాద్‌లో ఆందోళనల నుంచి పార్టీ వెనక్కి తగ్గుతున్నందున, ఈ చర్య పిటిఐ వ్యూహంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది.

**నిరసనలకు విరామం**

ఆయన న్యాయవాది సల్మాన్ సఫ్దర్ ప్రకారం, ప్రస్తుతానికి ఇస్లామాబాద్‌లో గానీ, దాని పరిసర ప్రాంతాల్లో గానీ ఎలాంటి నిరసనలు నిర్వహించవద్దని ఖాన్ స్పష్టంగా ఆదేశించారు. రాజధానిలో ప్రదర్శనలకు సంబంధించి ఎలాంటి వ్యూహాన్ని సిద్ధం చేయవద్దని పార్టీ నాయకులకు కూడా సూచించారు.

ఈ ఆదేశం, గతంలో పీటీఐ రాజకీయ ప్రచారానికి ప్రధాన కేంద్రంగా ఉన్న ఇస్లామాబాద్‌లో ఆ పార్టీ నిరసన కార్యకలాపాలను సమర్థవంతంగా నిలిపివేసింది. పార్టీ వ్యవస్థాపకుడి నుంచి తదుపరి మార్గదర్శకాలు అందే వరకు కొత్తగా ఎలాంటి నిరసన పిలుపునివ్వకూడదు. ఈ పరిణామం పిటిఐ వ్యూహంలో తాత్కాలిక సర్దుబాటును సూచిస్తోంది. కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతల నడుమ కూడా, పార్టీ నాయకత్వం రాజధానిలో సంయమనం పాటించాలని నిర్ణయించుకుంది.

**జైలు నుంచి సందేశం**

ఖాన్ ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న అడియాలా జైలు నుంచి, ఆయన పేరుతో వెలువడిన ఒక బలమైన సందేశంతో పాటే ఈ ఆదేశం కూడా వచ్చింది. ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉందని, ఆయనకు తగిన వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జవాబుదారీతనంపై తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, మాజీ ప్రధానికి తక్షణ ఆరోగ్య సంరక్షణ కల్పించాలని పీటీఐ పిలుపునిచ్చింది. ఈ వ్యాఖ్యలు ఆయన నిర్బంధం, చికిత్సపై రాజకీయ చర్చను తీవ్రతరం చేశాయి.

**వ్యూహంలో మార్పు:**

ఇస్లామాబాద్‌లో నిరసనలను నిలిపివేసే నిర్ణయం, నిరంతర సమీకరణపై పీటీఐ గతంలో తీసుకున్న వైఖరికి భిన్నంగా ఉంది. ఈ విరామం తాత్కాలికంగానే కనిపిస్తున్నప్పటికీ, పార్టీ తన నాయకత్వాన్ని చుట్టుముట్టిన చట్టపరమైన, రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇది ఒక అప్రమత్తతతో కూడిన వైఖరిని ప్రతిబింబిస్తోంది.

పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది, ఖాన్ నుండి వచ్చే తదుపరి ఆదేశాలు పీటీఐ తదుపరి కార్యాచరణను నిర్ధారించే అవకాశం ఉంది.

## భద్రతపై ఇరాన్ హెచ్చరిక

**అందరికీ వర్తిస్తుంది లేదా ఎవరికీ వర్తించదు**



**వుదయం డెస్క్, ఏప్రిల్ 13 :**

హోర్ముజ్ జలసంధిలో అమెరికా తలపెట్టిన నావికా దిగ్బంధనానికి ముందు ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, ఇరాన్ ఓడరేవులపై ఏ దాడి జరిగినా ప్రతీకార చర్యలు ఉంటాయని ఇరాన్ సాయుధ దళాల కేంద్ర ప్రధాన కార్యాలయం సోమవారం హెచ్చరించింది.

పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రంలో భద్రత అనేది అందరికీ వర్తిస్తుంది లేదా ఎవరికీ వర్తించదు. ఇరాన్ ఓడరేవులకు ముప్పు వాటిల్లితే, ఈ ప్రాంతంలోని ఏ ఓడరేవు కూడా సురక్షితంగా ఉండదు," అని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రకారం ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇస్లామాబాద్‌లో వాషింగ్టన్, తెహ్రాన్‌ల మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో, సోమవారం నుంచి ఇరాన్ ఓడరేవులను దిగ్బంధం చేస్తామని అమెరికా సైన్యం ప్రకటించిన తరుణంలో ఈ హెచ్చరిక వెలువడింది. అలాంటి ఏ చర్యనైనా సముద్రపు దొంగతనంగా పరిగణిస్తామని ఇరాన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేస్తూ, పూర్తిగా తిరిగి తెరవాలని తాను పదేపదే తెహ్రాన్‌ను డిమాండ్ చేస్తున్న కీలకమైన ప్రపంచ ఇంధన కారిడార్ అయిన వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని వాషింగ్టన్ దిగ్బంధం చేయడానికి చర్యలు తీసుకుంటుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధి బృందంతో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఒప్పందం కుదరకపోవడంతో చర్చల నుండి వైదొలగిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు.

ఈ దిగ్బంధనం 1400 జిఎంటికి అమల్లోకి వస్తుందని, ఇరాన్ ఓడరేవుల నుంచి బయలుదేరే లేదా అక్కడ లంగరు వేయడానికి ప్రయత్నించే అన్ని నౌకలకు ఇది వర్తిస్తుందని అమెరికా సైన్యం తెలిపింది.

ఇది విస్తృత ప్రాంతీయ దుష్పరిణామాలకు దారి తీస్తుందని సీనియర్ ఇరాన్ అధికారులు సూచించారు.

ఎటువంటి విజయాలు లేకుండానే యుఎస్ పశ్చిమాసియా నుంచి బయటపడుతుందని బ్రిగేడియర్ జనరల్ ఇస్మాయిల్ క్వామ్ అన్నట్టు ఇరాన్ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. హౌతీ దళాలతో సమలేఖనం అయిన ఇరాన్ తిరిగి 2023, 2025లోలా బాబ్ ఎల్ మందేబ్ జలసంధిని లక్ష్యంగా చేసుకొన్ని నౌకలకు అంతరాయం కలిగించగలదని అన్నారు.

కాగా, హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేస్తామంటూ యుఎస్ చేస్తున్న బెదిరింపులను ఉట్టిమాటలే తప్ప వాస్తవం కాదని పార్లమెంటు జాతీయ భద్రతా కమిషన్ అధికార ప్రతినిధి ఎబ్రహీమ్ రెజై అభివర్ణించారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## సామాజిక విప్లవ శిఖరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్




భారతదేశ చరిత్ర పుటల్లో కొన్ని పేర్లు కాలక్రమేణా మసకబారుతాయి, కానీ మరికొన్ని పేర్లు కాలం గడిచేకొద్దీ మరింత ప్రకాశిస్తాయి. అటువంటి ధ్రువతారే డాక్టర్ భీంరావ్ రామ్ జీ అంబేద్కర్. అంటరానితనం అనే చీకటి అగాధాల నుండి ఉద్భవించి, భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆయన ప్రస్థానం కేవలం ఒక వ్యక్తి విజయగాథ కాదు; అది ఒక సామాజిక విప్లవం. మహో సైనిక శిబిరంలో ఒక సాధారణ మహార్ కుటుంబంలో జన్మించిన అంబేద్కర్, చిన్నతనంలోనే కుల వివక్ష విషపు కోరలను రుచి చూశారు. తరగతి గది బయట కూర్చోవడం, కనీసం తాగే నీటి కోసం ఇతరులపై ఆధారపడటం వంటి అవమానాలు ఆయనను కుంగదీయలేదు. బదులుగా, ఆ గాయాలనే ఆయన తన లక్ష్యానికి ఇంధనంగా మార్చుకున్నారు. "జ్ఞానమే శక్తి" అని నమ్మిన ఆయన, విదేశీ గడ్డపై కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుండి డాక్టరేట్లు పొంది, ప్రపంచస్థాయి మేధావిగా ఎదిగారు.

అంబేద్కర్ కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. తన విజ్ఞానాన్ని సమాజ మార్పు కోసం ఆయుధంగా మలిచారు. 'మూక్ నాయక్', 'బహిష్కృత్ భారత్' వంటి పత్రికల ద్వారా అణచివేతకు గురైన వర్గాల గొంతుకగా నిలిచారు. కేవలం నినాదాలతో సరిపెట్టకుండా, 'మహద్ సత్యాగ్రహం' ద్వారా పౌర హక్కుల పోరాటాన్ని వీధుల్లోకి తెచ్చారు. మనుస్మృతి దహనం ద్వారా సామాజిక అసమానతలకు మూలమైన భావజాలాన్ని సవాలు చేసిన ధీశాలి ఆయన.

భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా ఆయన పోషించిన పాత్ర అద్వితీయం. భిన్నత్వంతో కూడిన భారత దేశాన్ని 'సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం' అనే మూడు సూత్రాల ద్వారా ఏక తాటిపైకి తెచ్చారు. ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని చట్టవిరుద్ధం చేయడం. హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు ఆస్తి హక్కు, సామాజిక భద్రత కల్పించడం. కార్మిక హక్కులు మరియు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ. ఇవన్నీ ఆయన దూరదృష్టికి నిదర్శనాలు. ఆయన కేవలం దళితుల నేత మాత్రమే కాదు; ఆధునిక భారత న్యాయ వ్యవస్థకు పునాది వేసిన గొప్ప రాజనీతిజ్ఞుడు.

హిందూ మతంలోని సంస్కరణల పట్ల నిరాశ చెందినప్పటికీ, ఆయన హింసా మార్గాన్ని ఎంచుకోలేదు. శాంతి, సమానత్వం మెండుగా ఉన్న బౌద్ధాన్ని స్వీకరించి, తన చివరి రోజుల్లో లక్షలాది మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. "నేను హిందువుగా పుట్టాను కానీ, హిందువుగా మరణించను" అన్న తన మాటను నిలబెట్టుకుంటూ, మతం కంటే మానవత్వం గొప్పదని చాటిచెప్పారు. 1990లో భారత ప్రభుత్వం ఆయనను భారతరత్నతో గౌరవించడం ఆయన కీర్తికి దక్కిన ఒక చిన్న గుర్తింపు మాత్రమే. నేడు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్య ఫలాలు, హక్కులు బాబాసాహెబ్ వేసిన పునాదులపైనే నిలబడి ఉన్నాయి. అక్షరాన్నే ఆయుధంగా మలచుకొని, ఆత్మగౌరవ పోరాటమే ఊపిరిగా బతికిన అంబేద్కర్, నవభారత నిర్మాణంలో నిరంతర స్ఫూర్తిప్రదాత. ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి.



అంతడుపుల శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ - వరంగల్
సెల్ : 7386814274

## యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం



**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**హనుమకొండ, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే ఏకైక మార్గం యోగ అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. 'ప్రజాపాలన-పురోగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా, సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెకటర్ స్వయంగా యోగాసనాలు వేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది మన భారతీయ సంస్కృతిలో భాగమైన ఒక గొప్ప జీవన విధానం. ఒత్తిడి నివారణకు నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు, ప్రజలు ప్రతిరోజూ యోగ చేయడం ద్వారా మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని పొందవచ్చును. వ్యాధుల దూరం కావాలంటే మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనేక అనారోగ్య సమస్యలకు యోగ ఒక చక్కని పరిష్కారమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ దీనిని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగ గురువు రవీంద్ర చారి, పర్యాటక శాఖాధికారి శివాజీ, ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, పౌరసంబంధాల అధికారి ఆయూబ్ అలీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు**

**కార్పొరేటర్ మామిండ్ల రాజు కృషితో మారుతున్న 31వ డివిజన్ రూపురేఖలు**




**హనుమకొండ టౌన్, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. డివిజన్‌లో జరుగుతున్న ప్రధాన అభివృద్ధి పనులు, విజయాలను ఆయన వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ: డివిజన్‌లోని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మారుస్తూ, వర్షపు నీరు నిలవకుండా పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తున్నారు. దీనివల్ల కాలనీవాసులకు ఎంతో కాలంగా ఉన్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోతున్నాయి. ప్రజా సంక్షేమం ఇంటింటికీ పాలన నినాదంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్పొరేటర్ మామిండ్ల రాజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. పరిశుభ్రత ప్రాధాన్యతతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులతో సమన్వయం చేసుకుంటూ, చెత్త సేకరణ మరియు డ్రైనేజీల క్లీనింగ్‌పై నిరంతరం నిఘా ఉంచుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు వీధి దీపాల ఏర్పాటు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాను మెరుగుపరచడం వంటి పనులతో డివిజన్ వాసుల జీవన ప్రమాణాలను పెంపొందిస్తున్నారు. కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ ..."31వ డివిజన్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. ఉన్నతాధికారుల సహకారంతో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేసి, 31వ డివిజన్‌ను నగరంలోనే ఉత్తమ డివిజన్‌గా తీర్చిదిద్దుతాను. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక ప్రజలకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అంతటా జరుగుతున్న ఈ అభివృద్ధి పనుల పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గిరివాణి ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం!

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ములుగు, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** ప్రజావాణిగిరివాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిగిరివాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అర్జీదారుల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వారినుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు అందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి గిరివాణి కార్యక్రమంలో భూ సమస్యల గురించి 21, ఇందిరమ్మ ఇండ్ల గురించి 15, పెన్షన్స్ 16, ఉపాధి కల్పన 03, ఇతర శాఖలకు చెందినవి 17 మొత్తం 72 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి గిరివాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

అధికారులు అర్జీ దారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకుండా వాటికి పరిష్కార మార్గం చూపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

### ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య



**యాదాద్రి భువనగిరి ఏప్రిల్ (వుదయం జిల్లా ప్రతినిధి) :** దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు అని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు సంతోషంగా ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బిర్లా ఐలయ్య అన్నారు. సోమవారం మోటకొండూరు మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు నిర్వహించడంతో పాటు, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే కేంద్రంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. దళారులు రైతులను మోసం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్, పచిమట్ల మధర్ గౌడ్, కొంతం మోహన్ రెడ్డి, తహసిల్దార్ రాజేంద్ర ప్రసాద్, మండల అధ్యక్షుడు గంగాపురం మల్లేష్, గ్రామశాఖ అధ్యక్షులు బుగ్గ కొమరయ్య, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు బోట్ల నగేష్, ఏనుగు అంజిరెడ్డి, సంజీవ, శ్రీనివాస్, ఉదయ్ గౌడ్, మహేందర్, పి ఏ సి ఎస్ సిబ్బంది నల్ల భద్రారెడ్డి, శ్రీనివాస్, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేషనల్ హైవేస్ అంబులెన్స్ ప్రారంభం

**ప్రాణ రక్షణలో కీలక అడుగు**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి) :** 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ – అలైవ్" కింద రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నేషనల్ హైవేస్ (యాదాద్రి వరంగల్ ఎన్హెచ్ 163) అధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో కూడిన నూతన అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నూతన అంబులెన్స్ కు జెండా ఊపి ప్రారంభించారు. ఈ అంబులెన్స్ ద్వారా జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో "గోల్డెన్ అవర్"లో అందించే వైద్య సేవలు ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కొత్త అంబులెన్స్ ఆధునిక వైద్య పరికరాలతో సన్నద్ధంగా ఉండి, ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రులకు వేగంగా తరలించేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఏఐ పీడీ భరద్వాజ్, ఆర్టీవో శ్రీనివాస్ గౌడ్, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, అధికారులు ,పోలీసుఅధికారులు, పోలీసు, ఎన్హెచ్ఏఐ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో

## చేపట్టే ప్రతీ కార్యక్రమన్ని విజయవంతం చెయ్యాలి

**ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలి, జిల్లాలో (టిబి) నివారణ కోసం ప్రత్యేక కార్యచరణ అమలు**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**



**మహబూబాబాద్ ఏప్రిల్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు నిర్వహించనున్న కార్యక్రమాల అమలుకు సంబంధించి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి (టీబీ) కేసులను గుర్తించడం, వారికి తక్షణ చికిత్స అందించడం, అలాగే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ నియంత్రణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలని, ఆరోగ్య శానిటేషన్ కమిటీ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 23 నుండి ఎడ్యుకేషనల్ కేంద్రాలు వేసవి సెలవుల దృష్ట్యా ఆ కేంద్రాల లోని వాటర్ ట్యాంక్ లను ఖాళీ చేసి కడిగి ఎండ పెట్టాలని సూచించారు. అలాగే వేసవి తీవ్రత దృష్ట్యా హీట్ స్ట్రోక్ కేసులను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జిల్లా హాస్పిటల్)లో ప్రత్యేక హీట్ స్ట్రోక్ వార్డులను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ, వార్డుల వారిగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఐకెపి, సిబ్బంది అన్ని వర్గాల వారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, నిర్వహించే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు, నూతనంగా గ్రామ స్థాయిలో హెల్త్ శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, దోమల నివారణ నిల్వ ఉన్న నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ఫ్లెక్సీలు, పోస్టర్స్ కరపత్రాలు ముద్రించి పట్టణాలు, గ్రామాలలో ఏర్పాటు చేయాలన్నారు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను ప్రజలకు ముందస్తు సమాచారంఅందించి కార్యక్రమాల విజయవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు, వైద్య సమస్యలు అధికంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, ఆర్డీఓలు కృష్ణవేణి, గణేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్, సీఈఓ పురుషోత్తం, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, డిప్యూటీ డెమో ప్రసాద్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న ఎండల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి


**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి ఏప్రిల్ 13 (వుదయం విలేకరి):** రోజు రోజుకు పెరుగుతున్న ఎండల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండలు బారి నుండి రక్షణపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ మన జిల్లాకు ఆరంజ్ జోన్ ప్రకటించినట్లు తెలిపారు. వేసవిలో ప్రజలు ఎండలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ అధికంగా ఉంటుందని ప్రజలు బయటికి వెళ్లొద్దని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బబారిన పడే అవకశాలున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వడదెబ్బకు గురైతే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎండల్లో చిన్నారులు, వయోవృద్ధుల తో ప్రయాణం చేయొద్దని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపితో కవరు చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా షేడ్ నెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఎండ దెబ్బ తగలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ప్రోగ్రాం అధికారి డా దేవేందర్, ఆర్డిఓ హరికృష్ణ, డిఆర్డీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి):** సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్వంచ మండలంలోని బోల్లారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. తనిఖీలలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థుల కూర్చునే విధానం, ప్రశాంత వాతావరణం, తగిన వెలుతురు, తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ప్రశ్న పత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, మాల్ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు.

ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంటప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని మాపకశాఖ నియమాలు పాటిస్తూ...

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

### అదనపు కలెక్టర్ కె.సీతారామరావు



**సూర్యాపేట ఏప్రిల్,13 (వుదయం):** అగ్ని మాపకశాఖ నియమాలు పాటిస్తూ.. ప్రమాదాలు జరగకుండా హోటల్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామరావు సూచించారు..అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు అగ్ని నివారణ పట్ల అవగాహన పోస్టర్లను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లలో అగ్నిమాపక పరికరాలు అన్ని వేళలా పని చేసేలా ఉంచాలని, ప్రతి అంతస్తులో మెట్ల ద్వారాలు, అగ్నిమాపక పరికరాల స్థానం తెలిపే ఎస్కేప్ ప్లాన్ ఉంచాలని తెలిపారు. ఎయిర్ కండిషనర్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్ ఏర్పాటు చేయాలని వాటిని ఆటోమేటిక్ డిటెక్టివ్ సిస్టంకు అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, స్విచ్‌లు మరియు ఇతర పరికరాలు క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలని ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకోవాలని అన్నారు. సిబ్బంది అందరికీ హోటల్ ఎక్విప్మెంట్ పై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని అగ్నిప్రమాద లాంటి అత్యవసర సమయంలో ఏ విధంగా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. వంట గదిలో అగ్నిప్రమాదం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యంగా ఎల్పిజి, సిలిండర్లో ఇతర వస్తువులు భద్రపరిచే చోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హోటల్లో బస చేసే ముందు అని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా ప్రమాద సమయంలో బయటకు వెళ్లే మార్గాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో అగ్నిమాపక శాఖ అధికారి జానయ్య ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ పి.డి. సురేష్, డిఎంఓ నాగేశ్వర శర్మ, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ - అలైవ్ కా ర్యక్రమంపై ప్రత్యేక దృష్టి

## ఏప్రిల్ 13 నుంచి 18 వరకు అవగాహన

**నల్లగొండ,ఆఫ్రీల్13(వుదయం) :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికల 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అరీవ్ అలీవ్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు ఆరు రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కొత్త వాహనాలతో పాటు ప్రమాదాలకు గురైన వాహనాలను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రత్యేక చిత్రాలు, నమూనాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు.

వాహనదారులుతప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన ఫిట్‌నెస్ వంటి పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీవో వాణి, అదనపు ఎస్పీ జి. రమేష్, పోలీస్ సిబ్బంది, ఆర్టీవో శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీరో మాతృ శిశు మరణాలు లక్ష్యంగా

## ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మంవుదయం, బ్యూరో ఏప్రిల్- 13:** జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాలు లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మాతృ, శిశు మరణాలు తగ్గింపు, సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రతి ప్రసవం సురక్షితంగా జరుగుతుందనే సందేశం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాల లక్ష్య సాధనకు అన్ని విభాగాలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు.

ప్రతి పీహెచ్‌సీ పరిధిలో హై రిస్క్ గర్భిణీలను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం 12 నుండి 15 శాతం గర్భిణీలు హై రిస్క్ కేటగిరీలో ఉంటారని తెలిపారు. ఏ పీహెచ్‌సీ హై రిస్క్ కేసులు లేవని నివేదిస్తే గుర్తింపు ప్రక్రియలో లోపాలు ఉన్నట్లేనని, అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, డి.డబ్ల్యు.ఓ. వేల్పుల విజేత, డిసిపిఓ విష్ణు వందన, విద్యా శాఖ,సంబంధిత జిల్లా అధికారులుపాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు




## నో హెల్మెట్ – నో ఎంట్రీ నందగోకుల్

**ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ బ్యూరో , ఏప్రిల్ 13( వుదయం )**



ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.మెదక్ జిల్లాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 492 గ్రామపంచాయతీలలో గ్రామసభల ద్వారా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిజాంపేట్ మండలం నందగోకుల్ గ్రామంలో వినూత్నంగా "నో హెల్మెట్ - నో ఎంట్రీ" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథులుగా హాజరై గ్రామస్తుల నుంచి ఘన స్వాగతం అందుకున్నారు. అనంతరం హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత కోసం నందగోకుల్ గ్రామస్తులు తీసుకున్ననిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీ ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని "నో హెల్మెట్ - నో ఎంట్రీ" కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని కోరారు.ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల భారీ ప్రాణనష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం చేయకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించగా, హెల్మెట్ వినియోగంపై కానిస్టేబుల్ మిమిక్రీ కార్యక్రమం ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి దేవకుమార్, సర్పంచ్ పాతూరు భాను, ఎంపీడీవో రాజిరెడ్డి, సీఐ వెంకటరాజా గౌడ్, డీఎస్పీ నరేందర్ గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై టీకాస్త్రం

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**



గర్భాశయ ముఖధార క్యాన్సర్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 14 సంవత్సరాలు నిండిన కిషోర్ బాలికలకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (Hpv) టీకాను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల యందు అందుబాటులో ఉందని కాబట్టి అర్హత కలిగిన బాలికల తల్లిదండ్రులు అనగా 2011 ఏప్రిల్ ఒకటి నుండి 2012 మార్చ్ 31 వరకు జన్మించిన వారికి టీకా అందజేస్తున్నట్లు తెలియజేశారు జిల్లాలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల(కస్తూరిబా పాఠశాలలో) యందు ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు ముగిసినందున యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వము నిర్ణయించిన బాలికలందరికి వాక్సినేషన్ చేయనున్నట్లు తెలిపారువ్యాక్సిన్ వేయించుకున్నాక ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయేమో అని విద్యార్థినుల తల్లిదండ్రులు భయపడుతున్నారు కానీ ఇది చాలా సురక్షితమైన వివిధ రకాలైన పరిశోధనలుచేసిన తర్వాతనే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని తెలిపారు వైద్య ఆరోగ్య శాఖ వారు గుర్తించిన కిశోర బాలికలకు సింగల్ డోస్ మాత్రమే ఇవ్వనున్నారు ప్రస్తుతం మార్కెట్లో 4000 రూపాయల వరకు ఉంటుందని కానీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు వాక్సినేషన్ పూర్తయిన వెంటనే అంతర్జాలంలో నమోదు చేయనున్నట్లు తెలిపారుగార్డా సిన్ టీకా తో ఎంతో రక్షణయటపడుతున్నాయి వయస్సును బట్టి శరీరంలో సంభవించే మార్పులకు ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి వీటిని సకాలంలో గుర్తించి చికిత్స పొందాలి లేకపోతే క్యాన్సర్ కు దారి తీస్తున్నట్లు పలు సర్వేల్లో వెల్లడైంది ఇట్టి వ్యాక్సిన్ వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని వైద్యాధికారి తెలియజేశారు కాబట్టి తల్లిదండ్రులు విద్యార్థినిలు ఎలాంటి అపోహలకు గురికా వద్దని తెలిపారు ఇప్పటికే ఈ టీకా ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించడం జరుగుతుందని అదేవిధంగా కొద్ది రోజుల క్రితమే భారత ప్రభుత్వం వారు దేశవ్యాప్తంగా ఇట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు గర్భాశయ ముఖదార క్యాన్సర్ తో పాటు నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను నివారించేందుకు గార్డసిన్ టీకా అద్భుతంగా పనిచేస్తుందని తెలిపారుఇప్పటివరకు టీకా తీసుకొని బాలికలందరూ సాధ్యమైనంత తొందరగా తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు

## సురక్షిత ప్రయాణం
# మన అందరి బాధ్యత

**ఫంక్షన్లలో హెల్మెట్లను బహుమతిగా ఇవ్వండి**
**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే పౌరులకు ప్రోత్సాహకం**
**అర్రైవ్ అలైవ్ వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**



ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను పాటిస్తేనే సురక్షిత ప్రయాణం చేయవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల నేపథ్యంలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన అర్రైవ్ అలైవ్ వారోత్సవాల్లో భాగంగా గద్వాల అనంత ఫంక్షన్ హాల్లో రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలోపలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే రోడ్ సేఫ్టీ పై వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి గ్రామంలో రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయి రోడ్ సేఫ్టీ కమిటీలు ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను పాటిస్తూ ప్రయాణాలు చేయాలని సూచించారు. మద్యపానం చేసి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. యువత తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తర్వాతే వాహనాలను నడపాలని, ఫంక్షన్లలో హెల్మెట్లను, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడానికి అయ్యే ఫీజుల రుసుములను బహుమతిగా ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రులకు తీసుకెళ్లే పౌరులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. రహదారి ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు నగదు రహిత చికిత్స నిమిత్తం రూ.1.5 లక్షలు ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం త్వరలోనే అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. జిల్లాలో ఏడాదికి సుమారు 400కు పైగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు రహదారి ప్రమాదాలు చాలా తక్కువగా జరిగేవని, ప్రస్తుతం యాక్సిడెంట్స్ సర్వసాధారణమైనాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతకుల రోడ్లపైనే కాకుండా జాతీయ రహదారులపై కూడా పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రహదారులు బాగుంటేనే వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కూడా రహదారుల విషయంలో దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు తమ వంతుగా కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయవచ్చు అంటారు.

కాబట్టి సంబంధిత అధికారులు ఫిట్నెస్ ఉన్న బస్సులు నడపాలని, మారుమూల ప్రాంతాలకు కూడా బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. బస్సులు తిరగని గ్రామాలకు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిసి అధికారులు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఆర్టీసీ పై నమ్మకం పెరిగేలా వ్యవహరించాలని సూచించారు. రహదారి భద్రతపై ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయకుంటే ప్రయోజనం లేదన్నారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు పౌరులు తగు జాగ్రత్తలు పాటించడమే కాక, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్రైవ్ అలైవ్ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజలకు రోడ్ సేఫ్టీ పై అవగాహన కలిగిస్తూ గ్రామ సభలు నిర్వహించామన్నారు. చిన్నపిల్లల నుంచి ప్రతి ఒక్కరూ ఏదో ఒక అవసరం కోసం ప్రయాణాలు చేయాల్సి వస్తుంది కాబట్టి రహదారి భద్రత ముఖ్యమైన అంశంగా పేర్కొన్నారు. వాహనాలపై వెళ్లే పౌరులు, రహదారులు దాటే పాదచారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనం నడిపే వారే కాక వెనుక కూర్చున్న వ్యక్తులు కూడా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. పోలీసు శాఖతోపాటు సంబంధిత శాఖల సమన్వయంతో వారం రోజులపాటు రహదారి భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,

విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, డిఎస్పి మొగిలయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ



**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త**

**మహబూబ్ నగర్ ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పాత పాలమూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అక్కడున్న వైద్య సిబ్బంది తో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్య సదుపాయాల గురించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల కొరత ఏమైనా ఉన్నదా? ప్రతిరోజూ ఆసుపత్రికి ఎంతమంది ఔట్ పేషెంట్లు నమోదు అవుతున్నారు? మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో మందుల కొరత ఏమీ లేదని , ప్రతిరోజూ 100 నుండి 150 మంది ఔట్ పేషెంట్లు నమోదు అవుతున్నారని ఆసుపత్రి వైద్య అధికారి కలెక్టర్ కు తెలిపారు. వైద్య కేంద్రానికి వచ్చిన ఒక గర్భిణి స్త్రీ తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఆరాతీశారు. హీమోగ్లోబిన్ శాతం ఎంత ఉంది, నెల నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆసుపత్రిలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రారంభించిన హెల్త్ స్క్రీనింగ్ పైలట్ ప్రాజెక్ట్ అమలు గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో సమన్వయం చేసుకొని మహిళా స్వయం సహాయక సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ స్క్రీనింగ్ చేసి హెల్త్ ప్రొఫైలింగ్ తయారుచేయాలని సూచించారు. తనిఖీ సందర్భంగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డా.మమత, ఇతర వైద్య సిబ్బంది, కలెక్టర్ వెంట ఉన్నారు.



## ప్రజావాణికి 138 ఫిర్యాదులు

**ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి.**
**అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలు.**

**వికారాబాద్ ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

"ప్రజావాణి" కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంభందిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరెట్ కార్యాలయ సమావేశం హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తు లను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా ప్రజావాణి లో భూసంబంధిత సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం,ఉపాధి అంశాలపై 138 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సమయపాలనతో చర్యలు తీసుకొని సమస్య లను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమం లో జడ్ పి సి ఇ ఓ సుధీర్,ఆర్ డి ఓ వాసు చంద్ర,డి ఆర్ డి ఓ శ్రీనివాస్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## వడగాలులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరు వెంట తాగునీటి బాటిల్ తీసుకెళ్లాలి**
**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ,ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో రానున్న వారం రోజుల్లో భారీగా వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అన్ని జిల్లా శాఖల అధికారులతో ఎండాకాలం వడగాలులపై సమావేశం నిర్వహించి, అధికారులకు తగు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న వారం రోజుల్లో భారీగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతతో వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వడగాలుల విషయంపై అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలకు ఎండల వేడిమి నుంచి ఉపశమనం కల్పించే విధంగా అక్కడక్కడ తాగునీటి కోసం చలివేంద్రాలని ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కూడా బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ తమ వెంట తాగునీటి కోసం బాటిల్ వెంటబెట్టుకొని వెళ్లాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా కూలీలకు పని ప్రదేశాల్లో చల్లని తాగునీరు సహా చలువ నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో నీరు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని దృష్టికి వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులు కూడా మధ్యాహ్నం ఎండవేళల్లో వ్యవసాయ పనులకు వెళ్ళవద్దని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సరఫరా లో ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ప్రజలందరికీ ఎండాకాలంలో సరైన సమయానికి నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎండ వేడిమి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్ను ఆవిష్కరణ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జెడ్పి సీఈవో యాదయ్య, డిఎస్పీ బాలాజీ నాయక్, డిటిఓ మానస, డి ఆర్ డి ఓ ఉమాదేవి, సిపిఓ హరికృష్ణ, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకర్ విద్యార్థిని కీ సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**ఊర్కొండ ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**



నిన్న వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించిన ఊరుకొండ పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ సమీ గారి కుమార్తె షగుఫ్తా నాజ్ ను మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా,యూత్ అధ్యక్షులు ఆది నారాయణ, ఉప సర్పంచ్ కొండల్,INTUC నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఫరీద్,చంద్రకాంత్, శ్రీశైలం లు ఘనంగా సన్మానించారు.



## కలెక్టర్ ప్రాధాన్యత 'ప్రజావాణి'కే

**ప్రజావాణి దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత జిల్లా కలెక్టర్.**
**ప్రజావాణి కి 63 వినతుల స్వీకరణ.**

**సంగారెడ్డి ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

సంగారెడ్డి, ఏప్రిల్ 13 2026: ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన మొత్తం 63 దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా నలుమూలాల నుండి ప్రజలు నమ్మకంతో తమ సమస్యలను ప్రజావాణి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటి పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు.

ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.సంక్షేమం, రెవిన్యూ, వ్యవసాయం, గృహనిర్మాణం, మార్కెటింగ్, ఎంప్లాయ్మెంట్ తదితర శాఖలకు సంబంధించిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చూపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు



**- భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకున్న విద్యార్థులు**
**దౌల్తాబాద్ మండలంలో విజయవంతంగా పరీక్షల నిర్వహణ**

**దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (వుదయం )**

దౌల్తాబాద్ మండల పరిధిలో పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ పరీక్షలను విద్యార్థులు ఎంతో శ్రమతో, పట్టుదలతో పూర్తి చేశారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టి, ప్రభుత్వం నిర్దేశించిన సమయ నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి పరీక్షా కేంద్రానికి సమయానికి హాజరై తమ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకున్నారు.

మండలంలోని దౌల్తాబాద్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ, ఎంజేపీ బాలుర పాఠశాల, ఎంజేపీ బాలికల పాఠశాల, దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముబారస్‌పూర్, ఇందుప్రియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో విజయవంతంగా పరీక్షలు రాశారు. పరీక్షల కాలంలో విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరించడంతో పాటు, ఆత్మవిశ్వాసంతో ప్రతి పేపర్‌ను పూర్తి చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో చదివి పరీక్షల్లో పాల్గొనడం అభినందనీయమని విద్యావేత్తలు పేర్కొన్నారు.పదవ తరగతి విద్య జీవితంలో కీలక మలుపు కావడంతో ఈ పరీక్షలు విద్యార్థుల ఉన్నత విద్యకు మార్గదర్శకంగా నిలుస్తాయని, వారి లక్ష్య సాధనకు ఇది తొలి మెట్టు అవుతుందని పాఠశాల యాజమాన్యాలు అభిప్రాయపడ్డాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి కలిసివచ్చి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయడానికి దోహదపడింది. ఫలితాలపై ఆశావహంగా ఉన్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



## ప్రజావాణిపై అదనపు కలెక్టర్ సమీక్ష

**ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి**

**నారాయణపేట ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

**వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి**
**ప్రజావాణి దరఖాస్తులకు అత్యున్నత ప్రాధాన్యత**
**ప్రజావాణిలో 48 అర్జీల స్వీకరణ**
**బాధితుల సమస్యలను సావధానంగా విన్న అదనపు కలెక్టర్**
**సమీక్షలో పాల్గొన్న ఆర్డీవో**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను అదనపు కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న అదనపు కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 48ఫిర్యాదులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో ఆర్. డి.ఓ.రామచందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఆశయాలను
# ఆదర్శంగా తీసుకోవాలి

**చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్**

**నారాయణపేట ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**





తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో ఉమెన్ డెవలప్మెంట్ సెంటర్ లో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. బి. ఆర్. అంబేద్కర్ అమూల్యమైన సూక్తులతో మహనీయుడిని స్మరించుకుందాం అంటూ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సదస్సును ప్రారంభించారు .యావత్ భారతావనికి అందించిన విలువైన సేవలను స్మరించుకుంటు అంబేద్కర్ చెప్పిన విలువైన సూక్తులనూ గుర్తుచేశారు. భారతదేశ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో ఒక ప్రసిద్ధ పేరు భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ ఒకరని , ఈ గొప్ప భారతీయ దేశభక్తుని పేరు చరిత్ర పుటలలో, ప్రతి భారతీయుని హృదయంలో ఎల్లప్పుడూ సజీవంగా ఉంటుందని తెలిపారు .ఈయన 14 ఏప్రిల్ 1891వ సంవత్సరంలో జన్మించారు అని గుర్తు చేశారు. స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగ పని చేసి లిఖిత రాజ్యాంగ రూప కర్తగా, రాజకీయవేత్త, న్యాయనిపుణుడు, ఆర్థికవేత్త,సంఘ సంస్కర్త దళిత బౌద్ధ ఉద్యమానికి చోదక శక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని అతని ఆశయాలను ప్రతి ఒక్కరు పాటిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఈ సదస్సులోబాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, వరకట్న వేదింపులు, పోక్సో చట్టాలు, ఫండమెంటల్ రైట్స్, ప్రాథమిక హక్కులు, లోక్ అదాలత్ లో ఉచిత న్యాయం, ఉచిత అడ్వకేట్ పొందడం, పబ్లిక్ రిలేవెంట్ ఇంటిమేషన్ రైట్స్, సమానత్వ హక్కు, చట్టాల గురించి వివరించారు . ఈ కార్యక్రమంలో హాజమ్మ పారా లీగల్ వాలంటీర్స్,డెవలప్మెంట్ సెంటర్ టీచర్ మహాదేవి ,వార్డు కౌన్సిలర్ సత్యరగుపాల్ రెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నరసింహ,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# రాజన్న కుంట కబ్జా
## స్థానికుల్లో తీవ్ర ఆందోళన

**పెరుగు రాజన్న కుంట అన్యాక్రాంతం...**
**స్థానికుల్లో తీవ్ర ఆందోళన**
**ఊరికే పెద్ద చెరువు 29 ఎకరాల విస్తీర్ణం చివరికి మిగిలింది 9 ఎకరాలే**
**రెవిన్యూ అధికారులు సర్వే చేసి సంవత్సర కాలం గడుస్తున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడే**

**కోహెడ, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి):**



సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి పరిధిలోని పెరుగు రాజన్న కుంట అక్రమ ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన ఈ చెరువును కొంతమంది వ్యక్తులు క్రమంగా ఆక్రమిస్తూ, తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

369 సర్వే నంబరులో సుమారు 29 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు, భూబకాసురుల కబ్జాకు గురై దాదాపు 20 ఎకరాలు ఆక్రమణకు లోనై, ప్రస్తుతం కేవలం 9 ఎకరాలు మాత్రమే మిగిలినట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం, కుంట పరిధిలో చేపల చెరువులు తవ్వడం, మామిడి తోటలు ఏర్పాటు చేయడం వంటి కార్యకలాపాలు సాగుతున్నాయి. ఒకప్పుడు గ్రామానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న ఈ కుంట, ప్రస్తుతం ఆక్రమణల వల్ల తన అసలు రూపురేఖలను కోల్పోతుందని గ్రామస్థులు చెబుతున్నారు. వ్యవసాయం, పశువుల నీటి అవసరాలకు ఉపయోగపడే ఈ కుంట పరిధి రోజురోజుకూ తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు కనుమరుగవుతున్న నేపథ్యంలో, పెరుగు రాజన్న కుంట పరిస్థితి మరింత విషమంగా మారుతుందనే భయం వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో గ్రామంలో నీటి కొరత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

వెంటనే రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖలు స్పందించి అక్రమ ఆక్రమణలను తొలగించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ సంవత్సర కాలం గడుస్తున్న ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును కాపాడతారా? లేక ఆక్రమణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తారా? అనే ప్రశ్న స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.



# హెల్మెట్ లేకుండా కలెక్టరేట్ కు రావొద్దు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

కలెక్టరేట్ లో పనిచేసే ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా రావొద్దని, కారులో వచ్చే వాళ్ళు సీటు బెల్ట్ పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్రైవ్ అలైవ్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వారం రోజులపాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పిఎం ఇంటర్న్షిప్ పథకానికి 18 నుంచి 25 సంవత్సరాల లోపు డిప్లొమా లేదా డిగ్రీ చదివిన యువత అర్హులని చెప్పారు. ముఖ్యమైన కంపెనీలలో నెలకు రూ.9000 ఆర్థిక సహాయం పొందుతూ, సంబంధిత అంశాల్లో నైపుణ్యాలు నేర్చుకోవచ్చన్నారు. ఈ పథకాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 13 నుంచి 18 వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రవాణా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అర్రైవ్ అలైవ్ కార్యక్రమంపై ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. అలాగే పీఎం ఇంటర్న్షిప్ పథకానికి సంబంధించిన గోడ పత్రికలను కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్టీవో వెంకటేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.a







# రక్షణ మన బాధ్యత - నివారణ మన లక్ష్యం

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**
**జిల్లా వ్యాప్తంగా 'అరైవ్–అలైవ్' అవగాహన కార్యక్రమాలు**

**సంగారెడ్డి, ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు.

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం కలెక్టర్ చాంబర్లో 'రహ్ వీర్' మరియు ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు.

ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారికి ప్రభుత్వం 'రహ్‌వీర్' పథకం కింద రూ.25,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తుందని తెలిపారు.

క్షతగాత్రులకు సహాయం చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే అపోహలను ప్రజలు విడనాడాలని, సమయానికి అందించే సహాయం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ఆమె అన్నారు. జిల్లాలో 'అరైవ్-అలైవ్' కార్యక్రమం ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి అరుణతో పాటు రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పై ఫైర్

**రైతులను నట్టేట ముంచుతున్న సర్కార్.**
**మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం.**

**సంగారెడ్డి ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**



మాజీ మంత్రి టి. హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. సోమవారం సదాశివపేటలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ కూడా హాజరయ్యారు.

తర్వాత సంగారెడ్డి నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన హరీష్ రావు, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. శనగలను అమ్మడానికి వచ్చిన రైతులను "కోటా పూర్తయింది" అంటూ తిరస్కరించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

రైతులకు బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని హరీష్ రావు ఆరోపించారు. ఇప్పటివరకు రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా ఎలాంటి పథకాలు అమలు కాలేదని, రైతుల కష్టాలను అర్థం చేసుకునే చిత్తశుద్ధి ప్రభుత్వంలో కనిపించడం లేదని విమర్శించారు.రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, శనగల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఉద్యమాలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

## ప్రజావాణిలో 113 ఫిర్యాదుల స్వీకరణ
## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



**ప్రజావాణి పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి ప్రజావాణిలో 113 ఫిర్యాదుల స్వీకరణ**
**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్ ఏప్రిల్ 13(వుదయం ప్రతినిధి)**

పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫైళ్ళను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జిదారుల పిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడుతూ వారి సమస్యలను సావధానంగా విన్నారు. వారి సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.ప్రజావాణి సందర్భంగా మున్సిపాలిటీ, పోలీస్, గృహ నిర్మాణ, విద్యా, వైద్యం, ఉద్యోగ, సంక్షేమ, పంచాయతీరాజ్ , తదితర శాఖలకు సంబంధించిన 113 పిర్యాదులను అధికారులు నమోదు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తులను, అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యను అర్థం చేసుకొని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితులలో ప్రజావాణి పిర్యాదులను పెండింలో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించి పిర్యాదుదారులకు ఒక భరోసాను కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్. బి హరిప్రియ, డి.ఆర్.ఓ రాంరెడ్డి, ఆర్.డి.ఓ నవీన్, జిల్లా అధికారులు, అర్జిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## అభాగ్యుడికి సిద్ధు రావన్ భరోసా

**అభాగ్యుడికి సిద్ధు రావన్ చేయూత**

**జహీరాబాద్ ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

మాజీ భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధిరావన్ జహీరాబాద్ లో అటుగా వెళుతుండగా రోడ్డుపై నిస్సయ స్థితిలో ఉన్న వ్యక్తికి చేయూతని ఇచ్చాడు తన ఒంటిపై బట్టలు లేకుండా రోడ్డుపై దయానియా, నిస్సాయిస్థితిలో పడి ఉన్న ఓ వృద్ధుడు చూసి నా అయన మనసు చలించిపోయింది అటుగా వెళుతున్న సమయంలో చూసిన సిద్ధురావణ్ వ్యక్తి వద్దకు వెళ్లి తన దగ్గర ఉన్న బట్టలను తొడిగించి తనకి అన్నం తినిపించి జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి తనకు సరైన వైద్యం చేయాలని డాక్టర్లకు సూచించి. మానవతాదృక్పథం చాటుకొన్నారు

# మంత్రి సమీక్ష సింగూరుకు మహర్దశ

**సింగూరు ప్రాజెక్టుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష – డ్యామ్ సేఫ్టీ, పర్యాటక అభివృద్ధిపై దృష్టి**

**సంగారెడ్డి వుదయం**



ఆందోల్ నియోజకవర్గంలోని సింగూరు ప్రాజెక్టును రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సందర్శించి, డ్యామ్ సేఫ్టీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షిస్తూ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం వచ్చే 50 ఏళ్లపాటు డ్యామ్ సురక్షితంగా నిలిచేలా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు.సింగూరు ప్రాజెక్టు డ్యామ్ బ్యూటిఫికేషన్ అంశంపై కూడా మంత్రి అధికారులతో చర్చించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సిలారపు రాజనర్సింహ ప్రధాన కాలువ లైనింగ్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఐలాండ్ అభివృద్ధిపై టూరిజం అధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఐలాండ్‌లో బోటింగ్, పార్కులు, గార్డెన్లు, కాటేజీల నిర్మాణం, రెస్టారెంట్, వాటర్ స్పోర్ట్స్ వంటి సదుపాయాల ఏర్పాటు ద్వారా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించారు. ఇందుకు సంబంధించి ఇరిగేషన్, టూరిజం శాఖలతో సంయుక్త సమావేశం నిర్వహించి, సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.డ్యామ్ సేఫ్టీ పనులు శరవేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేసిన మంత్రి, పనుల పురోగతికి అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారంపై కూడా అధికారులతో చర్చించారు. త్వరలోనే డ్యామ్ సేఫ్టీ మరియు టూరిజం అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పెద్దారెడ్డిపేట లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, ఆందోల్ పెద్ద చెరువు ట్యాంక్ బండ్ బ్యూటిఫికేషన్, పర్యాటక అభివృద్ధిపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు.

అనంతరంఆందోల్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన మంత్రి, నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, క్రీడా సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.




# బెజ్జంకి గ్రామసభ భద్రతపై అవగాహన

**బెజ్జంకిలో రహదారి భద్రతపై గ్రామసభ రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్ల పొదల తొలగింపు**

**బెజ్జంకి,ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో గ్రామాభివృద్ధి,రహదారి భద్రత అంశాలపై ఒక ముఖ్యమైన గ్రామసభ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు,బెజ్జంకి పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి నిర్వహించారు.ఈ గ్రామ సభలో గ్రామ ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని రోడ్డు భద్రతపై విస్తృతంగా చర్చించారు. పోలీసులు రహదారుల ఇరువైపుల పెరిగిన పొదలు,చెట్ల కొమ్మలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని, ముఖ్యంగా మలుపులు ఉన్న ప్రాంతాల్లో దృశ్యమానత తగ్గుతోందని వివరించారు.అన్ని వర్గాల సమ్మతితో రహదారి ఇరువైపుల ఉన్న పొదలను తొలగించాలని గ్రామసభలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో గ్రామ ప్రజల సహకారంతో పొదల తొలగింపు కార్యక్రమం చేపట్టబడింది.ఈ చర్యల వల్ల రహదారి దృశ్యమానత మెరుగుపడి వాహనదారులు, పాదచారులకు భద్రత పెరుగుతుందని అధికారులు తెలిపారు.గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో పోలీస్-ప్రజల సమన్వయంతో

జరిగిన ఈ కార్యక్రమం రోడ్డు భద్రతకు ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎస్ఐ సౌజన్య, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉపసర్పంచ్ దుమల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత



**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్,ఏప్రిల్ 13 (వుదయం ప్రతినిధి)**

రోడ్డు భద్రతా అందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లా పోలీస్ శాఖా ఆధ్వర్యంలో నేటి నుండి ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న రోడ్డు సేఫ్టి అవగాహన కార్యక్రమాన్ని కుల్కచర్ల మండలం బండెన్క చర్ల లో నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించక పోవడం, వాటి పట్ల అవగాహన లేక పోవడం వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రోడ్డు పై ప్రయాణం చేసే టప్పుడు ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా అరికట్టబడి

ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు .అందుకు గాను విధిగా హెల్మెట్ మరియు సీట్ బెల్టు ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అతివేగంగా వాహనాలు నడపరాదని ఇలా రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రభుత్వం చేపట్టిన ఈ అవగాహన వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోని ప్రభుత్వ లక్ష్యాన్నినెరవేర్చడం లోభాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా జడ్ పీ సీ ఈ ఓ సుధీర్, ఎస్సై రమేష్, మండల అధికారులు , ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# సంపూర్ణ పౌష్టికాహారంతోనే స్త్రీ ఆరోగ్య వికాసం




**దుబ్బాక ఐసిడిఎస్ ఇంచార్జ్ సిడిపిఓ చంద్రకళ**

**సిద్దిపేట, ఏప్రిల్ 13 (వుదయం )**

సంపూర్ణ పౌష్టికాహారంతోనే స్త్రీ, శిషు, చిన్నారుల ఆరోగ్య వికాసం ఉంటుందని దుబ్బాక ఐసీడీఎస్ ఇంచార్జి సీడీపీఓ చంద్రకళ తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావుపేటలో గ్రామ స్థాయి పోషణ పక్షం కార్యక్రమంలో సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ తో కలిసి పాల్గొన్నారు. ఏప్రిల్ 9 నుండి 23 వరకు జరుగుతున్న పోషణ పక్షం షెడ్యూల్‌లో భాగంగా గ్రామంలోని మొదటి అంగన్వాడీ కేంద్రంలో గ్రామ స్థాయి పోషణ పక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. అదేవిధంగా, వంటకాల ప్రదర్శనలు నిర్వహించి, సులభంగా లభ్యమయ్యే పదార్థాలతో ఆరోగ్యకరమైన ఆహారం తయారీ విధానాలను చూపించారు. ముఖ్యంగా, గర్భం దాల్చిన రోజు నుండి బిడ్డ పుట్టిన తర్వాత రెండేళ్ల వరకు ఉన్న మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ దశలో తల్లి, శిశువుకు సరైన పోషణ ఎంతో కీలకమని వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా అందించే అదనపు సంపూర్ణ భోజనాన్ని ప్రతి అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా, అందరూ కలిసి పోషణ ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి, పంచాయతీ సెక్రెటరీ రవీందర్, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్, రిలయన్స్ కోఆర్డినేటర్ భాస్కర్, సెక్టార్ సూపర్వైజర్ ప్రతిభ, ఏఎన్ఎం లక్ష్మి, వార్డు సభ్యులు శ్యామల, భాను, శ్రీనివాస్, లలిత, జహంగీర్, వెంకటేశం, అంగన్వాడీ టీచర్లు వీణ, స్వప్న, జ్యోతి, ఆశ కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీ ఈనెల 30 వరకు కొనసాగుతుంది

**మహబూబ్ నగర్ ఏప్రిల్ 13(వుదయం ప్రతినిధి)**

మహబూనగర్ జిల్లాలో 506 రేషన్ దుకాణాల ద్వారా మూడు నెలల ఉచిత సన్న బియ్యం పంపిణి ప్రక్రియ విజయవంతంగ జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ తెలిపారు.జిల్లాలో 2,78,386 కార్డులకు గాను ఏప్రిల్వ 13 సోమవారం వరకు 1,71,328 కార్డుదారులు (61%) బియ్యం తీసుకొన్నారని ,

బియ్యం పంపిణి ఈనెల 30 వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుంది. కావున కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చక్కని ఆరోగ్యం

# మెంతి కూర పవర్ తెలిస్తే వదలరు



ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మెంతి ఆకు.. అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు, మధుమేహం నియంత్రణ, చర్మ వ్యాధుల నివారణకు తోడ్పడుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ ఆకు, జ్ఞాపకశక్తిని పెంచి, క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధించగలదు. మెంతి కూరలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మన భారతీయ వంటకాల్లో సర్వసాధారణంగా ఉపయోగించే ఒక అద్భుతమైన ఆకుకూర. ఇది కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని మెంతి లేదా మెంతి కూర అని కూడా పిలుస్తారు. రుచికి చేదుగా ఉన్నప్పటికీ, ఈ ఆకు అనేక పోషక విలువలను, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. సాధారణంగా మెంతి ఆకులో చిన్న మెంతెం, పెద్ద మెంతెం అని రెండు రకాలుంటాయి. ఈ ఆకు శరీరానికి సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుంది. మెంతి ఆకులో కాల్షియం, ఇనుము, ఫాస్పరస్‌లతో పాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఈ పోషకాలు శరీరానికి బలాన్ని చేకూర్చి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. లివర్ ఆరోగ్యం, డయాబెటిస్ నియంత్రణ: మెంతి ఆకు ముఖ్యంగా కాలేయ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ, ఇతర సమస్యలు: మెంతి ఆకు ఆకలిని పెంచుతుంది. దగ్గు, మొలలు, వాంతులు, కీళ్ల వ్యాధులు వంటి అనేక సాధారణ వ్యాధులను నివారిస్తుంది. కడుపులోని నులిపురుగులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. అయితే, పప్పు దినుసులలో దీనిని అతిగా వేయకూడదు.. లేదంటే పప్పు చేదుగా మారుతుంది. రక్తహీనత నివారణ: ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను దూరం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుదల: మెంతికూరలో అధికంగా ఉండే ఫైబర్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. దృష్టి లోపాలు ఉన్నవారు ఈ ఆకును తమ ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవడం మంచిది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండేవాళ్లు మెంతికూరను తీసుకోవచ్చు. ఇది శరీరానికి చలువనిస్తుంది.. వేడి వలన వచ్చే అలర్జీలను దూరం చేస్తుంది. కఫం, పిత్త, వాతం వంటి రోగాలను దరిచేరనివ్వకుండా చేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుదల, క్యాన్సర్ నిరోధం: మెంతి ఆకు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సఫోన్ మ్యూకలేట్ ధాతువులు క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడతాయి. హృదయ ఆరోగ్యం, ఇతర ప్రయోజనాలు: విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వల్ల గుండెపోటు, అలర్జీలు, దృష్టి లోపాలు, రక్తహీనత వంటి వాటిని తొలగిస్తుంది. నరాల బలహీనతతో బాధపడేవారు కూడా మెంతి కూరను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇంకా.. మెంతి ఆకులను పేస్ట్‌లా చేసి ఫేషియల్‌గా ఉపయోగించవచ్చు. ఇది నల్లగా ఉన్నవారికి చర్మకాంతిని పెంచి, ముఖంపై నల్ల మచ్చలు, ముడతలను తగ్గిస్తుంది. మెంతులను నానబెట్టి పేస్ట్‌లా చేసి జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి ఆకుతో, మెంతులతో చేసే పప్పు ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం. మెంతి ఆకును ఎండబెట్టి పొడి చేసుకొని, అవసరమైనప్పుడు పప్పులు, కూరలలో వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. మన ఇంటి పెరడులో మెంతి ఆకును సులువుగా పెంచుకోవచ్చు.. వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు మెంతులు లేదా మెంతి ఆకును ఆహారంలో చేర్చుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇది కేవలం ఒక ఆకుకూర మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఒక దివ్యౌషధం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

# మనసు పెట్టి తింటున్నారా?



ఆహారం పైనే పూర్తి దృష్టి పెట్టాలన్నా, రుచిని ఆస్వాదించాలన్నా.. భోజనం చేసే క్రమంలో కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. తినేటప్పుడు మొబైల్, టీవీ.. తదితర గ్యాడ్జెట్స్‌కి దూరంగా ఉండాలి. పనులున్నాయని గబగబా తినేయడం కాకుండా.. 20-30 నిమిషాల సమయం భోజనానికి కేటాయించాలి. ఎంత తింటామో, అంతా ఒకేసారి ప్లేట్లో పెట్టుకోవడం కాకుండా.. కొద్దికొద్దిగా ఆహారం ప్లేట్లో వడ్డించుకోవాలి. ఎందుకంటే ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఆహారం ప్లేట్లో కనిపిస్తే త్వరగా తినేయాలన్న ఆతృత పెరుగుతుంది. తద్వారా మనసు పెట్టి తినలేం. కాబట్టి తక్కువ మొత్తంలో.. ఓ ముద్ద తగ్గించి తినడం మంచిది. కొంతమంది ఆహారాన్ని నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల ఆహారం రుచిని ఆస్వాదించలేకపోతారు. ఇదీ మనసు పెట్టకుండా తిన్నట్లేనట! అందుకే నోట్లో పెట్టుకున్న ముద్దను నెమ్మదిగా నములుతూ.. రుచిని ఆస్వాదిస్తూ తింటే ఆహారంపై ప్రేమ పెరుగుతుంది. తినే ముందు, మధ్యలో, తిన్నాక.. ఇలా ఎప్పటికప్పుడు ఆకలిని పరిశీలించుకుంటూ తినడం ముఖ్యం. తద్వారా శరీరానికి ఎంత ఆహారం అవసరమో అన్న విషయం అవగతమవుతుంది. ఫలితంగా ఎక్కువ ఆహారం తినకుండా జాగ్రత్తపడచ్చు. చాలామందికి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ తినడం అలవాటు! ఈ క్రమంలో ఇతర విషయాలు కాకుండా.. మీరు తినే ఆహారం గురించే మాట్లాడుకోవడం, ఆరోగ్యకరమైన అప్షన్ల గురించి పంచుకోవడం, రుచుల్ని ప్రశంసించడం కూడా మైండ్‌ఫుల్ ఈటింగ్ కిందకే వస్తుంది.


# బరువును తగ్గించే మ్యాజిక్ బ్రేక్‌ఫాస్ట్

బరువు తగ్గాలనే లక్ష్యంతో చాలామంది చేసే మొదటి పని బ్రేక్ ఫాస్ట్ మానేయడం. కానీ అది ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని కు తెలుసా? బరువు తగ్గడానికి బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కాదు.. అసలు ఏం తింటున్నామన్నదే ముఖ్యం. ఉదయం పూట రు తీసుకునే ఆహారమే రోజంతటి వేగాన్ని, జీవక్రియను నిర్ణయిస్తుంది.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది చేసే అతిపెద్ద తప్పు బ్రేక్‌ఫాస్ట్ విషయంలో అశ్రద్ధ చూపడం. మరి కొందరు బరువు తగ్గాలనే ఉద్దేశంతో అసలు టిఫినే తినరు. అయితే బరువు తగ్గడానికి టిఫిన్ మానేయడం కాదు.. సరైన అల్పాహారం ఎంచుకోవడం ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి రోజంతా అవసరమైన శక్తిని ఇచ్చేది, జీవక్రియను వేగవంతం చేసేది అల్పాహారమే. మరి బరువు తగ్గడానికి ఎలాంటి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి? బరువు తగ్గాలనుకునే వారికి మొలకెత్తిన పప్పులు ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. నానబెట్టిన పచ్చి పప్పు లేదా శనగలను మొలకలు వచ్చిన తర్వాత అందులో ఉల్లిపాయ, టమోటా, దోసకాయ ముక్కలు, కొంచెం నిమ్మరసం, చాట్ మసాలా కలిపి తీసుకోవాలి. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా అనిపిస్తుంది. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను శుభ్రం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఓట్స్, చియా గింజలు, తాజా పండ్లు, బెర్రీలు, మల్టీగ్రెయిన్ బ్రెడ్ వంటివి అల్పాహారంలో భాగంగా ఉండాలి. ఫైబర్ వల్ల కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. ఇది అతిగా తినకుండా మిమ్మల్ని నియంత్రిస్తుంది. ఆఫీసులకు వెళ్లే వారికి, విద్యార్థులకు ఇది బెస్ట్ ఆప్షన్. అల్పాహారానికి ముందే శరీరాన్ని లోపలి నుండి శుభ్రం చేసుకోవడం ముఖ్యం. ఉదయం లేవగానే ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీరు తాగాలి. ఇది శరీరంలోని విషపూరిత వ్యర్థాలను బయటకు పంపివేస్తుంది. సాధారణ టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీ లేదా హెర్బల్ టీలను ఎంచుకోండి. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతూనే బరువు తగ్గడానికి సహకరిస్తుంది. బరువు పెరగడానికి ప్రధాన కారణం అల్పాహారంలో మనం వాడే నూనె, చక్కెర, అధిక కార్బోహైడ్రేట్లు. ప్యాక్ చేసిన తృణ ధాన్యాలు, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండటం ఉత్తమం. సరైన సమయానికి, సరైన మోతాదులో పోషకమైన అల్పాహారం తీసుకోవడం వల్ల కేవలం బరువు తగ్గడమే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. కాబట్టి రేపటి నుండి బ్రేక్‌ఫాస్ట్ ప్లేట్‌ను ఆరోగ్యకరంగా మార్చుకోండి.



## ఆరోగ్యం కోసం పరగడుపున అదొక్కటి తింటే చాలు

చూడటానికి ఎంతో సుకుమారంగా కనిపించినా, వ్యాయామం విషయంలో మాత్రం ఆమె ఒక రోల్‌మోడల్. నిత్యం యోగా, జిమ్ వర్కవుట్లతో తన సోషల్ మీడియాలో స్ఫూర్తిని నింపే ఆ బాలీవుడ్ నటి, తాజాగా తన మార్నింగ్ రొటీన్‌కు సంబంధించిన ఒక వింత అలవాటును పంచుకుంది. సాధారణంగా ఉదయాన్నే నిమ్మరసం, తేనె లేదా గ్రీన్ టీ తాగుతుంటారు. కానీ ఈమె మాత్రం అందరికీ భిన్నంగా ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను నమిలి తింటోంది. ఆ ఘాన వాసన, మండే రుచిని సైతం భరిస్తూ ఆమె ఎందుకు వెల్లుల్లిని తీసుకుంటోంది? కేవలం కొన్ని వారాల నుంచి పాటిస్తున్న ఈ చిన్న మార్పు తన శరీరంలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో ఆమె స్వయంగా వెల్లడించింది. ఇంతకీ సోహా అలీ ఖాన్ నమ్ముతున్న ఆ ప్రాచీన వైద్య రహస్యం ఏంటి? వెల్లుల్లి మంత్రం.. ప్రముఖ నటి సోహా అలీ ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఆసక్తికరమైన వీడియోను షేర్ చేశారు. గత కొన్ని వారాలుగా తను ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఒక చిన్న పచ్చి వెల్లుల్లి రెబ్బను తింటున్నట్లు ఆమె తెలి పారు.



ఇది ప్రాచీన జ్ఞానం అని, ఇప్పటికీ ఇది అద్భుతంగా పనిచేస్తుందని ఆమె నమ్ముతున్నారు. ఈ అలవాటు వల్ల తన రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడిందని సోహా వివరించారు. వెల్లుల్లిని ఊరికే మింగేయడం కంటే నమిలి తినడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సోహా చెబుతున్నారు. వెల్లుల్లిని నమిలినప్పుడు అందులో ఉన్న 'అల్లిసిన్' అనే సమ్మేళనం యాక్టివేట్ అవుతుంది. వెల్లుల్లిలో ఉండే శక్తివంతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ఈ అల్లిసిన్ ప్రధాన కారణం. ఒకవేళ నమలడం కష్టంగా అనిపిస్తే, వెల్లుల్లిని ముక్కలుగాకోసి, దంచి ఒక 10 నిమిషాల పాటు పక్కన పెట్టి, ఆ తర్వాత నీటితో కలిపి తీసుకోవాలని ఆమె సూచించారు.

## చిన్న ముక్క అల్లం తింటే ఇన్ని లాభాలా!

అల్లం కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జలుబు, నొప్పులను తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ నియంత్రణకు, రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడానికి అల్లం తోడ్పడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచి ఆరోగ్యం సొంతం. అల్లం వంటలకు కేవలం మంచి రుచిని ఇవ్వడమే కాదు.. ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అల్లంలో ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు అల్లంతో చెక్ పెట్టొచ్చు. జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటి సమస్యలను తగ్గించడానికి అల్లం మంచి మెడిసిన్. ఆకలిని పెంచడంలో అల్లం బాగా సహాయ పడుతుంది. ముఖ్యంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ బాధితులకు ఆకలి తగ్గిపోతుంది. అల్లం రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేసి, జుట్టును బలంగా, ఒత్తుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మనస్సును ప్రశాంతంగా ఉంచడంలో కూడా ఇది ఎంతో సహాయపడుతుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఈ సహజ ఔషధాన్ని రోజువారీ జీవనశైలిలో చేర్చుకోవడం మంచిది. అలాగే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కొన్నిసార్లు ఆకలిగా అనిపించదు. ఇందులో నొప్పి, వాపును తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుందే కాకుండా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం తినడం లేదా అల్లం నీరు తాగడం శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది. ఒక నెలపాటు ప్రతిరోజూ అల్లం తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అల్లంలోని పదార్థాల వల్ల రక్తంలోని ట్రైగ్లిజరైడ్‌ల పరిమాణం తగ్గుతుంది.



## జుట్టూడిపోకుండా.. ఈ జాగ్రత్తలు!

చిన్న వయసులోనే జుట్టూడిపోవడం ఈమధ్య కామనైపోయింది.. ఇందుకు కారణాలెన్నో. అయితే ఎవరికి వారు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే జుట్టూడిపోకుండా కొంతవరకు కాపాడుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో– జుట్టు ఆరోగ్యానికి పాటించాల్సిన కొన్ని చిట్కాల గురించి తెలుసుకుందాం రండి.. శరీరానికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంత అవసరమో.. శిరోజాల సంరక్షణకు కూడా అంతే



అవసరం. ఇందులో భాగంగా సరిపడినన్ని మంచినీళ్లు తీసుకోవాలి. దీనివల్ల శరీరంలో నీటి స్థాయులు పెరగడమే కాకుండా మలినాలు, వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా జుట్టు కూడా ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది. అవసరమైతే వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవాలి. ఇందులోని పోషకాలు జుట్టు ఆరోగ్యంగా ఉండడానికి సహకరిస్తాయంటున్నారు నిపుణులు. జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే క్రమం తప్పకుండా హెయిర్‌ను ట్రిమ్ చేసుకోవాలి. తలస్నానానికి బాగా వేడిగా ఉండే నీళ్లు ఉపయోగించడం వల్ల జుట్టు కుదుళ్లకు నష్టం కలుగుతుంది. కాబట్టి గోరువెచ్చని నీటినే తలస్నానానికి ఉపయోగించాలి. వెంట్రుకలు దృఢత్వాన్ని సంతరించుకోవాలంటే స్నానం తర్వాత కండిషనర్‌ను రాసుకోవడం తప్పనిసరని చెబుతున్నారు నిపుణులు.

## అనాస పువ్వు..పవర్ ఫుల్ మెడిసిన్..!



అనాస పువ్వు (స్టార్ పువ్వు) వంటలకు రుచిని వ్వడమే కాకుండా, అద్భుత ఆరోగ్య ప్రయోజనాలనిస్తుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. యాంటీవైరల్, యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలతో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది. పీరియడ్స్ సమస్యలు, చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. అనాస పువ్వు .. ఇది ఒకరకమైన సుగంధ ద్రవ్యం.. ప్రతి వంటింట్లోనూ తప్పనిసరిగా ఉంటుంది. దీనినే స్టార్ పువ్వు అని కూడా అంటారు. ఇది వంటలకు రుచిని ఇవ్వడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా మనం తీసుకున్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. పేగు కండరాల కదలికలను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను దరిచేరకుండా చేస్తుంది. అనాస పువ్వులో యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. జీర్ణశక్తిని పెంపొందించడంలో అనాస పువ్వు సహాయపడుతుంది. కడుపులోగ్యాస్, కడుపుఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. అనాస పువ్వు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. రక్తాన్ని శుద్ధి చేసి గుండెకు రక్త ప్రసరణను మెరుగుపర్చడం ద్వారా హృదయ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడంలో అనాస పువ్వు ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనివల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్‌తో బాధపడేవారు అనాస పువ్వును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తాయి. మహిళల్లో పీరియడ్స్ సమయంలో వచ్చే హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో అనాస పువ్వు ఉపయోగపడుతుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పులను కూడా తగ్గిస్తుంది. అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి.

చలికాలం వచ్చిందంటే చాలు, పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన

## ఈ సమయంలో అరటిపండు అస్సలు తినొద్దా

ఆహారం అరటిపండు. అరటిపండు తింటే కఫం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. చలికాలం వచ్చిందంటే చాలు.. చిన్న పిల్లల తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఇలాంటప్పుడు వారి ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే శ్లేష్మం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ ఇందులో నిజమెంత? చలికాలంలో అరటిపండు పెట్టడం సురక్షితమేనా? నిజానికి జలుబు లేదా దగ్గు అనేవి వైరస్ల ద్వారా వచ్చే ఇన్ఫెక్షన్లు. ఏ పండు కూడా నేరుగా జలుబును కలిగించదు. అరటిపండు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరుగుతుందని నిరూపించడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అరటిపండు తిన్నప్పుడు గొంతులో కొంచెం బిగుతుగా అనిపించడం సహజం. అది కేవలం ఆ పండు ఆకృతి వల్ల కలిగే అనుభూతి మాత్రమే తప్ప కఫం కాదు. పిల్లలు జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు నీరసించి పోతుంటారు. ఏ తినడానికి ఇష్టపడరు. అలాంటి సమయంలో అరటిపండు వారికి ఒక వరంలా పనిచేస్తుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలకు తక్షణ శక్తిని ఇస్తుంది. అరటిపండు మెత్తగా ఉండటం వల్ల గొంతు నొప్పి ఉన్న పిల్లలు కూడా దీనిని సులభంగా తినగలరు. ఇందులోని విటమిన్ సి, విటమిన్ బి6 రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌తో పోరాడటానికి సహాయపడతాయి. శరీరంలోని ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడుతుంది. పిల్లలకు అరటిపండు పెట్టినప్పుడు ఒకవేళ విరేచనాలు అవుతుంటే మాత్రం తాత్కాలికంగా ఆపేయడం మంచిది. చలికాలంలో ఏ ఆహారమైనా మితంగా ఇవ్వాలి. రోజుకు ఒకటి లేదా సగం అరటిపండును మ్యాష్ చేసి ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టిన అరటిపండ్లను నేరుగా పిల్లలకు ఇవ్వకండి. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పండ్లను మాత్రమే ఇవ్వండి. అరటిపండు ప్రకృతి మనకిచ్చిన ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్. అనవసరమైన అపోహలతో పిల్లలకు ఈ పోషకాలను దూరం చేయకండి. జలుబు చేసినప్పుడు ఆకలిగా లేని పిల్లలకు అరటిపండు ఒక మంచి ప్రత్యామ్నాయం.



# వీటితో మేకప్ లుక్ సొంతం!



బయటికి వెళ్లిన ప్రతిసారీ మేకప్ వేసుకోవడం కుదరకపోవచ్చు.. అలాగే తరచూ మేకప్ వేసుకోవడం కొందరికి నచ్చకపోవచ్చు. అయినా మేకప్ వేసుకున్న లుక్‌ని సొంతం చేసుకోవాలంటే..? ఈ చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. మేకప్ డీటాక్స్‌లో భాగంగా ప్రాథమిక చర్మ సంరక్షణను పాటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసుకోవాలి. ఇది ఎండ నుంచి చర్మానికి రక్షణ కల్పించడమే కాదు.. చర్మానికి ఒక రకమైన మెరుపును తీసుకొస్తుంది. డల్‌గా ఉన్న ముఖాన్ని ప్రకాశవంతంగా మార్చాలంటే టింటెడ్ మాయిశ్చరైజర్‌ను వాడాలి. ఇక ప్రత్యేక సందర్భాల్లో మాత్రం హై కవరేజ్ ఫౌండేషన్స్‌ను వాడితే ఫలితం ఉంటుంది. అయితే ఏది ఎంచుకున్నా చర్మతత్వాన్ని బట్టి ఎంచుకోవడం ముఖ్యం. చర్మంపై మృత కణాలు ఏర్పడడం, పొలుసులుగా ఊడిపోవడం వల్ల ముఖం డల్‌గా కనిపిస్తుంది. దీనికి ఎక్స్‌ఫోలియేషన్ పద్ధతి మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీ చర్మతత్వాన్ని బట్టి స్క్రబ్‌ను ఎంచుకొని లేదంటే ఇంట్లోనే సహజ స్క్రబ్‌లను తయారుచేసుకొని స్క్రబింగ్ చేసుకోవాలి. దీనివల్ల చర్మం లోలోపలి నుంచి శుభ్రపడి సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. మేకప్ వేసుకోకపోయినా ఆ మెరుపును పొందాలంటే ముఖం శుభ్రం చేసుకున్నాక టోనర్ వాడమంటున్నారు నిపుణులు. దీనివల్ల ముఖంపై పీహెచ్ స్థాయులు బ్యాలన్స్ అయి చర్మం తాజాగా కనిపిస్తుంది. పెదాలు మృదువుగా ఉన్నప్పుడే వాటి అందం ఇనుమడిస్తుంది. ఇందుకోసం రోజూ లిప్‌బామ్ రాసుకోవడం తప్పనిసరి! అలాగే ఆలివ్ ఆయిల్ వంటి నూనెలతో పెదాలపై మర్దన చేసుకోవడం వల్ల వాటికి సహజ మెరుపు వస్తుంది. ఫలితంగా లిప్‌స్టిక్ రాసుకునే అవసరమే ఉండదంటున్నారు నిపుణులు.

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (202526)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు.




# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు



### 8 నిమిషాల్లో రూ.8 లక్షల కోట్లు మాయం

అంతర్జాతీయంగా ముంచుకొస్తున్న యుద్ధ భయాలు భారత స్టాక్ మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. అమెరికాఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడం, ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 డాలర్ల మార్కును దాటడంతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. వారీ మొదటి రోజే (ఏప్రిల్ 13, సోమవారం) దలాల్ స్ట్రీట్ భారీ పతనంతో ప్రారంభమైంది. సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ పాతాళానికి పడిపోవడంతో ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోతోంది. ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు ఎటువంటి ఫలితం లేకుండా ముగియడం ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. దీనికి తోడు ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో యుద్ధం అనివార్యమనే సంకేతాలు వెలువడ్డాయి. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర ఒక్కసారిగా 100 డాలర్ల మార్కును దాటిపోయింది. భారత్ తన చమురు అవసరాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతుంది కాబట్టి, చమురు ధరల పెరుగుదల మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బగా మారింది. సోమవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1613 పాయింట్లు క్షీణించి 75,937 స్థాయి వద్ద ట్రేడవుతోంది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 461 పాయింట్లు నష్టపోయి 23,589 వద్ద కీలక మద్దతు స్థాయిని కోల్పోయింది. ముడిచమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి, ద్రవ్యోల్బణం భారంగా మారుతుందన్న భయంతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటో, ఐటీ రంగాల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. భారత మార్కెట్లే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల సూచీలు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. జపాన్ కు చెందిన నికాయ్ 0.84 శాతం పడిపోగా, దక్షిణ కొరియా కోస్పి 1.83 శాతం మేర నష్టపోయింది. హాంగ్ కాంగ్ కి చెందిన హాంగ్ సెంగ్ కూడా 1.16 శాతం బలహీనపడింది. ఇక వాల్ స్ట్రీట్ పరిస్థితి చూస్తే.. అమెరికా ఫ్యూచర్స్ భారీ అమ్మకాలను ఎదుర్కొంటున్నాయి.

# 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు



పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయించారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి.

వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును,

40 శాతం గ్యాస్‌ను, 8590 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 23 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతు



న్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.


# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే

అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ.1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ.1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ.2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.264.90 పలుకుతోంది. యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.




# నితీశ్.. మ్యాచ్‌లో లేకున్నా జరిమానా

చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళిని ఉల్లఘించిన కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ నితీశ్ రాణాకు శిక్ష పడింది. అతడి మ్యాచ్ ఫీజులో రిఫరీ 25 శాతం జరిమానా విధించాడు. శనివారం రాత్రి జరిగిన ఈ మ్యాచ్‌కు నితీశ్ డీసీ తుది జట్టులో లేడు. కానీ మ్యాచ్ సందర్భంగా డగౌట్ దగ్గర అతను అంపైర్‌తో గొడవ పడ్డాడు. ఢిల్లీ 19వ ఓవర్లో చెమటతో తడిచిన గ్లవ్స్‌ను మార్చుకుంటానని బ్యాటర్ స్టబ్స్ కోరగా.. అంపైర్ నిరాకరించాడు. తర్వాతి బంతికే అతను ఔపోయాడు. గ్లవ్స్ మార్చుకోవడానికి స్టబ్స్‌కు అనుమతి ఇవ్వకపోవడంపై డగౌట్ వద్ద నాలుగో అంపైర్‌తో నితీశ్ వాగ్వాదానికి దిగాడు. "ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించినందుకు నితీశ్ రాణా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తున్నాం.




## బుమ్రాకు ఏమైంది.. ఆందోళనలో ఫ్యాన్స్



బుమ్రా. ఈ పేరు వింటేనే ప్రత్యర్థులకు వణుకు పుడుతుంది. బుమ్రా బౌలింగ్‌కు దిగాడంటే అవతల బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. ఆ బంతిని ఎలా ఆడాలో మెదడులో సవాలక్ష ఆలోచనలు గిర్రున తిరుగుతుంటాయి. పొరపాటు జరిగిందా... పెవీలియన్‌కు వెళ్లి కూర్చోవడమే. అలాంటి భయం పుట్టించాడు బుమ్రా. కానీ ప్రస్తుత ఐపీఎల్ సీజన్ చూస్తుంటే బుమ్రా పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వేసిన తొలి బంతిని ఎదుర్కొన్న 15ఏళ్ల బుడ్డోడు సూర్యవంశీ బంతిని ఏకంగా సిక్స్‌గా బాదాడు. దీంతో మిగతా బ్యాట్స్‌మెన్లలో కూడా బుమ్రా అనే పేరుకున్న భయాన్ని తొలగించాడు. ఇంతకీ బుమ్రాకు ఏమైంది..? జస్ప్రీత్ బుమ్రా... ఐపీఎల్ 2026లో ఇప్పటి వరకు ఒక్క వికెట్ తీయలేదు.తన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌లకు రక్తకన్నీరు అంటే ఏంటో చూపించే బుమ్రా...ఒక్క వికెట్ కూడా తీయకపోవడంతో.. ఇప్పుడు అదే రక్తకన్నీరు అంటే ఎలా ఉంటుందో రుచి చూస్తున్నాడు. వికెట్ తీయడం సంగతి అటుంచితే పరుగులు కూడా భారీగానే ఇస్తున్నాడు.గతేడాది అంటే 2025 ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ఆడిన చివరి మ్యాచ్‌లో ఒక్క వికెట్ తీయని బుమ్రా... ఈ 2026 ఐపీఎల్‌లో 4 మ్యాచ్‌లు ఆడినప్పటికీ ఇంకా వికెట్ల ఖాతా తెరవకపోవడం అభిమానులను కలవరపెడుతోంది.ఎవరికైనా సరే గడ్డుకాలం నడుస్తుంది. అలానే ప్రస్తుం బుమ్రా విషయంలో కూడా అదే బ్యాడ్ ఫేజ్ నడుస్తోంది. ఈ సమయంలోనే ఆ పేసర్‌కు టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు పలువురి సపోర్ట్ లభిస్తోంది. బుమ్రా బ్యాడ్ ఫేజ్‌లో అండగా నిలిచాడు తన మాజీ సహచరుడు టీమిండియా మాజీ స్పిన్నర్ అశ్విన్ రవిచంద్రన్. వికెట్లు తీయడం కన్నా బుమ్రా వేసే యార్కర్లు తద్వారా పరుగులను నిలువరించడమనేది చాలా ముఖ్యం అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. బుమ్రా వికెట్లు తీయకపోవచ్చు కానీ పరుగుల వరదను నియంత్రిస్తున్నాడని అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. నియంత్రిస్తున్నాడనే విషయాన్ని అశ్విన్ గుర్తు చేశాడు.

# అందరూ అనుకున్నట్లు కాదు, నా లెక్క వేరు

ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న (ఏప్రిల్ 12) రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ముంబై ఇండియన్స్‌ను వారి సొంత ఇలాకాలో చిత్తుగా ఓడించింది. ఫిల్ సాల్ట్ (78), విరాట్ కోహ్లి (50), రజత్ పాటిదార్ (53), టిమ్ డేవిడ్ (34 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆర్సీబీకి భారీ స్కోర్ అందించారు. విజయానంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ హర్షం? వ్యక్తం చేశాడు. జట్టు ప్రదర్శన, వ్యక్తిగత ప్రదర్శనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబైలో ఆడటాన్ని గొప్ప అనుభూతిగా పేర్కొన్నాడు. విరాట్ గాయంపై అప్‌డేట్ ఇచ్చాడు. మొత్తంగా జట్టు ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేశాడు. రజత్ మాటల్లో.. ముంబైలో, ప్రత్యేకంగా వాంఖడే మైదానంలో ఆడటం ఎప్పుడూ ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. ఇక్కడి అభిమానులు, వా



తావరణం, ఫుల్‌ప్యాక్ స్టేడియంలో ఆడటం వేరే లెవెల్ ఫీలింగ్ ఇస్తుంది. ఈ మ్యాచ్‌లో జట్టు ప్రదర్శన సంతృప్తిని కలిగించింది. విరాట్ భాయ్, ఫిల్ సాల్ట్ మంచి ఆరంభాన్ని ఇచ్చి మాకు డ్రైవింగ్ సీట్ ఇచ్చారు. అందుకే నేను, టిమ్ స్వేచ్ఛగా షాట్లు ఆడగలిగాము. ఇది పూర్తిగా టీమ్ ఎఫర్ట్. చాలామంది నేను స్పిన్ బౌలింగ్‌ను బాగా ఆడగలనని అనుకుంటారు. కానీ నిజానికి నాకు ఫాస్ట్ బౌలింగ్ ఆడటం చాలా ఇష్టం. అందులోనే నేను సౌకర్యవంతంగా ఆడగలను. ఈ పిచ్‌లో పేసర్లపై ఎదుర్కోవడం చాలా బాగుంది. విరాట్ భాయ్ గాయంపై నాకు పూర్తి సమాచారం లేదు. కానీ ఆయన బాగానే ఉన్నారని అనిపిస్తోంది. రజత్ మాటలను బట్టి చూస్తే.. జట్టు ప్రదర్శనపై అతను చాలా సంతృప్తిగా ఉన్నాడు. భయం లేకుండా బ్యాటింగ్ చేయడాన్ని ప్రోత్సహిస్తున్నాడు. స్పిన్నర్ల కంటే పేసర్లనే మెరుగ్గా హ్యాండిల్ చేయగలనన్న విషయాన్ని స్పష్టం చేశాడు.కాగా, ఎంఐతో మ్యాచ్‌ను ఆర్సీబీ తొలుత బ్యాటింగ్ చేసే సమయంలోనే తమ ఖాతాలో వేసుకుంది. సాల్ట్, విరాట్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చి పవర్ ప్లేలోనే మ్యాచ్ ఫేట్‌ను డిసైడ్ చేసేశారు. ఆతర్వాత రజత్, టిమ్ బ్యాటింగ్ ధాటి ఆర్సీబీ గెలుపును ఖరారు చేసింది. బౌలర్లు పెద్దగా రాణించకపోయినా, అది చేసిన భారీ స్కోర్ వల్ల వచ్చిన ధీమా మాత్రమే. మొత్తంగా ఆర్సీబీ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాకు తగ్గ ప్రదర్శనలు చేస్తూ, ప్రస్తుత సీజన్‌లో నూ టిల్ దిశగా సాగుతోంది.

# పాండ్యా బ్రదర్స్ మధ్య ముదిరిన విభేదాలు?

చాలా కాలంగా హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా మధ్య సంబంధాలు సరిగ్గా లేవని పుకార్లు వస్తున్నాయి. ఆదివారం జరిగిన ముంబైబెంగళూరు మ్యాచ్‌లో ఇవి నిజమేనని అభిమానులకు ఒక క్లారిటీ వచ్చింది. మ్యాచ్ జరుగుతున్నంత సేపు ఇద్దరు సోదరులు ఒకరినొకరు కనీసం కళ్లలోకి కూడా చూసుకోలేదు. హార్దిక్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆర్‌సీబీ తరపున ఫీల్డింగ్ చేస్తున్న కృనాల్ చాలా దూరం మెయింన్ చేశారు. వీరిద్దరి మధ్య గతంలో ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు ఇసుమంతైనా కనిపించలేదు. అసలు గొడవ ఎక్కడ మొదలైందంటే.. హార్దిక్ పాండ్యా అవుట్ అయినప్పుడు కెమెరాలు కృనాల్ వైపు మళ్లాయి. తన సొంత తమ్ముడు అవుట్ అయితే కృనాల్ చాలా దూకుడుగా సంబరాలు చేసుకున్నారు.

గాలిలోకి ఎగురుతూ, ఆవేశంగా అరుస్తూ ఆయన చేసిన హంగామా చూసి నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ప్రత్యర్థి జట్టు ఆటగాడిగా వికెట్ పడితే సంతోషించడం సహజమే అయినా, ఒక సోదరుడిగా కృనాల్ ప్రవర్తన అస్వాభావికంగా ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విభేధాల వెనుక పాత వివాదాలు ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలో తమ సవతి సోదరుడు వైభవ్ పాండ్యాపై రూ.4 కోట్ల చీటింగ్ కేసు పెట్టినప్పుడు ఈ సోదరులిద్దరూ కలిసి ఉన్నారు. కానీ, హార్దిక్ తన భార్య నటాషా స్టాంకోవిచ్‌తో విడాకులు తీసుకున్న తర్వాత పరిస్థితి మారిపోయింది. నటాషాతో కృనాల్ దంపతులు సన్నిహితంగా ఉండగా, హార్దిక్ మాత్రం మహీకా శర్మతో ఎక్కువ సమయం గడుపుతున్నారు

. ఇటీవల హార్దిక్ ఐసీసీ ట్రోఫీ గెలిచినప్పుడు కూడా కృనాల్ సోషల్ డియాలో కనీసం విష్ చేయకపోవడం అప్పట్లోనే హాట్ టాపిక్ అయ్యింది.

# టాన్స్ అలవోకగా



గుజరాత్ టాన్స్ మురిసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56, 40 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), జోశ్ బట్లర్ (60, 37 బంతుల్లో 11 ఫోర్లు) అర్థ సెంచరీలతో రాణించటంతో 165 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ టాన్స్ 18.4 ఓవర్లలోనే ముగించింది. లక్నో సూపర్‌జెయింట్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఛేదనలో శుభ్‌మన్ గిల్, జోశ్ బట్లర్ మెరవటంతో సూపర్‌జెయింట్స్ బౌలర్లు తేలిపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో8 వికెట్లకు 164 పరుగులు చేసింది. టాన్స్ పేసర్ ప్రసిద్ కృష్ణ (4/28), అశోక్ శర్మ (2/32) రాణించారు. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (30, 21 బంతుల్లో 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (18, 11 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. నాలుగు వికెట్లతో మెరిసిన ప్రసిద్ కృష్ణ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సీజన్లో 4 మ్యాచ్‌ల్లో టాన్స్‌కు ఇది రెండో విజయం కాగా, సూపర్‌జెయింట్స్‌కు 4 మ్యాచ్‌ల్లో రెండో ఓటమి.ఆడుతూ పాడుతూ : 165 పరుగుల లక్ష్యాన్ని టాన్స్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (15) పవర్‌ప్లేలోనే వికెట్ కోల్పోయాడు. శుభ్‌మన్ గిల్ (56), జోశ్ బట్లర్ (60) రెండో వికెట్‌కు గెలుపు భాగస్వామ్యం నమోదు చేశారు. 6 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 34 బంతుల్లో శుభ్‌మన్ గిల్ అర్థ సెంచరీ సాధించాడు. పవర్‌ప్లేలో గిల్ యాంకర్ పాత్ర పోషించగా, బట్లర్ దూకుడుగా ఆడాడు. 9 ఫోర్లతో 29 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన జోశ్ బట్లర్..

సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులో పెట్టాడు. దీంతో టాన్స్ బ్యాటర్లు ఏ ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. అర్థ సెంచరీల తర్వాత గిల్, బట్లర్ నిష్క్రమించినా.. వాషింగ్టన్ సుందర్ (21 నాటౌట్, 13 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ తెవాటియ (10 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్) నాల్గో వికెట్‌కు అజేయ భాగస్వామ్యం జోడించారు. మరో 8 బంతులు ఉండగానే టాన్స్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. సూపర్‌జెయింట్స్ బౌలర్లలో మహ్మద్ షమి (1/36), ప్రిన్స్ యాదవ్ (1/31), దిగ్వేశ్ (1/31) రాణించారు.

# యువ పేసర్‌కు శ్రీలంక ఎన్వోసీ



ఐపీఎల్ 19లో వరుస ఓటములతో నైరాశ్యంలో కూరుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఓ శుభ వార్త. యువ పేసర్, శ్రీలంక ఆటగాడు మతీశ పతిరణ త్వరలోనే జట్టుతో చేరనున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో గాయపడిన మతిశ పతిరణ కోలుకుని ఫిట్‌నెస్ సాధించాడు. శ్రీలంక క్రికెట్ బోర్డు నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షకు హాజరైన పతిరణ.. టెస్టులో పాసై నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) పొందాడు. ఈ నెల 17న కొలంబో నుంచి బయల్దేరనున్న పతిరణ.. ఆ రోజే కోల్‌కతా నైట్‌రైడర్స్ శిబిరంలో చేరనున్నాడు. 16న గుజరాత్ టాన్స్‌తో నైట్‌రైడర్స్ తలపడనుంది. 19న ఈడెన్‌గార్డెన్స్‌లో రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్‌కు పతిరణ అందుబాటులో ఉండనున్నాడు. అయితే, పతిరణకు నైట్‌రైడర్స్ వైద్య బృందం సైతం గ్రీన్ సిగల్ ఇవ్వాల్సి ఉంటుంది. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను సీజన్‌కు ముందే విడుదల చేయగా.. హర్షిత్ రానా, ఆకాశ్ దీప్ గాయాల బారిన పడటంతో నైట్‌రైడర్స్ పేస్ విభాగం బలహీనపడింది. మతీశ పతిరణ రాకతో ఆ జట్టు బౌలింగ్ దళానికి సరికొత్త ఉత్సాహం రానుంది.

# వుదయం సినిమా


MOVIE TIME!

## సెన్సార్ కార్యక్రమాల్లో ఆర్ కే దీక్ష



ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శక నిర్మాతగా డి ఎస్ రెడ్డి సమర్పణలో ఢీ, జోడి ఫేమ్ అక్సఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్ గా, కిరణ్ హీరోగా నటిస్తున్న చిత్రం "ఆర్ కే దీక్ష". ఈ చిత్రంలో తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ఇతర కీలక పాత్రలు పోషించారు. "ఆర్ కే దీక్ష" సినిమా ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తామని దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## నాగబాబు చేతుల మీదుగా చిరంజీవి పోస్టర్





కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా "చిరంజీవి". ఈ చిత్రంలో తనికెళ్ల భరణి,ఈశ్వరీ రావు, గోపరాజు రమణ,శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై దీప్తినడిమింటి నిర్మిస్తున్నారు. సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు."చిరంజీవి" సినిమా వేసవి విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను మెగా బ్రదర్ నాగబాబు చేతుల మీదుగా లాంఛ్ చేశారు.ఈ సందర్భంగా నాగబాబుకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపారు. డెక్ట్రోకార్డియా (కుడివైపు గుండె ఉండే అరుదైన పరిస్థితి)తో ఉండే చిరు అనే యువకుడు తన జీవితంలో ఎదురైన సంఘర్షణలను, సవాళ్లను, అరుదైన పరిస్థితిని ఎలా తట్టుకుని నిలబడ్డాడు , తను అనుకొన్నవి ఎలా సాధించాడు అనేది ఈ చిత్రంలో ఆద్యంతం ఇంట్రెస్టింగ్ గా, ఇన్స్ పైరింగ్ గా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు సాయి వెంకట్. ప్రేక్షకులను ఎంగేజ్ చేసే అన్ని ఎలిమెంట్స్ తో సమ్మర్ రిలీజ్ కు రాబోతోందీ చిత్రం. త్వరలోనే "చిరంజీవి" సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.

## ప్రొడక్షన్ నెం.3 స్టార్ట్



ఎన్టీఆర్ దేవరతో సెన్సేషనల్ క్రియేట్ చేసిన ప్రముఖ నిర్మాణ సంస్థ యువ సుధ ఆర్ట్స్ బ్యానర్ మరో భారీ సినిమాను రూపొందించటానికి సిద్ధమైంది. మాస్ కా దాస్‌గా అందరూ పిలుచుకునే విశ్వక్ సేన్ హీరోగా నిర్మాత సుధాకర్ మిక్కిలినేని ఈ క్రేజీ ప్రాజెక్ట్ ను స్టార్ట్ చేశారు.

ప్రస్తుతానికి యువ సుధ ఆర్ట్స్ ప్రొడక్షన్ నెం.3 అనే పేరుతో రూపొందుతున్న ఈ సినిమాలో విశ్వక్ సేన్ హీరోగా నటించటంతో పాటు సమర్పకుడిగానూ వ్యవరిస్తుండటంతో ప్రాజెక్ట్‌పై మరింత హైప్ పెరిగింది. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమాలను సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ కొరటాల శివ క్లాప్ కొట్టగా, నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసి, స్క్రిప్ట్‌ను అందించారు.

ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు రజత్ దర్శకత్వం వహిస్తున్నారు. అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రాఫర్‌గా, తేజస్ కృష్ణ మ్యూజిక్ డైరెక్టర్‌గా వర్క్ చేస్తున్నారు. బ్లాక్ బస్టర్ రైటర్స్ భాను భోగవరపు, నందు సవిరగాన డైలాగ్స్ రాస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు.

## తిమ్మరాజుపల్లి టీవీ గోపాల గోపాల సాంగ్




న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ రోజు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా నుంచి 'గోపాల గోపాల..' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించగా, వంశీకాంత్ రేఖన కంపోజ్ చేశారు, మేఘన నాయుడు పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే ' గోకుల గోపాలక, మాధవ నారాయణ, కానగా సాధ్యమా, కలియుగ మాయ, గోకుల గోపాలక, మాధవ నారాయణ, కాలమే సాక్షిగా అలమిన మాయ, నీదు మాయే నీల వర్ణా , హాసమైనా శోకమైనా కాంతులే నిలుపవా కనుతడిన..' అంటూ కలియుగంలో జరుగుతున్న వింత ఘటనల్ని ఆ గోవిందుడికి విన్నవిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

## తిమ్మరాజుపల్లి టీవీ

### ప్యూర్ సస్పెన్స్ డ్రామా మూవీ : వి. మునిరాజు



న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు దర్శకుడు వి.మునిరాజు. దర్శకుడు కావాలనేది నా కల. ఇండస్ట్రీకి వచ్చాక జాబ్ కోసం ఆన్ లైన్ ఎడిటింగ్ చేయడం మొదలుపెట్టాను. కొంతకాలం ఆన్ లైన్ ఎడిటింగ్ చేస్తుంటే డైరెక్షన్ అనే కలకు దూరంగా ఉండిపోతున్నా అనిపించింది. దాంతో ఒక స్క్రిప్ట్ అనుకుని దాన్ని ఊరికి వెళ్లి అక్కడి వాళ్లతో డెమో షూట్ చేశాను. తిరిగొచ్చి ఇక్కడ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చేయించాను. ఆ తర్వాత మీటర్ మూవీ షూటింగ్ టైమ్ లో కిరణ్ అబ్బవరం గారు పరిచయం అయ్యారు. ఆయన ఏం చేస్తున్నావు అని అడిగారు. అలా మాటల్లో నా డెమో మూవీ గురించి చెప్పాను. ఆయనకు నచ్చి కథ ఏంటని అడిగారు. స్క్రిప్ట్ చెప్పాక పూర్తిస్థాయిలో డెవలప్ చేయి మనం మూవీ చేద్దామని అన్నారు. అలా "తిమ్మరాజుపల్లి టీవీ" మూవీకి తొలి అడుగులు పడ్డాయి.

## అట్టహాసంగా తెరచాప ప్రీ రిలీజ్ ఈవెంట్



అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, ఫిష్ వెంకట్, జబర్దస్త్ అశోక్, నాగి, అప్పారావు, రైసింగ్ రాజు, రాజేష్ భూపతి, నాగ వంశీ, శ్రీనివాస్ నేస, చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషించారు. అజీమ్, వెంకట్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేసిన ఈ చిత్రానికి ప్రజల్ క్రిష్, ఎం.ఎల్ రాజా సంగీతాన్ని అందించారు. రాజు బొడసింగి ఎడిటింగ్ చేయగా జీవన్ జార్జ్ కొరియోగ్రఫీ చేశారు. ప్రమోషన్స్ కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. సాంగ్స్, టీజర్, ట్రైలర్ కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఏప్రిల్ 17వ తేదీన ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం అట్టహాసంగా ప్రీ రిలీజ్ వేడుక చేయడం జరిగింది.

## నాగబంధం సెకండ్ సింగిల్ సుర సుర



దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్', విరాట్ కర్ణా హీరోగా నటిస్తున్న చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇందులో పౌరాణిక కథ, చరిత్ర, యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్, సాంస్కృతిక అంశాలు వున్నాయి. చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సెకండ్ సింగిల్, “సుర సుర” (తెలుగు) ను ఏప్రిల్ 19న విడుదల చేయడానికి సిద్ధమవుతుండటంతో, సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌కు లభించిన అద్భుతమైన స్పందనతో ఈ చిత్రంపై ప్రేక్షకులలో అంచనాలు పెరుగుతున్నాయి. 'సుర సుర' పాటను సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందం, ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా రూపొందించారు. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్, ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌లతో ఈ పాట సినిమా లో ఒక మెయిన్ హైలెట్ గా నిలవనుంది.



## మే 8న గోదారి గట్టుపైన



యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన' తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. టీజర్, సాంగ్స్ అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ రోజు మేకర్స్ 'గోదారి గట్టుపైన' రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. మే 8న ఈ చిత్రం వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఒక వైపు సుమంత్ ప్రభాస్, మరో వైపు జగపతి బాబు.. మధ్యలో నిధి ప్రదీప్ నిల్చున్న రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ పోస్టర్ కథపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రం ప్రేక్షకులను లవ్, ఫ్యామిలీ మోషన్స్ కట్టిపడేసే అనుభూతిని అందించబోతోందని ఈ పోస్టర్ చూస్తోంది.

## మంచి సినిమా తీశామనే సంతృప్తి ఉంది

### డెకాయిట్ నిర్మాత సుప్రియ యార్లగడ్డ



హిట్ మిషన్ అడివి శేష్ లేటెస్ట్ ఆడియన్స్ బ్లాక్ బస్టర్ 'డెకాయిట్. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. షానియల్ డియో దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో విమర్శకులు, ప్రేక్షకుల ప్రశంసలు అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత సుప్రియ యార్లగడ్డ విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**డెకాయిట్ కు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఎలా అనిపిస్తోంది ?**

చాలా హ్యాపీ. ఆడియన్స్ నుంచి వచ్చే రెస్పాన్స్ మనసుకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

**ఒక భాషలో తీసి డబ్ చేసి వుంటే బడ్జెట్ తగ్గేది కదా?**

అన్నీ బడ్జెట్ పరంగా అలోచేస్తే సినిమాకి, కథకి న్యాయం చేయలేం. సినిమా అంటే ఒక మ్యాజిక్ వుండాలి. అలాంటి మ్యాజిక్ ఈ కథకు అవసరం అనిపించింది. అయితే అన్నీ జాగ్రతలు తీసుకునే చేశాం.

హిందీలో రెస్పాన్స్ చాలా బావుంది. తెలుగులో తీసిన సినిమా అక్కడికి చేరడం చాలా ఆనందంగా వుంది. హిందీలో లాంగ్ రన్ వుంటుంది. డెకాయిట్ ని తమిళ్ మలయాళం కన్నడలో కూడా డబ్ చేశాం. కాకపోతే ఆ డబ్ ఓటీటీకి పరిమితంగా వుంటుంది. సినిమా కేరళలో దుల్కర్ గారి బ్యానర్ ద్వారా రిలీజ్ అయ్యింది.

**పవన్ సింగ్ క్యామియో గురించి?**

పవన్ సింగ్, జోనితా లాంటి స్టార్స్ వుండటం వలన నార్త్‌లో చాలా హెల్ప్ అయ్యింది. పవన్ సింగ్ గారిని ఒక పాట పాడమని సంప్రదించారు. అయితే ఆయనే కనిపిస్తాని అన్నారు.

**డెకాయిట్ లో మీరు ఎదురుకున్న ఛాలెంజ్?**

దాదాపు అందరూ కొత్తవాళ్ళతో చేశాం. అందరూ యంగ్ టీం. అన్నపూర్ణ స్టూడియోస్, నాగార్జున గారు చాలా మంది కొత్తవాళ్ళని పరిచయం చేశారు. అయితే ప్రాజెక్ట్ చేస్తున్నప్పుడు కెమరామ్యాన్ అయినా అనుభవం కలిగిన వారు వుంటారు. ఆయన అనుభవం సినిమాకి చాలా ఉపయోగపడుతుంది. కాకపోతే ఇందులో డీవోపీ కూడా కొత్తే.

**డెకాయిట్ క్లైమాక్స్ రిస్క్ అనిపించలేదా?**

మంచి సినిమాకి ఎప్పుడూ రిస్క్ వుంటుంది. ఈ సినిమాలో క్లైమాక్స్ నే అందం. నాకు డ్రామా, ప్రేమకథలు ఇష్టం, కాకపోతే ఇప్పుడు తెలుగు అవి మిస్ అవుతున్నాయి. డెకాయిట్ కథని నిజాయితీగా చెప్పాలనుకున్నాం. చాలా మంది క్లైమాక్స్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు.

**యూఎస్ రెస్పాన్స్ ఎలా వుంది?**

అద్భుతంగా వుంది. వీకెండ్ కి వన్ మిలియన్ దాటేస్తుంది. మహిళలకు, యువతకు సినిమా చాలా కనెక్ట్ అవుతుంది.

## మారెమ్మ బావ బావ సాంగ్

మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగు పెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన తర్వాత మేకర్స్ ఈ రోజు మారెమ్మ ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్ ని రిలీజ్ చేశారు.

ప్రశాంత్ ఆర్ విహారి స్వరపరిచిన ఈ పాటలో పల్లెటూరి మట్టి వాసనతో పాటు మోడరన్ మ్యూజిక్ లేయర్స్ మిళితమై ఎంతో మధురమైన అనుభూతిని కలిగిస్తోంది ప్లజెంట్ ఫీల్‌ను అందించేలా ఈ పాట సాగే తీరు ఆకట్టుకుంటుంది. కమల్ ఎస్లవత్ లిరిక్స్ బావ పై ఉన్న ఆప్యాయతను ఎంతో సింపుల్‌గా, హృదయానికి దగ్గరగా వ్యక్తపరుస్తాయి. శృతి రంజని తన స్వరంలో ఉన్న నేచురల్, రస్టిక్ టచ్‌తో పాటకు మరింత ప్రాణం పోసింది.



## రాజీవ్ ఐక్యూ వర్సెస్ సుమ జీబీ

### క్యాంపెయిన్ తో అక్షయ తృతీయను సెలబ్రేట్ చేసుకుంటున్న పిఎంజె జ్యువెల్స్



ఈ అక్షయ తృతీయ సందర్భంగా, దక్షిణ భారతదేశంలో అత్యంత ఆదరణ పొందిన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్ అయిన పిఎంజె జ్యువెల్స్, అభిమానుల ఆదరణ పొందిన సెలబ్రిటీ జంట సుమ కనకాల మరియు రాజీవ్ కనకాల నటించిన తమ సరికొత్త టెలివిజన్ వాణిజ్య ప్రకటనను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. "రాజీవ్ ఐక్యూ వర్సెస్ సుమ జీబీ" అని పేరు పెట్టిన ఈ క్యాంపెయిన్, సాంప్రదాయంగా బంగారం కొనుగోలు చేసే ఈ కాలానికి ఒక చమత్కారమైన, అందరికీ సులభంగా అర్థమయ్యే ప్రజెంట్ చేశారు. "ఐక్యూ" అనేది తెలివితేటలకు కొలమానం కాగా, "జీబీ" అంటే గోల్డ్ బయింగ్ (బంగారం కొనడం). ఇది సుమ యొక్క అద్భుతమైన దూరదృష్టికి మరియు సంవత్సరాలుగా ఆమెకున్న తెలివైన పెట్టుబడి అలవాట్లకు నిదర్శనం.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.